

ముగిసిన నామినేషన్ల పరిశీలన

- పార్లమెంటుకు 15 ఆమోదం, 6 తిరస్కరణ
- అసెంబ్లీ స్థానాలకు 130 ఆమోదం, 41 తిరస్కరణ



నామినేషన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నియోజకవర్గం	దాఖలైనవి	తిరస్కరణ	ఆమోదం
నెల్లూరు (ఎంపీ)	21	5	15
అసెంబ్లీ			
నెల్లూరు నగరం	26	8	18
నెల్లూరు రూరల్	13	1	12
కావలి	25	10	15
కందుకూరు	25	1	24
కోవూరు	28	9	19
సర్వేపల్లి	17	4	13
ఆత్మకూరు	15	2	13
ఉదయగిరి	22	6	16
మొత్తం	171	41	130

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 26 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన శుక్రవారం ముగిసింది. నెల్లూరు పార్లమెంటు, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఆయా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో దాఖలైన నామినేషన్లను రిటర్నింగ్ అధికారులు పరిశీలించారు. పరిశీలన అనంతరం నెల్లూరు పార్లమెంటులో 21 నామినేషన్లు దాఖలవగా 15 ఆమోదం పొందాయి. ఆరు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. అలాగే 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 171 నామినేషన్లు దాఖలవగా 130 నామినేషన్లను ఆమోదించారు. 41 నామినేషన్లను తిరస్కరించారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో 29వ తేదీన ఒక్క రోజు మాత్రమే నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. అదేరోజు మధ్యాహ్నం 3.30 గంటలకు బరిలో ఉన్న అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తారు.

కిలో పొగాకు రూ.286

కలిగిరి: పొగాకు ధర రోజురోజుకు పెరుగుతోంది. శుక్రవారం కిలో గరిష్ఠ ధర రూ.286, కనిష్ఠ ధర రూ.218, సగటు ధర రూ.255.64గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు. వేలం కేంద్రానికి రైతులు 555 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 14 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 497 బేళ్లు కొనుగోలు చేశారు. నోసేల్-1, నోబిడ్-45, ఆర్‌ఆర్-2,సీఆర్-7, జంపింగ్‌లాట్స్-3 కారణాలతో 58 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి.





బాలకృష్ణను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు, పక్కన వేమిరెడ్డి, కోటంరెడ్డి

నెల్లూరు : గాంధీబొమ్మ సెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న బాలకృష్ణ

అభివృద్ధి కావాలా..

అరాచకం కావాలా!?

- అభివృద్ధి, సంక్షేమం ఎన్డీఏతోనే సాధ్యం
- ఇసుక, మట్టి అమ్ముకున్న వ్యక్తికి కందుకూరు టిక్కెటా!?
- నగరాన్ని అభివృద్ధి చేసింది టీడీపీనే
- విశాఖను దోచిన ఏ2 నెల్లూరులో వాలారు
- కాకాణి కళ్లు పడితే కబ్జానే..
- స్వర్ణాంధ్ర సాకార యాత్రలో బాలకృష్ణ

నెల్లూరు(ఆంధ్రజ్యోతి)/గుడ్లూరు, ఏప్రిల్ 26 : 'అభివృద్ధి కావాలా.. అరాచకం కావాలా... సంక్షేమం రాజ్యం కావాలా.. చీకటి రాజ్యం కావాలా... సమర్థవంతమైన పాలన కావాలా.. రాక్షస పాలన కావాలా... స్వర్ణయుగం కావాలా.. రాతియుగం కావాలా... ప్రజలే ఆలోచించుకోవాలి. మాయలు, మోసాలు, అరాచకాలు చేసేందుకు వైసీపీ సిద్ధం అంటోంది. మరోసారి వైసీపీ అధికారంలోకి వస్తే మీ భూములు మీవి కాకుండా పోతాయి. ఇక రాష్ట్రం వదిలి వెళ్లిపోవాల్సి వస్తుంది' అంటూ సినీ హీరో, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. స్వర్ణాంధ్ర సాకార యాత్రలో భాగంగా శుక్రవారం ఆయన జిల్లాలో పర్యటించారు. ముందుగా మండల కేంద్రమైన గుడ్లూరులో కందుకూరు అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి రోడ్ షో నిర్వహించి, బహిరంగ సభలో ప్రసంగించారు. ఆ తర్వాత రాత్రికి నెల్లూరు చేరుకున్న బాలయ్య నగరంలోని నవాబుపేట సెంటర్ నుంచి గాంధీబొమ్మ వరకు రోడ్ షో నిర్వహించి బహిరంగ సభలో ప్రసంగించారు. ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సిటీ, రూరల్ అభ్యర్థులు పొంగూరు నారాయణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలతో కలిసి ప్రచారాన్ని నిర్వహించారు. అడుగడుగునా బాలకృష్ణకు అభిమానులు, టీడీపీ నేతలు గజమాలలతో ఘన స్వాగతం పలికారు. కాగా, సభల్లో బాలకృష్ణ మాట్లాడుతూ కందుకూరు గడ్డపై తెలుగుదేశం జెండా ఎగరాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైసీపీ అభ్యర్థి బుర్రామధుసూదన్ కనిగిరిలో గడిచిన ఐదేళ్లలో చేసిన అభివృద్ధి ఏదీలేదన్నారు. ఇసుక, మట్టి అమ్ముకొని అక్కడ అరాచకపాలన సాగించిన వ్యక్తిని ఇప్పుడు కందుకూరుకు కేటాయించడం అంటే జగన్‌కు ఏమాత్రం అవగాహన కందుకూరుపై ఉందో అర్థమౌతుందన్నారు. ఇక నెల్లూరు నగరాన్ని అభివృద్ధి చేసిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. రూ.581 కోట్లతో భూగర్భ డ్రైనేజీ, రూ.582 కోట్లతో తాగునీటి పథకాల పనులు మొదలుపెట్టి 90 శాతం పూర్తి చేశామని, మిగిలిన పది శాతం పనులను వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని దుయ్యబట్టారు. నగరవాసుల కోసం ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్డును నిర్మిస్తే వైసీపీ ప్రభుత్వం దానిని నాశనం చేసిందని విమర్శించారు. బారాషాహీద్ దర్గాకు రూ.20 కోట్లు, రంగనాథ స్వామి ఘాట్ అభివృద్ధికి రూ.16 కోట్లు టీడీపీ ప్రభుత్వం వెచ్చించిందని గుర్తు చేశారు. రూ.56 కోట్లతో 100 పార్కులను అభివృద్ధి చేశామని చెప్పారు. విశాఖను దోచుకున్న ఏ2 విజయసాయిరెడ్డి ఇప్పుడు నెల్లూరుపై వాలారని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కాకమ్మ కబుర్లు చెప్పడంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దిట్టని అని, నోరు తెరిస్తే అబద్ధాలు చెబుతారని దుయ్యబట్టారు. కాకాణి కళ్లు పడితే కబ్జా అవ్వాల్సిందేనని ఆరోపించారు. రాజకీయం అంటే ప్రజా సేవని, కోర్టులో ఫైళ్లు దోచుకోవడం కాదని విమర్శించారు. జిల్లాకు వేమిరెడ్డి ఎంతో సేవ చేశారని, 150 వాటర్ ప్లాంట్లు పెట్టారని బాలకృష్ణ గుర్తు చేశారు. రాజధానితోపాటు నెల్లూరు నగరాభివృద్ధికి కృషి చేసిన వ్యక్తి నారాయణ అని కొనియాడారు. ప్రజాసేవలో ముక్కుసూటిగా మాట్లాడే వ్యక్తి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అని చెప్పారు. వీరిని గెలిపించాలని బాలకృష్ణ అభ్యర్థించారు. రోడ్‌షోలో బాలకృష్ణ వెంట టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ఇతర నాయకులు ఉన్నారు.



ప్రసంగిస్తున్న బాలకృష్ణ, పక్కన అభ్యర్థులు వేమిరెడ్డి, నారాయణ, కోటంరెడ్డి తదితరులు



గుడ్లూరు : నాగలితో అభివాదం చేస్తున్న బాలకృష్ణ, పక్కన కందుకూరు అభ్యర్థి ఇంటూరి

ఆత్మకూరు, బుచ్చిలలో నేడు ప్రజాగళం


- సభల్లో ప్రసంగించనున్న చంద్రబాబు

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు శనివారం నెల్లూరు జిల్లాలో పర్యటిస్తున్నారు. మధ్యాహ్నం 1 గంటకు హైదరాబాద్‌లో బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 3 గంటలకు ఆత్మకూరులోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ ఆవరణలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి బయలుదేరి నెల్లూరుపాలెం జంక్షన్‌కు చేరుకొని ప్రజాగళం సభలో ప్రసంగిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు బుచ్చిరెడ్డిపాళెంలో జరిగి సభలో పాల్గొంటారు. రాత్రికి కేవీఆర్ ఫంక్షన్ హాలులో చంద్రబాబు బస చేస్తారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాయి.

రోడ్డుపై చెత్తను ఎత్తాలి.. అందుకు పారిశుధ్య కార్మికులకు జీతాలు లేవు. కాలువల్లో పేరుకుపోయిన పూడిక తీయాలి.. అందుకు అవసరమైన మెటీరియల్ లేదు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలి, మరమ్మతులకు గురైన మోటార్లను బాగు చేయాలి.. కానీ అందుకు అవసరమైన నిధుల్లేవు. పాడైపోయిన వీధిలైట్ల స్థానంలో కొత్తవి వేయాలి.. కానీ పైసల్లేవు.... వెరసి ప్రజల ఆర్తనాదాలు, సర్పంచ్‌ల అవస్థలు.. ఇదీ గడిచిన ఐదేళ్లలో క్లుప్తంగా పంచాయతీల పాలన.

పంచాయతీలపై

దొంగదెబ్బ!



నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : పల్లెలే దేశానికి వెన్నెముక అన్నారు జాతిపిత మహాత్మా గాంధీ. అటువంటి పల్లెల స్వాభిమానాన్ని వైసీపీ ప్రభుత్వం అణచివేసింది. సొంతంగా పాలన సాగించుకునే గ్రామాల నిధులు, విధులు లాగేసుకొని తొక్కిపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి పైసా ఇవ్వకపోగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను కూడా లాగేసుకొని పంచాయతీ పాలనను నిర్వీర్యం చేసింది. గడిచిన ఐదేళ్లలో పంచాయతీల్లో చిన్న చిన్న పనులు చేసుకునేందుకు కూడా నిధుల్లేక విలవిల్లాడుతున్నాయి. దీనికితోడు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి పంచాయతీలపై మరింత ఆర్థిక భారాన్ని మోపింది. స్వతంత్ర భారత దేశంలో ఎప్పుడూ ఇటువంటి పరిస్థితిని చూడని సర్పంచ్‌లు రోడ్డెక్కి ఆందోళన చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

- ఖాతాల ఫ్రీజ్

రాష్ట్ర ప్రభుత్వ తీరుతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీల ఖాతాల్లో జమ చేస్తామని, అందుకు ప్రత్యేక అకౌంట్లు ఓపెన్ చేయాలని ఆదేశించింది. అలా తెరిచినా పంచాయతీల నిధులపై రాష్ట్ర ప్రభుత్వ పెత్తనం తగ్గలేదు. ఆఖరుకు జనరల్ ఫండ్ ఖాతాలను కూడా ప్రభుత్వం అనేకమార్లు ఫ్రీజ్ చేసింది. నిధులు అవసరమైనప్పుడల్లా పంచాయతీల జనరల్ ఫండ్‌ను లాగేసుకొని, అందులో నుంచి నిధులు డ్రా చేసుకునేందుకు వీల్లే కుండా ఫ్రీజ్ చేసేవారు. కొన్ని నెలల తర్వాత మళ్లీ లాగేసుకున్న నిధులను జమ చేశాక గానీ ఫ్రీజ్‌ను తొలగించే వారు కాదు. దీంతో పంచాయతీలు అనేక అవస్థలు పడ్డాయి.

రూ.395 కోట్లు ఏమయ్యాయి!?

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 970 పంచాయతీలు ఉన్నాయి. వీటికి 2019-20 నుంచి 2023-24 మధ్య కాలంలో 14, 15వ ఆర్థిక సంఘం నిధులు జమయ్యాయి. 2019-20లో రూ.66.15 కోట్లు, 2020-21లో 146.41 కోట్లు, 2021-22లో రూ.66.36 కోట్లు, 2022-23లో రూ.32.79 కోట్లు, 2023-24లో రూ.83.99 కోట్లు, మొత్తంగా గడిచిన ఐదేళ్లలో రూ.395.72 కోట్లు పంచాయతీలకు జమ అయ్యాయి. ఈ ఆర్థిక సంఘం నిధులను మూడు దఫాలు రాష్ట్ర ప్రభుత్వం లాగేసుకుంది. ఎందుకు తీసేసుకుందో కూడా పంచాయతీలకు చెప్పలేదు. దీనిపై సర్పంచ్‌లు పోరాడితే తీరా.. విద్యుత్ బకాయిలకు జమ చేసుకున్నట్లు ప్రకటించింది. అయితే అందుకు సంబంధించిన బిల్లులను మాత్రం పంచాయతీలకు ఇవ్వలేదు. ఒకవైపు ప్రభుత్వమేమో విద్యుత్ బిల్లులకు జమ చేసుకున్నట్లు చెబుతున్నా, ఇంకోవైపు విద్యుత్ శాఖ అధికారులు తమకు డబ్బులు జమకాలేదని, మీరు బిల్లు చెల్లించాలంటూ డిమాండ్ నోటీసులు జారీ చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం లాగేసుకున్న డబ్బులన్నీ ఎక్కడికి వెళ్లాయన్నది అర్థం కావడం లేదని పంచాయతీ వర్గాలు చెబుతున్నాయి. 29-03-2021, 21-11-2021, 22-02-2022 తేదీల్లో పెద్ద మొత్తంలో పంచాయతీల ఖాతాల్లో ఉన్న ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం తీసేసుకుంది. అయితే వీటిని ఆడిట్ అధికారులు కూడా విద్యుత్ బిల్లులకు జమ చేసినట్లు గుర్తించలేదు. ప్రభుత్వం తీసుకున్నట్లుగానే రిపోర్టుల్లో నమోదు చేయడం గమనార్హం.

ఎన్నో బిల్లుల పెండింగ్

ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులకు కూడా ఇంకా చాలా పంచాయతీల్లో బిల్లులు చెల్లించలేదు. ప్రజల నుంచి ఒత్తిడి పెరుగుతుండటంతో సొంత నిధులతో సర్పంచ్‌లు పనులు చేశారు. అయితే ఆ బిల్లులు తీసుకునేందుకు కూడా డబ్బుల్లేకపోవడంతో సర్పంచ్‌లు రోడ్డెక్కారు. గ్రామాల్లో అత్యవసర పనులు కూడా చేయలేకపోతున్నామంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రభుత్వంపై పోరాటానికి దిగారు. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. గత ప్రభుత్వంలో చాలా గ్రామాల్లో ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో వాటి నిర్వహణకు డబ్బుల్లేకపోవడంతో అనేక గ్రామాలు ఇప్పటికీ అంధకారంలోనే మగ్గుతున్నాయి. ఇది చాలదన్నట్లు పంచాయతీల నెత్తిన సచివాలయాల రూపంలో అదనపు భారం వచ్చి పడింది. సచివాలయాల నిర్వహణకు ప్రభుత్వం రూపాయి కూడా ఇవ్వకపోవడంతో ఆ ఖర్చులను కూడా పంచాయతీల ఖాతాల నుంచే భరిస్తున్నారు. వీటికి తోడు భవనాలకు వైసీపీ రంగులు వేయడం, ఆ తర్వాత కోర్టు ఆదేశాలతో వాటిని తొలగించడం వంటి ఖర్చులు కూడా పంచాయతీలను ఆర్థిక ఊబిలోకి నెట్టాయి. అందులోనూ ఆరోగ్య సురక్ష, ఆడుదాం ఆంధ్ర వంటి పలు కార్యక్రమాలు పంచాయతీలను నిండా ముంచాయి.

ఉత్సవ విగ్రహాల్లా మిగిలిపోయాం



వైసీపీ అధికారంలో వచ్చాక పంచాయతీలకు జమ అయిన నిధులను ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వాడేసుకుంటోంది. ముఖ్యంగా టీడీపీ మద్దతుతో గెలిచిన సర్పంచులకు పంచాయతీల్లో జరిగే సమావేశాలకు సమాచారం ఇవ్వకపోవడం, కనీస గౌరవ మర్యాదలు కూడా దక్కకపోవడం సర్పంచు పదవిని అవమానించినట్లేనని భావిస్తున్నాం. అధికార పార్టీకి ఊడిగం చేసే కొంతమంది అధికారుల తీరుతో సర్పంచుల వ్యవస్థ నిర్వీర్యం మారి ఉత్సవ విగ్రహాల్లా మిగిలిపోయాం.

- సూరేపల్లి మాధవ, గంగిరెడ్డిపాలెం, కలిగిరి

మా నమ్మకంపై నీళ్లు చల్లింది



అభివృద్ధి చేస్తామని ప్రజలు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని వైసీపీ ప్రభుత్వం వమ్ము చేసింది. నిధులు లేక పంచాయతీలు గబ్బుకొడుతున్నా ఏం చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయాం. అప్పులు చేసి కొంతకాలం, ప్రజల సహకారంతో పంచాయతీలను నెట్టుకొచ్చాము. పంచాయతీల్లో పైసాలేదు. మళ్లీ ఎన్నికలొస్తున్నాయని కంటితుడుపుగా నిధులు మంజూరైతే చేసిన అప్పులకు వడ్డీలు సరిపోలేదు. పంచాయతీలో జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిని ఎదుర్కొంటున్నాము.

- రజనీకాంత్, చెల్లాయపాళెం, బుచ్చిరెడ్డిపాళెం

రూ.15 లక్షలు ఖర్చు చేశా!



పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికైన నాటి నుంచి ఇప్పటి దాకా నా సొంత డబ్బు రూ.15 లక్షలు ఖర్చు చేశా. కేంద్రం నిధులిచ్చినా రాష్ట్ర ప్రభుత్వ దాష్టీకానికి బలైపోయాం. మంచి నీరు అందించాలన్నా.. వీధి లైట్లు వేయాలన్నా మా జేబుల్లోనుంచే పెట్టాల్సిందే. పంపు ఆపరేటర్ల జీతాలు, బ్లీచింగ్ కొనుగోలు తదితర పంచాయతీ నిర్వహణకు ఇప్పటి వరకు ఖర్చు చేసిన నిధులు తిరిగి వస్తాయో రావో కూడా తెలియదు.

- ఆట తిరుమల, పడమర గోగులపల్లి, అల్లూరు

రూ.70 లక్షలు లాగేసుకున్నారు!



నేను ఎస్టీ రిజర్వుడు సర్పంచ్‌ని. పంచాయతీ ప్రజలు ఎంతో నమ్మకంతో నన్ను సర్పంచ్‌ను చేశారు. కానీ వారిని సంతృప్తి పరిచేస్థాయిలో పనిచేయలేక పోతున్నా. లక్షల్లో అప్పులు చేసి పంచాయతీలో వీధిలైట్లు, మంచినీటి సరఫరా, మోటార్ల రిపేర్లు తదితర పనులు చేశాను. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులు రాష్ట్ర ప్రభుత్వం రూ.70లక్షలు లాగేసుకుంది. దీంతో పంచాయతీలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. వచ్చిన కొద్దిపాటి నిధులతో ప్రజలకు మౌలిక సదుపాయాలు, సిబ్బందికి జీతాలు ఇస్తూ కాలం వెళ్లదీస్తున్నాం. పంచాయతీలో చిన్నపాటి నిర్మాణపనులు కూడా చేయలేక బాధపడుతున్నాం.

- ఇండ్ల సుదాకర్, బ్రాహ్మణక్రాక, జలదంకి

ఏ పనీ చేయలేకపోతున్నాం

సర్పంచ్‌గా గెలిచినా పంచాయతీలో ఏ అభివృద్ధి పనులూ చేయలేకపోతున్నాము. కేంద్ర ప్రభుత్వం విడుదలచేసే ఆర్థిక సంఘం నిధులు ఇప్పటివరకు మూడుసార్లు పంచాయతీ ఖాతాకు జమ అయ్యాయి. అలా జమ అయిన వెంటనే ఖాతా నుంచి మాయమవుతున్నాయి. పంచాయతీలో మౌలిక వసతులైన వీధి లైట్లు, నీటి సరఫరా, స్వీపింగ్ తదితర పనులు చేసేందుకు డబ్బుల్లేవు. నా సొంత డబ్బులే ఖర్చు చేస్తున్నాం. గత ప్రభుత్వంలో పంచాయతీలో చేసిన పనులకు నగదు మంజూరుకు సదరు కాంట్రాక్టర్లు కోర్టు నుంచి ఆదేశాలు తెచ్చుకొని ఖాతాలో ఉన్న నగదును ఇవ్వాల్సి వస్తుంది. గత ప్రభుత్వంలో పంచాయతీకి కరెంటు బిల్లులు ఉండేవికావు. ఒకవేళ ఉన్నా ప్రభుత్వమే ఆ బిల్లులు చెల్లించి పంచాయతీలను ఆదుకునేవి. కానీ ఇప్పుడలా లేదు. ఆర్థిక సంఘం నిధులనే కరెంటు బిల్లులకు జమ చేసుకుంటున్నారు.

- బద్దిపూడి మాచర్ల, గుడవల్లూరు, కొండాపురం

ఆశలు రేపిన నిమ్మ

పొదలకూరు: మండు వేసవిలో నిమ్మ రైతుకు మంచి రోజులొచ్చాయి. రెండు రోజులుగా ధర పెరుగుతుండటంతో వారిలో ఆనందం వ్యక్తమవుతోంది. పొదలకూరు నిమ్మ మార్కెట్ యార్డులో శుక్రవారం క్వాలిటీ నిమ్మకాయల బస్తా ధర రూ.9500 పలికింది. ఈ ఏడాదిలో ఇదే అత్యధిక ధర. ఈ నెల మొదటి వారం నుంచి నాల్గవ వారం ప్రారంభం వరకు స్థిరంగా ఉన్న ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఈ నెల 22వతేదీ వరకు లూజు బస్తా ధర రూ.4వేలు నుంచి 5వేల వరకు ఉంది. మంగళవారం రూ.6వేలు ధర పలికింది. అయితే గురువారం ఒక్కసారిగా రూ.8వేలకు చేరుకుంది. శుక్రవారం మరో రూ.1500 పెరిగి రూ.9500లకు చేరుకుంది. పొదలకూరు మండలంలో సుమారు 5వేల హెక్టార్లలో నిమ్మ సాగవుతోంది. ఇక్కడ నుంచి కోల్‌కతా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్, పంజాబ్, పాట్నా, ఆగ్రా, గయ మార్కెట్‌లకు నిమ్మకాయలను ఎగుమతి చేస్తారు. ఒక్కో బస్తాలో 80 కిలోలు చొప్పున జాగ్రత్తగా పార్శిల్ చేసి పంపిస్తుంటారు. దేశమంతటా ఉష్ణోగ్రతలు పెరిగిన కారణంగా నిమ్మకాయలకు డిమాండ్ పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు.

ఆత్మకూరు ఉదయగిరి

రిజిస్ట్రేషన్ల తగ్గుముఖం

ఉదయగిరి, ఏప్రిల్ 26: ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లాలో రిజిస్ట్రేషన్లు తగ్గుముఖం పట్టాయని జిల్లా ఆడిట్ అధికారి రమేష్ తెలిపారు. శుక్రవారం ఉదయగిరి సబ్ రిజిస్ట్రార్ సాధారణ తనిఖీల్లో భాగంగా ఆయన రికార్డులు పరిశీలించి మాట్లాడారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం చేసేందుకు సిబ్బందికి సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

వింజమూరు, ఏప్రిల్ 26: పట్టణంలో అధికార పార్టీ నాయకులు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారని గ్రామ ప్రజలు చర్చించుకుంటున్నారు. స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని ట్యాంకి పక్కన వైసీపీ బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. అన్నిపార్టీల బ్యానర్లను తీసినా అధికార పార్టీ బ్యానర్ ఉంచడం ఏమిటని వాపోతున్నారు.



బారికేడ్లు ఏర్పాటు చేసిన పోలీసులు

తాత్కాలిక పనులొద్దు..శాశ్వత అభివృద్ధి కావాలి

సంగం, ఏప్రిల్ 26: సార్వత్రిక ఎన్నికల నామినేషన్లు ముగిశాయి. శుక్రవారం నామినేషన్ల తిరస్కరణను అధికారులు తేల్చడంతో ఎన్నికల రణరంగం జోరుగా సాగుతుంది. వచ్చే నెల 13వ తేదీన పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో పోటీలో ఉన్న అభ్యర్థులు పార్టీల తరుపున గ్రామ గ్రామాన సుడిగాలి పర్యటనలు చేస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. హామీలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓటర్ల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

తాయిలాలకు లొంగకూడదు



తాత్కాలిక తాయిలాల కంటే శాశ్వత అభివృద్ధి పథకాలు అమలు చేయగలిగిన అభ్యర్థులను ఎన్నుకుంటేనే సమాజానికి మేలు. ఇలాంటి వ్యక్తిత్వం ఉన్న వారికి ఓటు వేయాలి. కార్మిక, కర్షకుల ప్రగతికి సమ ప్రాధాన్యం ఇచ్చే నేతలు అవసరం. పారిశ్రామిక, వ్యవసాయ రంగాలు వెనుకబడితే ఆర్థిక వ్యవస్థలు పతనమవుతాయి.

కె.రవీంద్రరెడ్డి, సంగం

లౌకికతత్వం అవసరం : పెంచలయ్య, యోగా మాస్టర్, సంగం



ప్రజాస్వామ్యం పటిష్టంగా కొనసాగాలంటే లౌకికతత్వం పాటించే రాజకీయ పార్టీలనే గెలిపించుకోవాలి. కులమతాలు, వర్గ వైషమ్యాలు రెచ్చగొట్టే పార్టీలతో ప్రమాదం. మతాలు, వర్గాలను సమానంగా చూసే వారితో మేలు జరగకపోయినా కీడు జరగదు. ప్రజాస్వామ్యం, లౌకికతత్వం ఇలాంటి పదాలు రాజీయ నేతలు వల్లించడానికి బాగుంటున్నాయి. వాటికి కట్టుబడిన వ్యక్తులు, పార్టీలు తక్కువ. అలాంటి వ్యక్తులను చట్టసభలకు పంపితే అభివృద్ధికి అవకాశం.

ఉపాధికి భరోసా ఇవ్వాలి : చంద్రకాంత్, సిద్దీపురం



నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీలను ఎన్నుకోవాలి. ఉచితం పేరుతో చెప్పే తాయిలాలు మేలు చేయవు. చట్టసభల్లో సమస్యలు ప్రస్తావించి పరిష్కరించే సామర్థ్యం ఉన్న వారికి ఓటు వేయాలి. విద్య, వైద్యం ప్రతి ఒక్కరికీ ఉచితంగా అందేలా చర్యలు తీసుకుంటామన్న పార్టీని గెలిపించుకోవడం మంచిది.

నిజాయితీ కలిగి ఉండాలి



అభ్యర్థుల్లో నిజాయితీ పరులను ఎన్నుకోవాలి. పరిశ్రమలను స్థాపించే నేతలకు ఓటు వేస్తే నిరుద్యోగ సమస్య తీరుతుంది. మాయమాటలతో కాలక్షేపం చేసేవారిని తిరస్కరించాలి. లేదంటే మోసపోయి మరో ఐదేళ్లు ఇబ్బందులకు గురవుతారు.

ఉల్లాడి నరసయ్య, ఆర్ఎంపీ, సంగం

గాంధీబొమ్మ కూడలిలో ఉద్రిక్తత

- బాలయ్య పర్యటనకు భారీగా తరలివచ్చిన జనం
- అదే సమయంలో విజయసాయి ప్రచారం
- ఉత్కంఠ మధ్య భారీగా పోలీసు బందోబస్తు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 26: నెల్లూరు ట్రంకురోడ్డులో శుక్రవారం రాత్రి ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ నాయకులు, సినీ హీరో నందమూరి బాలకృష్ణ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సాయంత్రం నగరంలోని నవాబుపేట సెంటర్ నుంచి గాంధీబొమ్మ సెంటర్‌కు ర్యాలీగా చేరుకున్నారు. అక్కడ బాలకృష్ణ ప్రసంగించాల్సి ఉంది. అయితే అదే సమయంలో వైసీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి వీఆర్‌సీ కూడలి నుంచి గాంధీబొమ్మ వైపు ప్రచారం చేసుకుంటూ వస్తున్నారు. ఓ వైపు వేల సంఖ్యలో టీడీపీ అభిమానులు జై బాలయ్య అంటుంటే.... మరో వైపు విజయసాయి ప్రచారంలో భాగంగా డీజే సౌండ్స్‌తో జై జగన్ అన్న నినాదాలు వినిపించారు. దీంతో ట్రంకురోడ్డు ప్రాంతమంతా టెన్షన్ వాతావరణం నెలకొంది. చినబజారు, సంతపేట, దర్గామిట్ట పోలీసు స్టేషన్ల పోలీసులు పెద్ద సంఖ్యలో గాంధీబొమ్మ కూడలి వద్దకు చేరుకున్నారు. రాయాజీవీధి ఆంజనేయస్వామి గుడి వైపు విజయసాయి రెడ్డి ప్రచారం తిరుగుతుండటంతో ఆ ప్రాంతంలో బారికేడ్లను ఏర్పాటు చేశారు. టీడీపీ అభిమానులు గాంధీ బొమ్మ వైపు, వైసీపీ అభిమానులు ఆంజనేయస్వామి గుడి వైపు ఉండేలా రెండు వైపులా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి అక్కడికి చేరుకొని పోలీసులను అప్రమత్తం చేశారు. చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ ఎలాంటి వివాదాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇరువురు నేతల పర్యటనలు ప్రశాంతంగా సాగడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.

రెండు నామినేషన్ల తిరస్కరణ

ఆత్మకూరు, ఏప్రిల్ 26: నియోజకవర్గంలో శుక్రవారం జరిగిన స్క్రూటినీలో రెండు నామినేషన్లను తిరస్కరించారు. వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డికి డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన మేకపాటి పృథ్వీకుమార్‌రెడ్డి నామినేషన్ పాటు ఇండిపెండెంట్ అభ్యర్థి చెరుకూరు రంతూ నామినేషన్‌ను తిరస్కరించారు. మిగిలిన 13నామినేషన్లను అంగీకరించినట్లు రిటర్నింగ్ అధికారి మధులత తెలిపారు. టీడీపీ అభ్యర్థిగా ఆనం రామనారయణరెడ్డి, వైసీపీ అభ్యర్థిగా మేకపాటి విక్రమ్‌రెడి, కాంగ్రెస్ అభ్యర్థిగా చేవూరు శ్రీధర్‌రెడ్డి, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా రాజేశ్వరి, బీఎస్పీ అభ్యర్థిగా తోటగిరి కృష్ణ, సమాజ్‌వాజ్ అభ్యర్థిగా రామిశెట్టి వెంకటేశ్వర్లు, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ అభ్యర్థిగా షేక్ సుకూర్ నామినేషన్లతో పాటు 7మంది స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు అంగీకరించినట్లు ఆమె తెలిపారు.

12 నామినేషన్ల తిరస్కరణ

ఉదయగిరి రూరల్: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నామినేషన్ల పరిశీలన కార్యక్రమం చేపట్టారు. వచ్చిన 41నామినేషన్లలో 12నామినేషన్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజా రమేష్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. వాటిలో జాతీయ జనసేన, యుగతులసీ పార్టీల అభ్యర్థులు, పది మంది స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లు ఉన్నాయన్నారు. 16మంది నామినేషన్లను ఆమోదించామన్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం

సంగం, ఏప్రిల్ 26: స్థానిక మండల సమావేశం శుక్రవారం మొక్కుబడిగా జరిగింది. మండల అధ్యక్షురాలు పద్మావతమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయా శాఖల అధికారులు వారి శాఖలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎంపీడీవో శేషగిరిరావు మాట్లాడారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ బ్రహ్మయ్యకు సూచించారు. మరమ్మతులకు గురైన చేతిపంపులను గుర్తించి వెంటనే బాగు చేయాలని సూచించారు. వేసవిలో ఉపాధి పనులు వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం వ్యవసాయాధికారి శ్రీహరి మాట్లాడారు. నీటి కొరతతో మొక్కజొన్న, రాగులు, సజ్జలు, పెసలు, మినుము సాగు చేయాలన్నారు. ఎంఈవో జానికీరామయ్య మాట్లాడారు. వేసవిలో తరగతులు నిర్వహిస్తే యాజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. .

వింజమూరు: స్థానిక మండల కార్యాలయంలో ఎంపీపీ ఇనగనూరి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారుల నుంచి సమాచారాన్ని సేకరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ అంశాల మీద చర్చించలేదు. ఎంపీడీవో రాజేష్‌బాబు, ఉపాధ్యక్షుడు ఆనంగి రమణయ్య, జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ఉదయగిరి రూరల్: వైసీపీ ప్రభుత్వం ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తుందని దళిత, గిరిజన ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కలివెల ఎలీషాకుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కొంతమంది ఎస్సీ, ఎస్టీ నాయకులు పార్టీలు మారినా వైసీపీ ప్రభుత్వంపై బురదచల్లడం సబబు కాదన్నారు. ఎంపీటీసీలు గొల్లపల్లి తిరుపతి, సుభానీ, నాయకులు అక్కులరెడ్డి, అశోక్, సురేఖ బేబీ పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి.. హైలెవల్ కెనాల్‌ను పూర్తి చేయిస్తా!

- అనంతసాగరం ప్రచారంలో టీడీపీ అభ్యర్థి ఆనం

అనంతసాగరం, ఏప్రిల్ 26: మేకపాటి సోదరులకు మూడుసార్లు అవకాశం ఇచ్చారు. కానీ ఎలాంటి అభివృద్ధి చేయలేదు. నాకు ఒక్క అవకాశం ఇవ్వండి మెట్ట ప్రాంతాలకు నీరు ఇచ్చేలా నారా చంద్రబాబునాయుడు గారిని ఒప్పించి హైలెవల్ కెనాల్ పూర్తి చేయిస్తానంటూ ఆత్మకూరు కూటమి అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డితో కలసి ఆయన చాపురాళ్లపల్లి, గోగులపల్లి, వడ్డిపాలెం, బీ.అగ్రహారం, బొమ్మవరం, గుడిగుంట, ఎగువపల్లి, యాకర్లపాడు, చిలకలమర్రి, మంగుపల్లి, కామిరెడ్డిపాడు, గౌరవరం, సంజీవనగరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో నిర్వహించారు. అన్ని గ్రామాల్లో ఆనంకు మహిళలు, నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన హయాంలో ఆత్మకూరులో రూ.360 కోట్లతో అభివృద్ధి చేశానని చెప్పారు. మరో అవకాశం ఇచ్చి టీడీపీని గెలపిస్తే ఊహించని అభివృద్ధి చేసి చూపిస్తానని స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయ్యిందని ప్రజలు మేలుకొని టీడీపీ గెలుపుకు కృషి చేయాలని ఓటర్లను అభ్యర్థించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 20లక్షల మందికి ఉపాధి అవకాశాలు, నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి, ఇంట్లో ఎంతమంది ఉన్నా ప్రతి విద్యార్థికి రూ.15వేలు ఆర్థిసాయం అందజేస్తామన్నారు. అలాగే ఏటా రైతుకు రూ.20వేలు, అలాగే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన ప్రతి స్త్రీలకు నెలకు రూ.1500, దీపం పేరుతో ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా 3గ్యాస్ సిలిండర్లు అందజేస్తామన్నారు. యకర్లపాడులో కొందరు వైసీపీ శ్రేణులు టీడీపీలో చేరారు. మండలాధక్ష్యురాలు మునగపాటి సునీత, మెట్టుకూరు కృష్ణారెడ్డి, మాకిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, రాపూరు బుజ్జమ్మ, పీ.మధుసూదన్‌రెడ్డి, కే.సుబ్బారెడ్డి, జీ.శ్రీకాంత్‌రెడ్డి, చల్లా శివారెడ్డి, నర్సారెడ్డి, ఎస్ సుబ్బారావు, రాజయ్య నాయుడు, కే.తిరుపతి నాయుడు పాల్గొన్నారు.



అనంతసాగరం: ఆనం సమక్షంలో టీడీపీలో చేరిన యువత

మర్రిపాడు: ఎన్డీఏ కూటమి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డిని గెలిపించాలని బీజేపీ నాయకులు నందవరం ఎస్సీ కాలనీలో, రామానాయుడుపల్లిలో ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కంది మల్లికార్జునరెడ్డి, మండలాధ్యక్షులు మస్తాన్, వెంకటేశ్వర్లు, తిరుపతి నాయుడు, రమేష్ పాల్గొన్నారు.

తండ్రి ఆనం విజయం కోసం తనయ కైవల్యరెడ్డి ప్రచారం



ఆత్మకూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆనం కైవల్యారెడ్డి



మర్రిపాడు: కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

ఆత్మకూరు: ఆనం రామనారాయణరెడ్డి కుమార్తె ఆనం కైవల్యారెడ్డి మండుటెండలను లెక్కచేయకుండా టీడీపీ శ్రేణులతో కలిసి తండ్రి విజయం కోసం ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. శుక్రవారం ఆమె పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆత్మకూరు అభివృద్ధి ప్రదాత, కూటమి అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డిని, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికల్లో వైసీపీ కొట్టుకుపోవడం ఖాయమని టీడీపీ అధికారంలోకి వచ్చి ముఖ్య మంత్రిగా నారా చంద్ర బాబునాయుడు గద్దె నెక్కడం తథ్యమన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళా సంక్షేమానికి బాటలు వేస్తారని పేర్కొన్నారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో ఆందోళన



ఆందోళన చేస్తున్న పూసల కాలనీ వాసులు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 26: మా కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను తీర్చాలని పూసల కాలనీవాసులు శుక్రవారం ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీకి తాగునీటిని సరఫరా చేసే మంచి నీటి పథకం మోటారు కొన్ని రోజులుగా పాడైపోయినా మరమ్మతులు చేపట్టలేదన్నారు. పంచాయతీ సిబ్బంది మోటార్‌కు మరమ్మతులు చేసినా నీటి సరఫరా కావడం లేదన్నారు. ట్యాంకర్ల నీటికి ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొందన్నారు.

సీహెచ్‌సీలో క్లిష్టమైన శస్త్రచికిత్స

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 26: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సీహెచ్‌సీలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న యనమల రత్నమ్మకు పాదం గిరక వద్ద నరంను అతికించే ఆపరేషన్ చేసినట్లు వైద్యులు శివరాంసిద్ధా, డీడీవో డాక్టర్ అనీషా తెలిపారు. ఒకటిన్నర మాసం గిరక వద్ద నరం పైకెళ్లిందన్నారు. అతికష్టం మీద మేజర్ శస్త్రచికిత్సను విజయవంతం చేశామన్నారు. సాధారణంగా సీహెచ్‌సీలో పండికట్లు, కణుతుల తొలగింపు శస్త్రచికిత్సలు జరుగుతుంటాయన్నారు. ఉదయగిరి సీహెచ్‌సీలో ఇంతవరకు ఇలాంటి శస్త్రచికిత్స జరగలేదన్నారు. వైద్యులు అనీషా, షంషుద్దీన్‌లు సైతం శస్త్రచికిత్సకు సహకరించారన్నారు. ఆర్థోకు సంబంధించి రాబోయే రోజుల్లో కూడా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా కృషి చేస్తామన్నారు.



పాపిరెడ్డి చెరువు స్థలంలో భవన నిర్మాణానికి చేసిన శంకుస్థాపన

కావలిలో రూ. కోటి స్థలం కబ్జా

- పశువులపాక, గడ్డివాము పేరుతో వైసీపీ నేత ఆక్రమణ
- ఎన్నికల వేల నిర్మాణానికి సిద్ధం

కావలి, ఏప్రిల్ 26 : ఎన్నికల వేళ అధికార యంత్రాంగం బిజీబిజీగా ఉండటంతో సందట్లో సడేమియా అన్నట్లు ప్రభుత్వ స్థలాలు ఎక్కడ కనిపిస్తే అక్కడ ఆక్రమణకు సిద్ధమవుతున్నారు వైసీపీ నాయకులు. కావలి రామ్మూర్తి పేటలోని పాపిరెడ్డిచెరువులో సుమారు రూ. కోటికి పైగా విలువ గలిగిన స్థలాన్ని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ముఖ్యఅనుచరుడు, 13వ వార్డు వైసీపీ నాయకుడొకరు ఆక్రమించాడు. అక్కడ భవన నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశాడు. దీంతో స్థానికల్లో కలకలం బయలుదేరింది. ముఖ్యంగా కావలిలో వైసీపీ నేతలు, వారి అనుచరులు చెరువుల లోతట్టు ప్రాంతాల స్థలాలను ఆక్రమించి తొలుత పశువులు కట్టేసుకుంటారు. ఆ తర్వాత వాటి మేతకు వరిగడ్డి వాములు వేసుకున్నా మంటూ ఆ స్థలాన్ని వారు స్వాధీనం చేసుకుంటారు. ఆ తర్వాత అక్కడ రేకులు షెడ్లు వేసి పెడతారు. వాటిపై అభ్యంతరాలు రాకపోతే వాటిల్లో ఏకంగా నిర్మాణాలు చేపడతారు. ఎన్నికల వేళ ఇటీవల మందాటి చెరువులో ఇలాగే ఆక్రమించి నిర్మాణాలు చేపట్టగా ఆంధ్రజ్యోతిలో కథనం రాగా, వాటిని తాత్కాలికంగా నిలుపుదల చేశారు. తాజాగా పాపిరెడ్డి చెరువులో కూడా ఇలాంటి నిర్మాణాలకు శుక్రవారం శంకుస్థాపన చేయటంతో ఆ ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు.

విచారించి చర్యలు

అక్కడ ఆక్రమించిన స్థలాన్ని పరిశీలించి, అది ప్రభుత్వ స్థలమని తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. భవన నిర్మాణానికి తీసిన గుంతలను పూడ్చుతాం.

\- బాబూరావు, పట్టణ ప్రణాళికాధికారి, కావలి

అన్నివర్గాలకు సంక్షేమం తెలుగుదేశంతోనే సాధ్యం

- పల్లెల్లో కాకర్ల ప్రవీణ విస్తృత పర్యటన

వరికుంటపాడు, ఏప్రిల్ 26: నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ సతీమణి ప్రవీణ శుక్రవారం గణేశ్వరాపురం, నారసింహాపురం, తూర్పురొంపిదొడ్ల, తూర్పుకొండారెడ్డిపల్లి, దక్కనూరు, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేసి ఓట్లు అభ్యర్థించారు. ప్రజాసేవే ధ్యేయంగా అడుగులు వేస్తున్న తన భర్తతో పాటు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీలో గెలిపించాలని కోరారు. అన్నివర్గాలకు సంక్షేమం, అభివృద్ధి సమానంగా అందాలంటే తెలుగుదేశంతోనే సాధ్యమన్నారు. ప్రధానంగా పరిశ్రమలను నెలకొల్పి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా సూపర్ సిక్స్ పథకాలకు రూపకల్పన చేశారన్నారు. రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా తెలుగుదేశం అధికారంలోకి తీసుకొచ్చి చంద్రబాబునాయుడును ముఖ్య మంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మహిళలు ఆమెకు గ్రామాల్లో ఘన స్వాగతం పలికారు. గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పేరం సుధాకర్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, భాస్కర్ రెడ్డి, వేమూరి సురేష్, చినబ్రహ్మయ్య, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

సీతారామపురం: రాజాకాం ఫ్లెక్స్‌లో మండల కోఆర్డినేటర్ చింతల శ్రీను, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు ఆధ్వర్యంలో నూతన తెలుగుదేశం కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథి కాకర్ల సునీల్ సతీమణి కాకర్ల సురేఖ హాజరై రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, చెన్నకేశవులు, బోగినేని కాశిరావు, పిడుగు రమేష్, పాలి శెట్టి శ్రీను, సర్పంచ్ భాగ్యకుమారి, మాజీ జెడ్పీటీసీ కలివెల జ్యోతి, తమ్మిశెట్టి వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచల బాబుయాదవ్ అప్పసముద్రం పంచాయతీలోని మసీదుపల్లి, నడింపల్లిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. రాష్ట్రంలో 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి విధులు, నిధులు లేకుండా చేసిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. బీసీలను అన్నివిధాలుగా అభివృద్ధి చేసిన పార్టీ టీడీపీయే అన్నారు.



వరికుంటపాడులో ప్రచారం నిర్వహిస్తున్న కాకర్ల ప్రవీణ

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): నందిపాడు, సోమలరేగడ, నాయుడుపల్లి గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నెల్లూరు పార్లమెంట్, ఉదయగిరి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో గొల్లపల్లి శ్రీనివాస్‌మాదిగ, మోహన్‌రావు, పందిటి అంబేద్కర్, గంగపట్ల సింహాద్రి, అర్జున్, ఆనంద్‌రావు పాల్గొన్నారు.

కొండాపురం: ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ కొమ్మి పంచాయతీ కుంకువారిపాలెం గ్రామం నుంచి తన సతీమణి ప్రవీణతో కలసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. మొదట మహాలక్ష్మమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో ప్రతి ఒక్కరూ నష్టపోయారని, ముఖ్యంగా చదువుకున్న యువత ఉద్యోగ అవకాశాలు లేక ఇతర రాష్ట్రాలకు వెళుతున్నారని చెప్పారు. నియోజకవర్గ ప్రజలకు వైద్యసదుపాయాలు పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. బీసీ డిక్లరేషన్ కింద 50 సంవత్సరాలు నిండిన బీసీలకు పింఛను అందలేదని వాపోయారు. కుంకువారిపాలెం చెరువుకు సోమశిల హైకెనాల్ నుంచి లిఫ్ట్ ద్వారా నీటిని ఇచ్చేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం రామానుజపురం, కొమ్మి, సత్యవోలు అగ్రహారం గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్నారు. టీడీపీ మ్యానిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఉదయగిరి ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు. చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే ప్రతి ఒక్కరికీ న్యాయం జరగడంతోపాటు రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్రకార్యదర్శి శాంతమ్మ, మన్నేటి వెంకటరెడ్డి, కన్వీనర్ ఎమ్. ఓంకారం టీడీపీ నాయకులు బొట్లగుంట హరిబాబు, చెరుకూరు వెంకటాద్రి, గద్దె రామక్రిష్ణ, గద్దె రాఘయ్య, గంజాం రాఘవేంద్ర, ఆకుల వెంకట్, ఆకుల మహేష్, షేక్ ఖాసిం, చెరుకూరు శేషయ్య, యారవ క్రిష్ణయ్య పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కాకర్ల సురేఖ



కొండాపురం: మాట్లాడుతున్న కాకర్ల సురేష్

సోమశిలలో 8.289 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, ఏప్రిల్ 26: సోమశిల డ్యాం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శుక్రవారానికి ప్రాజెక్టులో 8.289 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర కాలువకు 5, దక్షిణ కాలువకు 25 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

నేలబావిలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం

బిట్రగుంట, ఏప్రిల్ 26: బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప అల్లిమడుగు సంఘం గ్రామ తూర్పు శివారు పొలాల్లోని నేల బావిలో శుక్రవారం గుర్తు తెలియని 30-35 ఏళ్ల యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై బోజ్యా ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాని వెలికి తీయించారు. మృతుడి కుడి చేతిపై వెంకీ సరోజినీ, కుడి భుజంపై సింబల్ పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

వింజమూరు ఏపీఎం సస్పెన్షన్

- మహిళా మార్టు అక్రమాలపై చర్యలు

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 26 : వింజమూరు మహిళా మార్టులో అక్రమాలకు సంబంధించి ఏపీఎం సాలిమ్‌రోజ్‌ను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కేవీ సాంబశివారెడ్డి సస్పెండ్ చేశారు. వింజమూరు మహిళా మార్టులో లోకల్ బ్రాండ్ వస్తువుల కొనుగోలు చేయరాదనే నిబంధన ఉన్నా ఏపీఎం కొనుగోలు చేయించారని, అప్పులు ఇవ్వకూడదనే నిబంధన ఉన్నా అప్పులు ఇచ్చారని, ఇవేకాకుండా ఇతర ఆరోపణలు ఏపీఎం సాలిమ్‌రోజ్‌పై ఉన్నాయని పీడీ పేర్కొన్నారు. ఆయా ఆరోపణలు రుజువు కావటంతో సస్పెండ్ చేశామని చెప్పారు. అక్కడి మహిళామార్టులో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకోవటంతో, ఆ ప్రాంతానికి చెందిన పొదుపు మహిళలు ఇటీవల పెద్ద సంఖ్యలో డీఆర్‌డీఏ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేశారు. ఏపీఎంపై చర్యలు తీసుకోవాలని పీడీని కోరారు. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన ప్రాజెక్టు డైరెక్టర్ ఏపీఎంను సస్పెండ్ చేశారు.

గ్రామ, వార్డు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 26 : గ్రామ, వార్డు ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు అర్లయ్య కోరారు. శుక్రవారం నగరంలోని ఏపీఆర్ఎస్ఏ భవన్‌లో ఆ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ఏర్పడి దాదాపు ఐదేళ్లు గడుస్తున్నప్పటికీ ఉద్యోగుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయన్నారు. ఉన్నతాధికారులకు విన్నవించినా సమస్యలు పరిష్కారం కావడంలేదన్నారు. ఆర్థిక పరమైన సర్వీసు అంశాలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	141
లేయర్ లైవ్	93
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	280
లేయర్	158

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6899
వెండి కిలో ధర	రూ. 83,900
వెండి ఒక గ్రాము	రూ. 85.90

కావలి కందుకూరు

బాలుడి వైద్యం కోసం ఆర్థిక సాయం

కావలిటౌన్, ఏప్రిల్ 26: నిరుపేద కుటుంబానికి చెందిన చిన్నారి చిరంజీవి అనారోగ్యంతో బాధపడుతుండగా శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.45,000 ఆర్థిక సాయమందించారు. ట్రస్ట్అధ్యక్షురాలు పొన్నగంటి మాధవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ఐక్యవేదిక గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాషా చిరంజీవి తల్లి మాలశ్రీకి నగదు అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

శీతల చలివేంద్రం ప్రారంభం

కావలిటౌన్, ఏప్రిల్ 26: కావలి తాలూకా పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ట్రంకురోడ్డు ఫైర్ ఆఫీస్ వద్ద శీతల చలివేంద్రం ప్రారంభించారు. ఈ ప్రాంతంలోని ప్రభుత్వ కార్యాలయానికి వచ్చే ప్రజల కోసం దీనిఇ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఆకుల రమణయ్య, అసోసియేట్ అధ్యక్షుడు రవి కుమార్, కార్యదర్శి సాయిరాంసింగ్, వెంకయ్య, ఆదిశేషులు, కృష్ణారావు, సాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణ పర్యటనతో యూత్‌లో హుషారు

- అంచనాలకు రెట్టింపుగా తరలివచ్చిన యువత
- ఈలలు, కేరింతలతో బాలయ్య ప్రసంగానికి ప్రోత్సాహం

కందుకూరు, ఏప్రిల్ 26: సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పర్యటన యువతలో హుషారు పెంచింది. కందుకూరు నియోజకవర్గం గుడ్లూరులో బాలకృష్ణ బహిరంగ సభకు, అంతకుముందు తెట్టు జంక్షన్ నుంచి గుడ్లూరు వరకు జరిగిన మోటారు సైకిల్ ర్యాలీకి అంచనాలకు మించి యువత తరలిరావడమే కాక కార్యక్రమం ఆద్యంతం కేరింతలు కొడుతూ పాల్గొనటంతో టీడీపీ నాయకుల్లో ఆనందం వెల్లివిరిసింది. మండుటెండను సైతం లెక్కచేయకుండా శుక్రవారం మధ్యాహ్నం నుంచే గుడ్లూ రుకు, జాతీయ రహదారిపై తెట్టు జంక్షన్‌కు చేరుకున్న యువకులు సాయంత్రం 4 గంటల వరకు బాలకృష్ణ కోసం నిరీక్షించి ర్యాలీలో వారు చేసిన సందడి యువతలో తెలుగుదేశం పార్టీకి పెరిగిన ఆదరణను సుస్పష్టం చేసింది. రెండు రోజుల క్రితమే తెలుగు దేశం నామినేషన్ కార్యక్రమం కోసం పెద్దఎత్తున జనసమీకరణ చేసి ఉండ టంతో మళ్లీ బాలకృష్ణ కార్యక్రమానికి జనసమీకరణ అంటే ఇబ్బందిగా ఉం టుందని భావించిన నేతలు కేవలం గురు, శుక్రవారాలలో మైకు ప్రచారం చేసి వదిలేశారు. అంతేగాక కందుకూ రులో అయితే భారీగా జనం వస్తారు కానీ గుడ్లూరు అంటే కష్టమన్న అభిప్రాయం తోనూ ఉన్నారు. అయినప్ప టికీ అంచనాలకు మించి యువకులు తరలిరావటం ముఖ్యంగా మహిళలు, యువతులు, విద్యార్థినీ విద్యార్థినిలు వేలాదిగా తరలిరావటమే గాక బాలకృష్ణ ప్రసంగాన్ని ఆసక్తిగా వింటూ ఆయన మాటలకు ఈలలు కేకలతో మరింత ప్రోత్సాహాన్ని కల్పించడం విశేషం. బాలకృష్ణ పర్యటన అంటే జన సమీకరణ చేయకున్నా స్వచ్ఛందంగా ఐదారు వేలమంది తరలివస్తారన్న టీడీపీ నేతలు అంచనాలు తలకిందులు చేస్తూ అంతకు రెట్టింపుగా యువత తరలిరావటంతో గుడ్లూరు సెంటర్ కిక్కిరిసిపోయింది. గుడ్లూరులో బాలకృష్ణ పర్యటన విజయవంతం కావడంతో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కందుకూరు అసెంబ్లీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావులు విజయ దరహాసంతో విక్టరీ సింబల్ చూయిస్తూ కార్యక్రమంలో పాల్గొనటం విశేషం. బాలకృష్ణ పర్యటనకు లభించిన విశేష ఆదరణ ప్రజల్లో టీడీపీ పట్ల ఉన్న అభిమానానికి నిదర్శనంగా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



అభిమానులు, పార్టీ శ్రేణులకు విక్టరీ సింబల్ చూపుతున్న బాలకృష్ణ, పక్కన వేమిరెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు


గుడ్లూరు పర్యటన కోసం వచ్చిన బాలకృష్ణకు కావలిలో ఘన స్వాగతం పలుకుతున్న ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు

పాలూరు ఎస్సీ కాలనీలో పలువురు టీడీపీలో చేరిక

కందుకూరు, ఏప్రిల్ 26: కందుకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలోకి వలసల పర్వం కొనసాగుతోంది. కందుకూరు మండలంలోని పాలూరు ఎస్సీ కాలనీలో పలు కుటుంబాల వారు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎస్సీ కాలనీకి చెందిన జలదంకి సురేష్, ఉపసర్పంచ్ దంతం సౌమ్య, దంతం ఏసుబాబు, ఆదిపోగు ప్రసాద్, రావినూతల కోటేషు, సర్వేపల్లి వంశీ, రావినూతల శ్రీనివాసులు, దంతం బాలకోటయ్య, మోషే, చినకొండయ్య, ప్రకాశం, రావినూతల కొండలరావు, రావినూతల కళ్యాణ్, రావినూతల సురేంద్ర, జలదంకి ఇజ్రాయిల్, అంగులకుర్తి ఏసుమణి, గౌడపేరు రమేష్, ఎండ్లూరి ఆదెమ్మ, దంతం విజయకుమారి, దంతం చినకోటయ్య, రావినూతల మాలకొండయ్య, జలదంకి ఏసోబు, వినోద్ తదితర కుటుంబాల వారికి టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీకి మద్దతిచ్చిన ప్రతిఒక్కరికీ భవిష్యత్తులో తగినప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు నూరే వినోద్‌కుమార్‌రెడ్డి, జలదంకి సురేష్, మండల పార్టీ అధ్యక్షుడు నార్నె రోశయ్య, పార్టీ నాయకులు ఎస్వీ సుబ్బారావు, గొట్టిపాటి హరికృష్ణ, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రావుల రవి తదితరులు పాల్గొన్నారు.


పాలూరు ఎస్సీ కాలనీ వాసులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు

ప్రచార అస్త్రంగా... ట్రంకురోడ్డు విస్తరణ!

- ఐదేళ్లు పదే పదే చెప్పిన ఎమ్మెల్యే
- కార్యరూపం దాల్చని హామీలు
- వ్యాపారంగా మారిన ఆక్రమణల తొలగింపు
- టీడీపీ సానుభూతిపరులే టార్గెట్‌గా ధ్వంసం
- అసంపూర్తిగా సైడ్ కాలువల నిర్మాణం

కావలిటౌన్, ఏప్రిల్ 26: కావలి ట్రంక్‌రోడ్డు విస్తరణ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి ప్రచార అస్త్రంగా మారింది. గడిచిన ఐదేళ్లలో వంద కోట్లతో పనులు చేపడుతున్నట్లు పదే పదే తెగ ప్రచారం చేసుకున్నారు. ఆయన పదవీ కాలం ముగుస్తోంది తప్ప హామీ మాత్రం కార్యరూపం దాల్చలేదు. రోడ్డు విస్తరణ పనులు అంగుళం ముందుకు కదలకపోయినా రోడ్డుకు ఇరు వైపుల చేపట్టిన సైడ్ కాలువల నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో రోడ్డుపై ఎక్కడి మురుగు అక్కడే నిల్వ చేరి దుర్గంధభరితంగా మారింది. వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ట్రంకురోడ్డు అభివృద్ధికి వంద కోట్లు మంజూరయ్యాయని, ముందుగా సైడ్ కాలువ నిర్మాణం చేపట్టి అనంతరం రోడ్డు వెడల్పు పనులు, డివైడర్లు, ఆకర్షణీయంగా చెట్లు, సెంట్రల్ లైటింగ్, చేపడతామన్న ఎమ్మెల్యే హామీ నీటి మూటలుగా మిగిలాయి.


ట్రంకురోడ్డులో నిలిచిపోయిన కల్వర్టు నిర్మాణం


ఆటోనగర్ వద్ద అసంపూర్తిగా కాలువ పనులు

- ట్రంకురోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా అప్పట్లో వైసీపీ నేతల కనుసన్నల్లో ఆర్అండ్‌బీ అధికారులు చేపట్టిన ఆక్రమణల తొలగింపు వ్యాపారంగా మారి అధికారులు, నేతలు జేబులు నింపుకున్నారు. సైడ్ కాలువల నిర్మాణం పేరుతో అధికారులు మొదటి రెడ్ మార్కింగ్ వేశారు. అధికారపార్టీ నేతలు పైకం పుచ్చుకుని అధికారులకు వాటా ఇచ్చి సిఫారసు చేసిన గృహాలకు మినహాయింపు ఇచ్చారు.
- ఆక్రమణల తొలగింపులో టీడీపీ నేతలు, సానుభూతిపరుల టార్గెట్‌గా హడావుడిగా గృహాలు, ప్రహరీ గోడలు నిర్ధాక్షిణ్యంగా పగలగొట్టారు. అయితే 5 ఏళ్లు గడిచినప్పటికీ కాలువల నిర్మాణం అసంపూర్తిగా వదిలేయడమేకాక ట్రంకురోడ్డు విస్తరణ పనుల ఊసేలేదు.

● దుర్గంధ భరితం

పట్టణంలోని బృందావనం హౌసింగ్ కాలనీ వద్ద నుంచి ముసునూరు చివరి వరకు ట్రంకురోడ్డుకి ఇరువైపుల సైడ్ కాలువల నిర్మాణం ప్రారంభించి దాదాపు 4 ఏళ్ళు పూర్తి కావస్తోంది. కాలువల నిర్మాణం పూర్తిగా చేయక అసంపూర్తిగా వదిలివేయడంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతం. ముక్కలు ముక్కలుగా కాలువ నిర్మాణ పనులు చేపట్టి వాటిని అనుసంధానం చేయకపోవడంతో కాలువల్లో మురుగు ఎక్కడికక్కడ నిల్వ చేరి దుర్గంధం వెదజల్లడమేకాక ప్రాంతీయుల మధ్య వివాదాలకు దారి తీస్తోంది.

● అవస్థల్లో ప్రజలు

అక్కడక్కడ కనెక్షన్ రోడ్ల వద్ద కాలువ నిర్మాణం కోసం తవ్వి కల్వర్ట్‌ల నిర్మాణం చేపట్టక వదిలివేయడంతో రాకపోకవలు సాగించేందుకు నానా ఇబ్బందులు పడ్డ ప్రజలు స్థానికులందరూ కలిసి వారే మట్టితో గుంటలను పూడ్చుకుని రాకపోకవలు సాగిస్తున్నారు. అరకొరగా కాలువ నిర్మాణం చేపట్టిన ప్రాంతాల్లో చుట్టుపక్కల ప్రజలు సైడ్‌కాలువల్లో పైపులు వదులుకోవడంతో మురుగు ముందుకు ప్రవహించకపోవడంతో ట్రంకురోడ్డు ఆనుకుని ఉన్న గృహాలు, షాపుల యజమానులు దుర్గంధం భరించలేక స్థానికుల మధ్య వివాదాలకు దారితీస్తోంది. కాలువల నిర్మాణానికి ఎప్పటికి మోక్షం లభిస్తుందో వేచి చూడక తప్పదు.

ట్రంకురోడ్డు విస్తరణ పేరుతో విధ్వంసం

ట్రంకురోడ్డు విస్తరణ పేరుతో టీడీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకుని వారి ఆస్తులను ధ్వంసం చేసారేగాని రోడ్డు విస్తరణ పనులు అంగుళం జరిగిన పాపాన పోలేదు. అధికారులు వైసీపీ నేతల కనుసన్నల్లో అడ్డగోలుగా ఆక్రమణల తొలగింపు చేపట్టి పక్షపాతంగా వ్యవహరించారు. ఆటోనగర్ వద్ద కల్వర్ట్ నిర్మాణం చేపట్టిన ప్రదేశంలో రోడ్డు దరిద్రంగా మారి వాహనాలు రాకపోకలు సాగించడం నరకంగా మారింది.

- వెంకటేశ్వర్లు, ముసునూరు

మిషన్ లెర్నింగ్ అండ్ డీప్ లెర్నింగ్ పుస్తకావిష్కరణ

బిట్రగుంట, ఏప్రిల్ 26: బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ పీ.దిలీప్‌కుమార్, ఏ.నందినిలు రూపొందించిన మిషన్ లెర్నింగ్ అండ్ డీప్ లెర్నింగ్ పుస్తకాని ప్రిన్సిపాల్ వీవీఎస్ రెడ్డి శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడుతూ ఈ పుస్తకంలో పొందుపరచిన విషయాలు బీటెక్ విద్యార్థులకు ఎంతగానో తోడ్పడుతాయని తెలిపారు. ఈ పుస్తకపు ప్రత్యేకత మిషన్ రన్నింగ్ టెక్నిక్స్, రోల్ ఆఫ్ డీప్ లెర్నింగ్ ఇన్ ఇంప్రూవింగ్ హెల్త్ కేర్, రోల్ ఆఫ్ ఎంఎల్ అండ్ డీ ఎల్ ఆన్ కోవిడ్ మేనేజ్‌మెంట్ పై ఫోకస్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఆర్వీ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా 'ఉపాధి' పనులు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 26 : మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. శుక్రవారం 2400 మంది కూలీలు పనులకు హాజరైనట్లు ఏపీవో ఉమామహేష్ తెలిపారు. నలదలపూరులో మాత్రమే పనులు ప్రారంభం కాలేదు. వలేటివారిపాలెం, జమీన్‌ఉప్పలపాడు గ్రామాల్లో వ్యవసాయ పనులు జరుగుతున్నందున తక్కువ సంఖ్యలో కూలీలు హాజరయ్యారు. ప్రతి రోజూ ఉదయం 6 గంటలకే కూలీలు పనులకు వెళ్లి వడదెబ్బకు గురికాకుండా 10 గంటలకు ఇళ్లకు వచ్చేస్తున్నారు.


కళవళ్లలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కందుకూరులో ఒక నామినేషన్ తిరస్కరణ

కందుకూరు, ఏప్రిల్ 26: కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 25 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా శక్రవారం జరిగిన స్క్రూట్నీలో ఒకరి నామినేషన్ తిరస్కరించారు. మిగిలిన 24 మంది నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టరు విద్యాధరి ఆమోదించారు. టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య టీడీపీ అభ్యర్థిగా వేసిన నామినేషన్‌కు బీఫాం సమర్పించకపోవటంతో ఆమె నామినేషన్‌ను తిరస్కరించారు. వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ సతీమణి లక్ష్మి కూడా నామినేషన్ వేసినప్పటికీ ఆమె ఇండిపెండెంట్‌గా తన నామినేషన్‌ను దాఖలు చేయటంతో ఆమె నామినేషన్‌ను ఆమోదించారు.

కావలిలో 10 నామినేషన్లు...

కావలి : కావలి అసెంబ్లీ నియోజకవర్గంలో 25 మంది నామినేషన్లు వేశారు. నామినేషన్ల పరిశీలన అనంతరం వివిధ కారణాలతో 10 నామినేషన్లను తిరస్కరించినట్లు కావలి రిటర్నింగ్ అధికారి శీనానాయక్ తెలిపారు. తిస్కరణకు గురైనన వారిలో వైసీపీ నుంచి రామిరెడ్డి ఆదిలక్ష్మి, టీడీపీ నుంచి దగుమాటి సంహిత, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి లేళ్లపల్లి సురేష్‌బాబు, రెవల్యూషన్ సోషలిస్ట్ పార్టీ నుంచి గోసల రవికాంత్, జైభీమ్‌రావు భారత్‌పార్టీ నుంచి మైనంపాటి ఏసురత్నం, సమాజవాదిపార్టీ నుంచి లత ఆనం, యంగ్‌సీనియర్‌రిచ్ కామన్ పీపుల్‌కింగ్స్ పార్టీ నుంచి ఉప్పాల రవికిరణ్, స్వతంత్ర అభ్యర్థులు రాచూరు వెంకటసుబ్బారావు, గాలి రవి, బచ్చల సంధ్యారాణిలు ఉన్నట్లు ఎన్నికల రిటర్నిగ్ అధికారి తెలిపారు.

జగన్ పాలనపై విసుగెత్తిన ప్రజలు

- కావలి ఎమ్మెల్యే అరాచకాలకు అడ్డూ అదుపు లేదు
- కావలి రూరల్, పట్టణంలో కావ్య విస్తృత ప్రచారం


కావలి 30వ వార్డులో టీడీపీ కార్యాలయం ప్రారంభిస్తున్న క్రిష్ణారెడ్డి


బిట్రగుంట ప్రసన్నుడి ఆలయ చైర్మన్ శ్రీరాం మాల్యాద్రితో కావ్య


కావలి, ఏప్రిల్ 26: ఈ ఐదేళ్లలో సైకో జగన్ పాలనతో విసిగి వేసారిన ప్రజలు చంద్రబాబు నాయుడు సారథ్యంలోని టీడీపీ ప్రభుత్వం కోసం ఎదురు చూస్తున్నారని టీడీపీ కూటమి అభ్యర్థి దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం ఆయన కావలి పట్టణంలో 28, 30 వార్డులలో, సాయంత్రం కావలి రూరల్ మండలం చెంచుగాని పాలెం, చెన్నాయపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రూరల్ మండలంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్నివిధాలా భ్రష్టు పట్టించిన జగన్ రెడ్డి తన కుటుంబంలోనే చెల్లెళ్ల అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నీళ్లు నములుతున్నారన్నారు. వైసీపీకి ఓటు వేస్తే విధ్వంసమేనని ప్రతి ఒక్కరూ రాష్ట్ర భవిష్యత్తు, మీ బిడ్డ భవిష్యత్తును గుర్తు పెట్టుకుని టీడీపీకి ఓటు వేసి చంద్రబాబు నాయుడిని సీఎంగా చేసుకోవాలన్నారు. కావలి ఎమ్మెల్యే అరాచకాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందని ఇసుక, మట్టి, గ్రావెల్ తదితర సహజవనరులు అన్నీ దోపిడీ చేశారన్నారు. అవినీతిపై ప్రశ్నించిన వారిపై దాడులు చేయించారన్నారు. ఎలాంటి అభివృద్ధి లేకుండా మాటలు చెప్పి మభ్యపెడుతున్న ఈ అరాచక ఎమ్మెల్యేను తరిమి కొట్టాలన్నారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే కావలినియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చేసి పరిశ్రమలు తెచ్చి యువతకు ఉపాధి అవకాశం కల్పిస్తానన్నారు. ఈ కార్యక్రమాలలో రూరల్ మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల రామకృష్ణ, ఉప్పాల వెంకట్రావు, బీజేపీ మండల అధ్యక్షుడు మామిడి వెంకటేశ్వర్లు, జనసేన మండల అధ్యక్షుడు తిరుపతి స్వామి, మాజీ జడ్పీటీసీ నాయుడు రాంప్రసాద్, టీడీపీ నేతలు నాసిన జాలరావు, పోసిన శ్రీనివాసులు, దద్దాల ప్రభాకర్, తాతా హరిబాబు, పత్రి రమణయ్య, దద్దాల రామక్రిష్ణ, కోసూరి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

● రాక్షస పాలన అంతమొందించేందుకే కూటమి

రాష్ట్రంలో నడుస్తున్న వైసీపీ రాక్షసపాలనను అంతమొందించేందుకే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయని కూటమి అభ్యర్థి క్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని 30 వార్డులో ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయాన్ని శుక్రవారం ఉదయం ఆయన ప్రాంభించి పలువురు నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం 28, 30 వార్డులలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి ఖావటం ఖాయమన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా కొండ బిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి క్రిష్ణారెడ్డిని కలిసి తమ మద్దతు తెలిపారు. క్రిష్ణారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని దివంగత మాజీ ఏఎంసీ చైర్మన్ గ్రంధి యానాదిశెట్టి కోరికని, దానిని నెరవేర్చేందుకు ఆయన తరుపున తాము కృషి చేస్తామని మాల్యాద్రి తెలిపారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ నాయకలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, పోతుగంటి అలేఖ్య, గాదంశెట్టి వేణుగోపాల్, నాగిశెట్టి మాలకొండయ్య, గంగు చంద్రశేఖర్, సురేష్, పవన్, రవి లతో పాటు బీజేపీ నేతలు కందుకూరి వెంకటసత్యనారాయణ, జీ.భరత్‌కుమార్, సీవీసీ సత్యం తదితరులు పాల్గొన్నారు.


చెంచుగానిపాలెంలో ఓటు వేయమని ప్రజలను అభ్యర్థిస్తున్న టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి

బాలయ్యకు కావలిలో ఘన స్వాగతం


బాలకృష్ణకు స్వాగతం పలుకుతున్న కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, ఏప్రిల్ 26: స్వర్ణాంధ్ర సాకార యాత్రలో భాగంగా కందుకూరు నియోజకవర్గానికి వెళ్లేందుకు శుక్రవారం మధ్యాహ్నం కావలి జడ్పీ క్రీడామైదానంలోని హెలిపాడ్‌లో దిగిన సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థి నందమూరి బాలకృష్ణకు నేతలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. కూటమి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరు నాగేశ్వరరావులతో పాటు పలువురు టీడీపీ నాయకులు, నందమూరి అభిమానులు, టీడీపీ కార్యకర్తలు తదిరులు బారీగా హెలిపాడ్ వద్దకు చేరుకున్నారు. బాలయ్యను కలిసేందుకు నందమూరి అభిమానులతో పాటు యువత పోటీపడ్డారు. బాలయ్య కావలిలో దిగుతున్న విషయం తెలుసుకున్న టీడీపీ అభిమానులు కూడా ఎక్కువ సంఖ్యలో అక్కడకు చేరుకోవటంతో ఆ ప్రాంతమంతా కిటకిటలాడింది. కూటమి అభ్యర్థులు బాలయ్యను కలిసి పుష్పగుచ్ఛాలు అందచేసిన తర్వాత కొంత సేపు ఆయనతో ముచ్చటించారు. అనంతరం టీడీపీ కందుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలతో కలసి కందుకూరు నియోజకవర్గం గుడ్లూరుకు కారులో రోడ్డు మార్గంలో బయలుదేరి వెళ్లారు.

టీడీపీని గెలిపిస్తేనే వెనుకబడిన వర్గాల అభ్యున్నతి

అల్లూరు, ఏప్రిల్ 26 : టీడీపీని గెలిపిస్తేనే వెనుకబడిన వర్గాల అభివృద్ధికి అవకాశం లభిస్తుందని కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అల్లుడు బినీత్‌రెడ్డి అన్నారు. ఆయన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మేనల్లుడు ఎ.చందన్‌రెడ్డితో కలిసి శుక్రవారం నార్తుఆములూరు పంచాయతీలో ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఎదుర్కొన్న సమస్యలు తీరాలంటే టీడీపీని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గుంజి రుద్రయ్య, దాసరి ప్రభాకర్, పెయ్యల భాస్కర్, చల్లా రమణయ్య, తిరుపయ్య, బాబు, కరుణాకర్, శీనయ్య, మల్లికార్జున పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కోసం కష్టపడి పనిచేద్దాం

బిట్రగుంట : ఆంధ్రరాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే టీడీపీ ప్రభుత్వం రావాలని, అందుకోసం జనసేన, బీజేపీ, టీడీపీ నేతలు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరుడు వేమిరెడ్డి వినోద్‌రెడ్డి అన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేట జనసేన కార్యాలయంలో శుక్రవారం ఆయన స్థానిక నేతలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి అసెంబ్లీ అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డిలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు సురేష్, జిల్లా అధికార ప్రతినిధి కే.కృష్ణారెడ్డి, అఖిలభారత చిరంజీవి ఫ్యాన్స్ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.రవికుమార్, పద్మనాభరెడ్డి, కావలి టౌన్ అధ్యక్షుడు పబ్బాసాయి, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక

బోగోలు మండలం ఉమామహేశ్వరపురంలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు శుక్రవారం ఇంటింటి ప్రచార నిర్వహించారు. చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపేట వైసీపీ ముస్లిం మైనార్టీ నాయకులు షేక్.రఫీ అతని అనుచరులతో టీడీపీలో చేరారు. కాంద్ర సతీష్‌నాయుడు అధ్యక్షతన దగుమాటి క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో నాగులవరంకి చెందిన పలువురు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎల్.సుధీర్‌బాబు, కే.తిరుమలేష్, అహ్మద్‌బాషా, గట్టాలక్రిష్ణయ్య, సుబ్బయ్య, సతీష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల ఇంటింటా ప్రచారం

జలదంకి : మండలంలోని గట్టుపల్లి పంచాయతీ కర్కోలువారిపాలెం, చింతలపాలెం గ్రామాల్లో శుక్రవారం టీడీపీ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. ఎన్డీఏ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లకు సైకిల్‌గుర్తుపై ఓటేసి గెలిపించాలని నాయకులు కొల్లా క్రిష్ణ, గ్రంధి రాజగోపాల్, గొట్టిపాటి ప్రసాద్‌నాయుడు, నలమోతు చెంచునాయుడు, మనోజ్, కాకర్లట్రస్ట్ సభ్యుడు దర్గాబాబులు కోరారు.

భీమవరప్పాడులో...

కొండాపురం : మండలంలోని భీమవరప్పాడులో టీడీపీ, జనసేన నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. టీడీపీ మ్యానిఫెస్టోలోని సూపర్‌సిక్స్ కరపత్రాలను ప్రజలకు అందచేశారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులుగా పోటీలో ఉన్న ఉదయగిరి ఎమ్మెల్యేగా కాకర్ల సురేష్‌ను, నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచు చాగంటి క్రిష్ణ, జనసేన నాయకుడు తిప్పినేని రమేష్, జనసేన మండల ఉపాధ్యక్షుడు కాకుటూరు రాఘవేంద్ర, టీ.రహమంతు, కే.దొరబాబు, కే.రమేష్, జీ.పేరయ్య, జీ.మాధవ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోదండరాముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు


ప్రతిష్ఠిస్తున్న ధ్వజస్తంభం

వలేటివారిపాలెం, ఏప్రిల్ 26 : మండలంలోని కాకుటూరులో శుక్రవారం సీత, లక్షణ, హనుమాన్ సమేత కోదండరాముడి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా జరిగాయి. నూతన ఆలయం ముందు శిఖర జీవధ్వజ స్తంభం ప్రతిష్ఠించారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు ధ్వజస్తంభం ముందు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. కార్యక్రమాలలో కందుకూరు వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



కీలకం

నారీలోకమే
న్యాయనిర్ణేతలు !

● అభ్యర్థుల గెలుపోటములు వారిపైనే..

● అన్ని సెగ్మెంట్లలోనూ వారి సంఖ్యే అధికం

సంగం, ఏప్రిల్ 26: జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానానికి మే13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మహిళా ఓటర్లే కీలకంగా మారారు. మొత్తం 19,35,923 మంది ఓటర్లు ఉండగా, పురుషులకంటే 41,235 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలకు గానూ సర్వేపల్లిని తిరుపతి లోకసభ పరిధిలోకి మార్చారు. మిగిలిన నియోజకవర్గాల్లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఇందులో అత్యధికంగా నెల్లూరు రూరల్‌లో 1,43,111 మంది మహిళా ఓటర్లు ఉండగా, 1,37,856 మంది మహిళా ఓటర్లతో కోవూరు రెండవ స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో అభ్యర్థుల విజయావకాశాలను వారు నిర్ణయించనుండగా, వారి కోసమే మేనిఫెస్టోలో ప్రత్యేక పథకాలు ప్రకటిస్తున్నారు. కొత్తకొత్త పథకాలతో వారిని ఆకర్షించే పనిలో పార్టీలు తలమునకలయ్యాయి.

నియోజకవర్గం	మహిళా ఓటర్లు	పురుష ఓటర్లు	ఇతరులు
ఆత్మకూరు	109152	105466	8
ఉదయగిరి	121183	119451	10
కందుకూరు	115373	112917	26
కావలి	120969	116689	28
కోవూరు	137856	128580	25
నెల్లూరు సిటీ	122046	116111	67
నెల్లూరు రూరల్	143111	135602	20
సర్వేపల్లి	118889	112528	26
మొత్తం ఓటర్లు	9,88,579	9,47,344	210

కుటుంబమైనా..

బాబాయ్ అటు.... అబ్బాయ్ ఇటు !!

● ఎంపీ రామిరెడ్డి వర్సెస్ చిరంజీవిరెడ్డి



ఎంపీ రామిరెడ్డి



చిరంజీవిరెడ్డి

ఉదయగిరి నియోజకవర్గంలోని కలిగిరి మండలం రాజకీయంగా ప్రత్యేకతను సంతరించుకుంది. మండలంలోని అనంతపురం గ్రామవాసి మెట్టుకూరు వెంకట రామిరెడ్డి, మెట్టుకూరు చిరంజీవిరెడ్డిలు బాబాయ్, అబ్బాయ్‌లు. వారు ఒకే కుటుంబంలోని సభ్యులైనా రాజకీయ విభేదాలతో ఇద్దరూ వేర్వేరు పార్టీల్లో కొనసాగుతున్నారు. అయితే చిరంజీవి రెడ్డి ఇటీవల వైసీపీ నుంచి లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరారు. అయితే తాను టీడీపీలో ఉన్నా, ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ తన స్వగ్రామంలో కూడా తమకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఎన్నికల ప్రచారం నిర్వహించడం, తదితర కారణాలతో తన అనుచరులతో ఎంపీ రామిరెడ్డి వైసీపీలోకి చేరడం దాదాపుగా ఖాయమయినట్లు సమాచారం. ఈ పరిణామాలతో మండలంలో రాజకీయం ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

- కలిగిరి



గోడమీద పిల్లులు

అక్కడా వారే.. ఇక్కడా వారే !

ఎన్నికలు వచ్చాయంటే కొందరికి పండుగే. ఎన్ని కలప్పుడు వీరు చేసే హడావిడి అంతా ఇంతా కాదు.. ఆపార్టీ ఈపార్టీ అనే తేడా లేకుండా అన్నిచోట్లా వీరే కనిపిస్తుంటారు. ఎక్కడికెళ్లినా పాదరసంలా వారితో అంటుకుపోతారు. ఆ అభ్యర్థి విజయం కోసం పనిచేస్తు న్నట్లు బిల్డప్ ఇస్తుంటారు. ఉదయం ఓ పార్టీ అభ్యర్థి వద్ద హడావిడి చేసి, సాయంత్రానికి మరో పార్టీ వద్ద అదే హడావిడి చేస్తారు. ఇలాంటివి రాజకీయాల్లో సహజమే కానీ, గతంలో అలాంటి వారిని ఇట్టే కనిపెట్టేసే వారు. ఎందుకంటే వారిసంఖ్య చాలా పరిమి తంగా ఉండేది. ఈసారి కందు కూరు నియోజక వర్గంలో వీరి సందడి ఎక్కువగా కనిపిస్తోంది. టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌లు ఇద్దరూ రాజకీయాలకు కొత్త కావటం బుర్రాకు అయితే ఈ ప్రాంతంలో పరిచయాలు కూడా చాలా పరిమితంగా ఉన్నాయి. దీంతో వీరి ఆటలు సాగుతు న్నాయి. నిన్న మొన్నటి వరకు ఇండిపెండెంట్‌గా పోటీకి సన్నద్ధమైన ఇంటూరి రాజేష్ కూడా బరిలో ఉండటంతో ముగ్గురి వద్ద సందడి చేసిన వీరు ప్రస్తుతం ఇద్దరివద్దే హడావిడి చేస్తున్నారు. ఓటర్లకు విందు లు, బహుమతుల ప్రదానం చేసే సమయంలో వీరిదే సందడి వివిధ సంఘాల లోను వీరే కనిపించటం మరీ విచిత్రం. ఇప్పుడే ఇలా ఉంది ఇంకా ప్రచారం ఊపందు కుంటే ఎన్ని వింతలు చూడాల్సి వస్తుందో నన్న పలువురు పేర్కొన్నారు.


- కందుకూరు

విజయం ఎవరిదైనా ఓటమి నాదే!

● ఉదయగిరి నియోజకవర్గ ఆత్మఘోష

అయ్యా.. నేను గుర్తున్నానా!? జిల్లా కేంద్రానికి విసిరేసినట్టు.. కరువుకు కేంద్రబింధువుగా ఉంటున్న నేనేనయ్య ఉదయగిరి నియోజకవర్గాన్ని. ఇక్కడున్న నా బిడ్డలు చేస్తే సేద్యం చేయాలా లేదా!? కన్న వారిని, ఉన్న ఊరును వదిలి రెక్కల కష్టాన్ని నమ్ముకుని వలసెళ్లాలా!? ప్రతి ఎలచ్చన్లోనూ నాయకుల వాగ్దానాలు నమ్మి నా బిడ్డలు వారిని గెలిపిస్తున్నారు. తీరా వారు పదవిలోకి వచ్చాక నా బిడ్డలు మాత్రం ఓడిపోతూనే ఉన్నారయ్యా!? ఈసారైనా నా ఆత్మఘోషను వినండయ్యా...





1952లో పుట్టిన నాకు దుత్తలూరు, ఉదయగిరి, వరికుంటపాడు, సీతారామ పురం, జలదంకి, వింజమూరు, కొండాపురం, జలదం కి మండలాలు పరిధి. 322 పోలింగ్ కేంద్రాలున్నాయి. 2,40,644 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 1,19,451 మంది మగవారు, 1,21,183 మంది మహిళలు, 20 ఇతర ఓటర్లు ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 14 పర్యాయాలు, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక రెండుసార్లు మొత్తం 16 సార్లు నాకు ఎన్నికలు జరిగాయి. ప్రతి ఎన్నికల్లోనూ నాయకులు వాగ్దానాలు చేయడం, వాటిని నమ్మి నా బిడ్డలు వారిని గెలిపించడం పరిపాటిగా మారింది. కానీ సమస్యలు ఎక్కడికక్కడ ఉండిపోయాయి.

పాతతరంలో బెజవాడ గోపాల్‌రెడ్డి మొదలు అఖిలభారత స్థాయికి ఎదిగిన వెంకయ్యనాయుడు, మంత్రిత్వం వహించిన మాదాల జానకీరాం, కాంట్రాక్ట్ రంగంలో మేటిగా ఉన్న మేకపాటి తదితర ఉద్ధండులకు రాజకీయ జన్మనిచ్చాను. ప్రస్తుతం రాజకీయాలు నడిపిస్తున్న కంభం, బొల్లినేని రాజకీయ ఎదుగుదలకు తోడ్పడ్డాను. ప్రస్తుత ఎన్నికల్లో కొత్తతరం నేతలు బరిలోకి దిగారు. సంతోషం. కానీ దుర్గం పర్యాటక కేంద్రం చేస్తామంటూ నేతలు చేసిన వాగ్దానాలు రింగురింగున మోగుతూ ఉంటే నాతోపాటు నా ప్రజలు దగాకు గురవుతున్నారు.

దశాబ్దాలు దాటినా పచ్చటి పంటలకు నీరిచ్చే దశకు చేరుకోలేదంటే వ్యవసాయపరంగా చెందిన అభివృద్ధి చెప్పుకోలేక పోతున్నాను. గండిపాళెం జలాశయ ఆయకట్టు 16 వేల ఎకరాలకు చేరుకోక జాతికి అంకితం ఇవ్వలేదు. నక్కలగండి, మర్రిపూట్ల కళ్లముందు కనిపిస్తున్నా ప్రయోజనం అంతంత మాత్రమే. సోమశిల జలాలు తరలింపు నేతలు మరిచినా నేనింకా మర్చిపోలేదు. వెలిగొండలో అంతర్భాగమైన సీతారాంసాగర్ రైతులకు ఊహాలోకంలో వివరించేలా ఎక్కిరిస్తోంది. అన్నదాతలు వ్యవసాయ కూలీలుగా మారుతున్నా నేతలకు కనబడటంలేదు. నా గడ్డమీద పుట్టి నా అభివృద్ధి గురించి ఎన్నికల్లో ప్రస్తావిస్తూ నన్ను మోసం చేస్తుంటే సిగ్గుపడుతున్నా. రవాణా పరంగా నా స్టైలే వేరు. నడికుడి రైలు మార్గం వయా ఉదయగిరి మీదుగా వస్తుందంటే చాలా సంతోషపడ్డా. బ్రిటీష్ కాలం నుంచి నేటికీ హామీల మీద హామీలు ఇస్తున్నా ఇంకా అందుబాటులోకి రాలేదు. ఇక రోడ్ల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ఉదయగిరి, వింజమూరు, కలిగిరి లాంటి పట్టణాల్లో జనాభాకు తగిన విధంగా ఓవర్‌హెడ్ ట్యాంకులు, పంపింగ్ స్కీములు లేక ప్రజలు పడేపాట్లు అన్నీఇన్నీకావు. ఫ్లోరైడ్ భూతం నా నియోజకవర్గ బిడ్డలను పట్టిపీడిస్తూనే ఉంది. నిరుద్యోగులు వీధిన పడ్డా పరిశ్రమలు స్థాపించక పోవడం నా నాయకులకే చెల్లింది. పార్టీల కన్నా వ్యక్తులు, గ్రూపులు కన్నా కులం, రాయలసీమ సంస్కృతి పరికిపుచ్చుకున్న ఉదయగిరిపై నేతలు ఎప్పుడు దయ చూపిస్తారో... ఆనాడే నాకు గెలుపు. అప్పటి వరకు ఎదురుచూస్తూ ఉంటా..

ఇట్లు
ఉదయగిరి నియోజకవర్గం

- ఉదయగిరి

భోజనం పెట్టి.. మందు ఇవ్వలేం ! | రెండింటికీ కలిపి ఈ 'లెక్క' తీసుకోండి

మీరంతా మా పార్టీ ప్రచారాలకు రండి... అభ్యర్థితోపాటు తిరగండి.... అయితే గతంలో మాదిరిగా భోజనం పెట్టి మందు సీసా మాత్రం ఇవ్వలేం.... ఆ రెండింటికి కలిపి ఇదిగో ఇంత దినకూలి తీసుకోండి.... అని ద్వితీయశ్రేణి నాయకులు ప్రచారానికి వచ్చే వారికి చెబుతున్నారు. ఈ సారిరోజులు బాగాలేవు. ఎన్నికల అధికారుల నిఘా పెంచారు. మందు సీసా కనపడితే ఎత్తుకెళ్లిపోతున్నారు. పైగా కేసులు కూడా పెడుతున్నారు. మా ఇబ్బందులును మీరు అర్థం చేసుకోండి. ఉదయం రెండు గంటలు, సాయంత్రం రెండు గంటలు వస్తే సరిపోతుంది. మధ్యాహ్నం ఇంటికి వెళ్లిపోయి భోజనం చేసుకుని రండి. సాయంత్రం ఇంటికి వెళ్లేటప్పుడు కూలి ఇచ్చేస్తాం... దాదాపుగా అన్నీ పార్టీల ప్రచారాల్లో ఇదే జరుగుతోంది. ఈ అగ్రిమెంట్‌తో పోలింగ్ వరకు ప్రచారం కొనసాగిద్దాం.. అంటూ చెబుతున్నారు.

- నెల్లూరు రూరల్



ఈ సంగతి తెలుసా..?

గోడలపై ప్రచారానికి యజమాని అనుమతి ఉండాల్సిందే!

ఎన్నికల ప్రచారంలో భాగంగా గోడలపై పోస్టర్లు, స్టిక్కర్లు, ఫ్లెక్సీలు అంటించాలంటే ఆ ఇంటి యజమాని అనుమతి తప్పనిసరిగా ఉండాలి. ఎన్నికల సమయంలో అభ్యర్థులు వారి అనుచరులు ప్రచారంలో భాగంగా పబ్లిక్, ప్రైవేటు భవనాలు, కట్టడాలు, స్థలాల్లో బ్యానర్లు, ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేసేటప్పుడు సంబంధిత యజమాని అనుమతి లేకుండా చేయకూడదు. పోస్టర్లు అంటించడం, గోడలపై రాతలు రాయడం, జెండాలు, స్టిక్కర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు వంటి చర్యల వలన ప్రభుత్వ ప్రైవేటు ఆస్తుల రూపు శాశ్వతంగా లేదా పాక్షికంగా మారే అవకాశం ఉంది. ఎన్నికలు అనంతరం వాటిని శుభ్రం చేయాలంటే ప్రభుత్వానికి, ఆయా స్థలాల యజమానులు ఖర్చు అవుతుంది. కావున నాయకులు ముందుగా అనుమతి తీసుకుని ప్రచారానికి వాటిని వాడుకోవచ్చు. అలా ప్రచారం చేయదల చుకున్న అభ్యర్థులు సదరు యజమాని, సంతకం లేదా వేలిముద్రలతో అనుమతి పొంది ఆ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. ఈ వ్యయాన్ని అభ్యర్థుల ఎన్నికల ఖర్చులో కలుపుతారు. ఈ నిబంధనలు ఉల్లంఘించిన వారు భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 171హెచ్, ప్రజా ప్రాతినిధ్య సెక్షన్ 127వ, అడ్వటైజుమెంట్ యాక్ట్ 1997 లోని సెక్షన్ /4 ప్రకారం శిక్షార్హులవుతారు.

- నెల్లూరు (సాంస్కృతికం)

నేతలకు కలిసొచ్చే వేణుగోపాల్‌నగర్



నెల్లూరు వేణుగోపాల్‌నగర్‌లోని ప్రధాన రహదారి

సెంటిమెంట్

వ్యాపారాలు, గృహ నిర్మాణాలు ప్రారంభించాలంటే ముందుగా మంచి ముహూర్తం, ఆపై కొన్ని సెంటిమెంట్లను ప్రజలు పాటిస్తారు. అదే కోవలో రాజకీయ నేతలు కూడా సెంటిమెంట్లను నమ్ముతున్నారు. ఈ క్రమంలో నెల్లూరు నగర నియోజకవర్గానికి ఈశాన్యం వైపున ఉన్న వేణుగోపాల్‌నగర్ సెంటిమెంట్ ప్లేస్‌గా నిలిచింది. నగరంలోని 3వ డివిజన్‌లో ఈ ప్రాంతం కొంతకాలంగా అసెంబ్లీ ఎన్నికల్లో నేతల ప్రచారానికి సెంటిమెంట్‌గా మారింది. 1993లో వేణుగోపాల్‌నగర్ ఏర్పాటు కాగా, తొలిసారిగా 1995లో మున్సిపల్ చైర్మన్‌గా కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఆనం వివేకానందరెడ్డి అక్కడున్న మాతమ్మగుడిలో పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. దీంతో ఆయన చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1999, 2004లోనూ నెల్లూరు సిటీ నుంచి పోటీ చేస్తూ ఇక్కడ నుంచే ఎన్నికల శంఖారావం పూరించారు. ఆ రెండుసార్లు కూడా ఆయన గెలుపొందారు. 2009లో నెల్లూరు రూరల్ నుంచి పోటీ చేసినా కూడా ప్రచారాన్ని మాత్రం వేణుగోపాల్‌నగర్‌లోనే నిర్వహించారు. అప్పట్లోనూ ఆయనే గెలుపొందారు. దీంతో ఆ ప్రాంతాన్ని ఎన్నికల్లో సెంటిమెంట్‌గా నేతలు భావిస్తూ వస్తున్నారు. 2009లో నగర ఎమ్మెల్యేగా పోటీ చేసిన ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి కూడా ఇక్కడి నుంచే ప్రచారం ప్రారంభించి గెలుపొందారు. అలాగే 2014, 2019 ఎన్నికల్లో అనిల్‌కుమార్ యాదవ్ కూడా అదే ఆనవాయితీని పాటించారు. రెండుసార్లూ అనిలే విజయం సాధించారు. ఈ సెంటిమెంట్‌ను పాటిస్తూ వైసీపీ అభ్యర్థి ఖలీల్ కూడా ఇక్కడ నుంచే ప్రచారానికి శ్రీకారం చుట్టారు. తాజా ఎన్నికల్లో ఆ సెంటిమెంట్ నిజమవుతుందో... లేదో చూడాలి.

- నెల్లూరు (జడ్పీ)

ఏజెంట్లే కీలకం !



ఎన్నికలు జరిగే రోజున పోలింగ్ కేంద్రాల్లో అభ్యర్థుల తరపున కూర్చునే ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకం. ఓటర్లను ప్రసన్నం చేసుకు నేందుకు అభ్యర్థులు నెలల తరబడి నిర్వహించిన ప్రచారం ఓ ఎత్తైతే, పడిన కష్టానికి ఫలితం ఇచ్చేది పోలింగ్ కేంద్రమే. అలాంటి కేంద్రంలో పోలింగ్ సక్రమంగా జరుగుతుందా.. లేదా? అన్నది గమనించడం, బోగస్ ఓట్లు పడకుండా బూత్‌లోకి వచ్చినవారిని నిశితంగా పరిశీలించడం ఏజెంట్ల పని. గుర్తింపు పొందిన రిజిస్టర్ పార్టీలు స్వతంత్ర అభ్యర్థుల తరఫున ప్రాధాన్యతా క్రమంలో ఏజెంట్లు పోలింగ్ బూత్‌లో కూర్చుంటారు. పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రతి కదలికను ఏజెంట్ క్షుణ్ణంగా పరిశీలించాలి. ఏమాత్రం అను మానం వచ్చినా ఏజెంట్ తన అభ్యంతరాన్ని ప్రొసీడింగ్ అధికారికి తెలియజేయాలి. ఎంతో కీలకమైన ఈ ఏజెంట్‌ను అభ్యర్థులు తమకు నమ్మకమైన వారినే కూర్చోబెడతారు. ఏజెంట్ ఏ మాత్రం తప్పు చేసినా ఆ అభ్యర్థికే నష్టం కలుగుతుంది.

- వలేటివారిపాలెం

తస్మాత్ జాగ్రత్త


రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే.. జైలు ఊచలు లెక్కించాల్సిందే !

కొంతమంది అభ్యర్థులు సెంటిమెంట్‌ను రెచ్చగొడితే ఓట్లు పడతాయని భావించి కులం,మతం, వర్గం, ప్రాంత భేదాలతో ఇష్టారాజ్యంగా మాట్లాడుతుంటారు. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు అరికట్టేందుకు ఎన్నికల సంఘం కఠిన నిబంధనలను రూపొందించింది. ఎన్నికల్లో ఎవరైనా జాతి, మతం, కులం, భాష, సమాజం పేరుతో రెచ్చగొడితే ఐపీఎస్ సెక్షన్ 158ఏ ప్రకారం మూడేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తారు. ఓటుకోసం మద్యం, డబ్బులు, ఇతర వస్తువులను తీసుకున్న వారిని కూడా నేరస్థులుగానే పరిగణిస్తారు. ఐపీ ఎస్ సెక్షన్ 171బీ, 171హెచ్ ప్రకారం లంచంగా పరిగణించి ఏడాది జైలుశిక్ష విధిస్తారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రవాహాలపై నిఘా పెంచారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసిన వారు కూడా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

- ఉదయగిరి

ముఖచిత్రం





అధికారం వైపే సర్వేపల్లి !

● విజ్ఞత ప్రదర్శిస్తున్న ఓటర్లు

● తాజాగా బరిలో హేమాహేమీలు

● ఒకరు మంత్రి కాగా, మరొకరు సీనియర్ నేత

ముత్తుకూరు, ఏప్రిల్ 26 : రాష్ట్రంలో ఏ పార్టీ అధికారం చేజిక్కించుకుంటుందో ఆ పార్టీ అభ్యర్థులకే పట్టంగట్టడం సర్వేపల్లి నియోజకవర్గ ప్రజల విజ్ఞత. ఈ ఆనవాయితీ గత కొంత కాలంగా సాగుతూ వస్తున్నది. 1955లో సర్వేపల్లి నియోజకవర్గం ఏర్పడింది. తొలుత ఈ సెగ్మెంట్‌లో ముత్తుకూరు, వెంక టాచలం, తోటపల్లిగూడూరు, ఇందు కూరుపేట మండలాలతోపాటు నెల్లూరు రూరల్ మండలం లోని కొన్ని గ్రామాలు ఉండేవి. 2009లో జరిగిన పునర్విభజనలో ముత్తుకూరు, వెంకటాచలం, తోటపల్లిగూడూరు, మనుబోలు, పొదలకూ రు మండలాలను కలిపి సర్వేపల్లి నియోజకవర్గం ఏర్పాటు చేశారు. నైసర్గికంగా సర్వేపల్లి నెల్లూరు జిల్లాలో ఉన్నా, సార్వత్రిక ఎన్నికల్లో తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గంలో పరిధిలో ఉంది. తొలి ఎమ్మెల్యేగా కాంగ్రెస్‌కు చెందిన బెజవాడ గోపాల్‌రెడ్డి ఎన్నికయ్యారు. 1956 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా వంగల్లు కోదండ రామిరెడ్డి విజయం సాధించారు. 1962లో స్వతంత్ర అభ్యర్థిగా వేమారెడ్డి వెంకురెడ్డి గెలుపొందడం సంచలనంగా పేర్కొనేవారు. 1967లో సీపీఐ అభ్యర్థి స్వర్ణా వేమయ్య, 1972లో కాంగ్రెస్ అభ్యర్థిగా మంగళగిరి నానాదాస్‌లు ఎస్సీ కేటగిరిలో గెలుపొందారు. 1978 నుంచి ఈ నియోజకవర్గం జనరల్ అయింది. 1978, 1989లో కాంగ్రెస్ అభ్యర్థిగా సీవీ శేషారెడ్డి గెలుపొందగా, ఎన్టీఆర్ ప్రభంజనంతో 1983లో టీడీపీ అభ్యర్థి చెన్నారెడ్డి పెంచలరెడ్డి, 1985లో ఈదూరు రామకృష్ణారెడ్డి, విజయం సాధించా రు. 1994, 1999లో టీడీపీ అభ్యర్థిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలిచారు. 2004, 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి విజయం సాధించారు. 2014, 2019లో వైసీపీ అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గెలుపొందారు.

ఎన్నికలు జరగ్గా కాంగ్రెస్ ఏడు సార్లు, తెలుగుదేశం 4సార్లు, వైసీపీ 2 దఫాలు, సీపీఐ, ఇండిపెండెంట్ చెరోసారి విజయం సాధించారు.

మంత్రులుగా ఇద్దరు..

సర్వేపల్లి నియోజకవర్గం నుంచి 1996లో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తొలిసారి మంత్రి పదవి దక్కించుకున్నారు. 1996 నుంచి 99 వరకు క్రీడా శాఖా మంత్రిగా పనిచేశారు. అనంతరం 2001 నుంచి 2004 వరకు సమాచారశాఖ మంత్రిగా రెండోసారి ఎన్నికయ్యారు. 2017 నుంచి 2019 వరకు మూడోసారి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశారు. వైసీపీ ప్రభుత్వంలో 2022 నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి పనిచేస్తున్నారు. కాగా ఇప్పటి వరకు 15 సార్లు

సంవత్సరం	అభ్యర్థి	పార్టీ
2019	కాకాణి గోవర్ధన్‌రెడి	వైసీపీ
2014	కాకాణి గోవర్ధన్‌రెడ్డి	వైసీపీ
2009	ఆదాల ప్రభాకర్‌రెడి	కాంగ్రెస్
2004	ఆదాల ప్రభాకర్‌రెడి	కాంగ్రెస్
1999	సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి	టీడీపీ
1994	సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి	టీడీపీ
1989	చిత్తూరు వెంకటశేషారెడ్డి	కాంగ్రెస్
1985	ఈదూరు రామకృష్ణారెడ్డి	టీడీపీ
1983	చెన్నారెడ్డి పెంచలరెడి	టీడీపీ
1978	చిత్తూరు వెంకటశేషారెడ్డి	కాంగ్రెస్
1972	మంగళగిరి నానాదాస్	కాంగ్రెస్
1967	స్వర్ణ వేమయ్య	సీపీఐ
1962	వేమారెడ్డి వెంకురెడి	ఇండిపెండెంట్
1956	వంగల్లు కోదండరామిరెడ్డి	కాంగ్రెస్
1955	బెజవాడ గోపాలరెడ్డి	కాంగ్రెస్

కోవూరు సర్వేపల్లి



వెంకటాచలంలో నిరుపయోగంగా ఉన్న పాలశీతలీకరణ కేంద్రం

పాడికి పాడె
కట్టేశారు!

వెంకటాచలం, ఏప్రిల్ 26: వైసీపీ ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పాలశీతలీకరణ కేంద్రాలు నిరుపయోగంగా మరాయి. ప్రైవేటు డెయిరీలు పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం లేదన్న కారణంగా రాష్ట్ర పాడిపరిశ్రమాభివృద్ధి సంస్థ 2008లో జిల్లాలో మూడు పాలశీతలీకరణ కేంద్రాలను ఏర్పాటుచేసింది. ఒక్కో కేంద్రానికి అనాటి రూ.10 లక్షలకు పైగా వెచ్చించింది. వెంకటాచలం, పొదలకూరు, చేజర్లలో ఈ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. గ్రామాల్లో డ్వాక్రా మహిళల ద్వారా పాల సేకరణ జరిపించి ఈ శీతలీకరణ కేంద్రాలకు తరలించడం తద్వారా పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నది లక్ష్యం. ప్రైవేటు డెయిరీల కంటే ఎక్కువ ధర పాడి రైతులకు లభిస్తుండడంతో ఈ కేంద్రాలకు పాలుపోసే వారి సంఖ్య క్రమంగా పెరిగింది. గత టీడీపీ ప్రభుత్వం వరకు పాల సరఫరా సక్రమంగానే సాగింది. అనంతరం ఈ కేంద్రాల నిర్వహణలో రాజకీయాలు చోటు చేసుకున్నాయి. వీటిని నిర్వహించే వారు తమవారే ఉండాలన్న నేతల పట్టుదల కారణంగా ఈ కేంద్రాలు క్రమంగా మూతపడ్డాయి. రూ.లక్షల విలువ చేసే శీతలీకరణ యంత్రాలు తుప్పుపట్టిపోతున్నాయి. వరుసగా రెండుసార్లు సర్వేపల్లి ఎమ్మెల్యేగా గెలిచిన కాకాణి వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా కూడా పనిచేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలో రెండు కేంద్రాలు మూతపడి ఉన్నా వాటి గురించి కాకాణి కనీసం పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో రైతులు యధావిధిగా తమ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించకపోయినా ప్రైవేటు డెయిరీలకే తమ కష్టాన్ని ధారబోస్తున్నారు. రాబోయే ప్రభుత్వమైన ఈ కేంద్రాల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టి తమకు అండగా నిలవాలని పాడిరైతులు కోరుతున్నారు.

దోచుకున్న డబ్బు వెదజల్లినా కాకాణి ఓటమి తథ్యం

● గోవర్ధన్ మద్యంతో తస్మాత్ జాగ్రత్త ● ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి సోమిరెడ్డి



వెంకటాచలం: ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సోమిరెడ్డి

వెంకటాచలం, ఏప్రిల్ 26: గ్రామాల్లో కాకాణి గోవర్ధన్‌రెడ్డి 2014 తరహాలోనే పెద్దఎత్తున ప్రమాదకరమైన మద్యాన్ని పంచుతున్నాడని, తాగి ప్రాణాల పైకి తెచ్చుకోవద్దని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రజలకు సూచించారు. మండలంలోని కందలపాడు, కసుమూరు పంచాయతీ పుల్లతీగలపాడు గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సర్వేపల్లిలో డేంజర్ బెల్స్ మొగుతున్నాయని, అమాయకులను బలి తీసుకునేందుకు కాకాణి ప్రమాదకరమైన కల్తీ మద్యాన్ని ఊళ్లలో దింపేశాడని, 2014లోనూ ఇదే మాదిరిగా కల్తీ మద్యాన్ని ఇచ్చి ఏడుగురు ప్రాణాలను బలితీసుకున్నాడని విమర్శించారు. అడ్డంగా దోచుకున్న డబ్బును ఎంత వెదజల్లినా ఓటమి నుండి కాకాణి తప్పించుకోలేడని అన్నారు. కార్యక్రమంలో రాజాయాదవ్, నాగేంద్రప్రసాద్, రమేష్‌నాయుడు, శ్రీనివాసులునాయుడు, కుంచి శ్రీనివాసులు, ధనుంజయనాయుడు, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

● వేదాయపాళెంలోని సోమిరెడ్డి కార్యాలయంలో తిక్కవరప్పాడు, రామదాసుకండ్రి, వెంకటాచలం నుంచి 70 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో నాయకులు చాట్ల వెంకట సుబ్బయ్య, వాకామోహన్, వెడిచర్ల నరసయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

● గూడ్లూరువారిపాళెం గ్రామంలో శుక్రవారం సోమిరెడ్డి కుమార్తె డాక్టర్ సింధురెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రావూరి రాధాకృష్ణమనాయుడు, ఈపూరు మురళీధర్‌రెడ్డి, ఈపూరు సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, దువ్వూరు లక్ష్మమ్మ తదితరులున్నారు.

● అనికేపల్లిలో టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చల్లా రవీంద్ర, గొట్టం బ్రహ్మయ్య, అనికేపల్లి టీడీపీ నేతలు, రాజన్న సైన్యం సభ్యులు పాల్గొన్నారు.

● ప్రజలందరూ సోమిరెడ్డిని ఆదరించాలని సర్వేపల్లి మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని ఎగువమిట్ట గ్రామంలో సోమిరెడ్డికి మద్దతుగా ఆయన శుక్రవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పద్మనాభనాయుడు, పల్లిపాటి మునీంద్రబాబు, ఆలపాక మల్లికార్జున్, ముక్కు రాం ప్రసాద్‌రావు, నెల్లూరు కృష్ణయ్య న్నారు.

● పొదలకూరు : రాష్ట్రాభివృద్ధితోపాటు సర్వేపల్లి సర్వతోముఖాభివృద్దే ధ్యేయంగా కూటమి ఏర్పడిందని మాజీ మంత్రి సోమిరెడ్డి కోడలు సోమి రెడ్డి శృతిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె పట్టణంలోని సాయిబాబా వీధి, రామ్‌నగర్, కలువాయి రోడ్డు, ఏసీ కాలనీ, టీచర్స్ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో తలచీరు మస్తాన్‌బాబు, నువ్వుల కవిత, ఆదాల సుగుణమ్మ, వెంపులూరు అరుణ, కొంగి మస్తానమ్మ పాల్గొన్నారు.

68 కుటుంబాలు టీడీపీలో చేరిక

పొదలకూరు: మండలంలోని గురవాయిపాలెం, ఆల్తుర్తి, కనుపర్తి, నరసింహ కండ్రిగ గ్రామాల్లో శుక్రవారం సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్తుర్తిలో 50 కుటుంబాలు, గురవాయపాలెంలో 18 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. రాష్ట్ర అభివృద్ధి కోసం తనకు ఓటేసి గెలిపించాలని సోమిరెడ్డి అభ్యర్థించారు. అలాగే కొత్తా సుబ్బయ్యతోపాటు మరో 10 కుటుంబాలు సోమిరెడ్డి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరాయి.

తోటపల్లిగూడూరు: కోడూరు మేజర్ పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వేదాయపాలెం సోమిరెడ్డి నివాసంలో శుక్రవారం టీడీపీలో చేరిన వారికి సోమిరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అలాగే కొత్తపాలెంలో గురువారం రాత్రి సోమిరెడ్డి ఎన్నికల ప్రచారంలో మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు అమీర్‌జాన్, 40 ముస్లిం కుటుంబాలు టీడీపీలో చేరారు.

చంద్రబాబు రోడ్‌షో, బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన



బుచ్చి బస్టాండ్ సెంటర్లో చంద్రబాబు బహిరంగ సభ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 26: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సాయంత్రం బుచ్చిరెడ్డిపాళెంలో నిర్వహించే రోడ్‌షో, బహిరంగ సభ, హెలిపాడ్ ప్రాంతాలను టూర్ కోఆర్డినేటర్ రవియాదవ్, సీఐతో కలిసి పలువురు టీడీపీ నేతలు శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో బీద రవిచంద్ర, శ్రీధర్‌రెడ్డి, కల్యాణ్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, తదితరులు వున్నారు.

బందోబస్తు ఏర్పాట్లపై డీఎస్పీ సమీక్ష

చంద్రబాబునాయుడు పర్యటనపై నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి గురువారం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సీఐ హైమారావుతో బందోబస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. బస్టాండ్ సెంటర్‌తోపాటు చంద్రబాబు వెళ్ళే మార్గాల్లోని పలు ప్రాంతాలను సీఐతో కలిసి ఆయన పరిశీలించారు. బందోబస్తుకు సంబంధించి సీఐకి పలు సూచనలిచ్చారు.

కామాక్షితాయి ఆలయానికి దీపారాధన స్టాండు బహూకరణ



బహూకరించిన దీపారాధన స్టాండ్‌తో దాతలు

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 26: జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయానికి పెనుబల్లి గ్రామానికి చెందిన పర్వతారోహకుడు కోరికల సూర్యప్రకాష్, కుటుంబ సభ్యులు శుక్రవారం దీపారాధనలు చేసుకునే స్టాండును బహూకరించారు. ముందుగా దాతలు స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డిగ్రీ పరీక్షలలో ఆరుగురి డీబార్

వెంకటాచలం, ఏప్రిల్ 26: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఆరుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ ఐదవ, ఆరవ సెమిస్టర్ పరీక్షల్లో 410 మంది, మధ్యాహ్నం జరిగిన నాల్గవ సెమిస్టర్ పరీక్షల్లో 285 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఉదయం నెల్లూరులోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఇద్దరు, నాయుడుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, పీఆర్ఆర్, వీఎస్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు మొత్తం ఆరుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

సెబ్ కార్యాలయం తనిఖీ

పొదలకూరు, ఏప్రిల్ 26 : పట్టణంలోని సెబ్ కార్యాలయాన్ని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ పి దయాసాగర్ శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా స్టేషన్‌ని పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెబ్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితుడికి జైలు శిక్ష

తోటపల్లిగూడూరు, ఏప్రిల్ 26 : దాడి కేసులో నిందితుడికి సంవత్సరం జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ రైల్వే కోర్టు జడ్జి వినోద్‌కుమార్ శుక్రవారం తీర్పునిచ్చారు. స్థానిక ఎస్ఐ జంపానీకుమార్ కథనం మేరకు 2018వ సంవత్సరంలో నరుకూరు గ్రామానికి చెందిన షేక్ ఖాజాపై నిందితుడు శశికుమార్, నలుగురు వ్యక్తులు దాడి చేసిన ఘటనలో శుక్రవారం రైల్వే కోర్టు నిందితులకు జైలుశిక్ష విధించింది. ఏ1 ముద్దాయికి సంవత్సరం జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా, మిగిలిన వారికి నెల జైలు శిక్ష రూ.200 జరినామా విధిస్తూ జడ్జి వినోద్ తీర్పునిచ్చారు.

రెండు గడ్డివాములు దగ్ధం

ముత్తుకూరు, ఏప్రిల్ 26 : మండలంలోని జంగాలకండ్రిగలో శుక్రవారం కోట జయరామయ్య, కోట శేషయ్యలకు చెందిన రెండు గడ్డివాములకు నిప్పంటుకుని దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న నెల్లూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు.

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు

ఇందుకూరుపేట, ఏప్రిల్ 26 : మండలంలోని కొత్తూరు సచివాలయం పరిధిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఎంపీడీవో సాయిలహరి కార్యక్రమాన్ని పరిశీలించారు. రోగులకు ఓఆర్ఎస్, గ్లూకోజ్ ప్యాకెట్లు అందజేశారు.

వైసీపీ పాలనలో మాఫియాల అడ్డాగా కోవూరు

● టీడీపీ కూటమి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



కొడవలూరు: ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రశాంతిరెడ్డి

కొడవలూరు, ఏప్రిల్ 26: గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో మద్యం, ఇసుక, గ్రావెల్, ధాన్యం, కమీషన్లు, బెట్టింగ్‌లకు కోవూరు నియోజకవర్గం మాఫియాలకు అడ్డాగా మారిందని, అవినీతి, అక్రమాలకు కేరాఫ్ ప్రసన్నకుమార్‌రెడ్డి అని కూటమి శాసనసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలో మిక్కిలింపేట, యలయపాళెం పంచాయతీ పరిధిలో రామాపురం, ఎన్టీఆర్ కాలనీలలో శుక్రవారం ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం ఎన్టీఆర్ కాలనీలో గ్రావెల్ మాఫియా తవ్వకాల కారణంగా ఏర్పడిన భారీ గుంతలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ గ్రామ ప్రజలు చెప్పే మాటలు వింటుంటే కంటనీరు వస్తోందని, గ్రామ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి గ్రావెల్ దోచుకుంటే మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా అనే అనుమానం కలుగుతోందన్నారు.

అక్రమాలపై బహిరంగ చర్చకు సంసిద్ధమా ప్రసన్నా...

నియోజకవర్గంలో జరిగిన అవినీతి, అక్రమాలపై బహిరంగ చర్చకు నేను సిద్ధంగా ఉన్నానని... నువ్వు సంసిద్ధమా అని ప్రసన్నకుమార్‌రెడ్డిని ఉద్దేశించి ప్రశాంతిరెడ్డి సవాల్ విసిరారు. టీడీపీ అధికారంలోకి వస్తే చేసిన అవినీతిని బయటపెట్టే వరకు పోరాటం ఆపనన్నారు. రాష్ట్ర అబివృద్ధి జరగాలంటే టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా రావాలన్నారు. ప్రజలు ఒక్కసారి ఆలోచించాలని, సంక్షేమం కావాలా... లేదా అరాచక పాలన కావాలో నిర్ణయించుకుని అభివృద్ధికి పట్టంకట్టాలని కోరారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని టీడీపీ నాయకుడు కెవిఆర్ విజయ్ పర్యవేక్షించగా, టీడీపీ నాయకుడు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, కేతూ వెంకటరమణారెడ్డి, గరికపాటి రాజేంద్ర కుమార్, కోడూరు సుధాకర్‌రెడ్డి, కోడూరు బుజ్జిరెడ్డి, బడుగు శ్రీనివాసులు, ఏకోళ్లు వంశీధర్‌రెడ్డి, భూలోకం విజయ్‌కుమార్, చెక్కా మదన్, బద్వేల్ వినీల్‌రెడి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులను మోసం చేసిన వైసీపీ

విడవలూరు : ఎన్నికల ముందు వాగ్దానాలు చేసి అధికారంలోకి రాగానే ఆర్టికల్ 217 జీవోను తీసుకొచ్చి మత్స్యకారులను దోచుకోవాలని చూసిన వైసీపీని రానున్న ఎన్నికల్లో ఓడించాలని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని ఊటుకూరు, శంభుని పాలెం, వెంకటరెడ్డిపాలెం, పెద్దపాలెం మత్స్యకార కాలనీలలో శుక్రవారం బీజేపీ, జనసేన నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మత్స్యకారుల జీవనస్థితి బాగా దెబ్బతిందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఆర్టికల్ 217ను రద్దు చేసి మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, తనను గెలిపించాలని, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెముకుల కృష్ణచైతన్య, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, పోలయ్య, పాపారావు, తిరుపతయ్య, గ్రామకాపులు పాల్గొన్నారు.

జగన్‌ని ఇంటికి పంపే రోజులు దగ్గర పడ్డాయి: నీలిమారెడ్డి

ఇందుకూరుపేట: జగన్‌ని ఇంటికి పంపే రోజులు దగ్గర పడ్డాయని కోవూరు శాసనసభ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ప్రశాంతిరెడ్డి కుమార్తె నీలిమారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొత్తూరులో శుక్రవారం ప్రతి ఇంటికీ తిరిగి కరపత్రాలను పంపిణీచేసి బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అధికారంలోకి రాగానే అర్హులైన ప్రతి పేదవాడికి రెండు సెంట్లు ఖాళీ స్థలం మంజూరుచేసి నాణ్యమైన ఇల్లు నిర్మిస్తామని, పెళ్లి కానుక రూ.లక్ష ఇస్తామని, నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని తెలిపారు. ఎన్నికల్లో వేమిరెడ్డి దంపతులను ఆశీర్వదించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కైలాసం ఆదిశేషారెడ్డి, మునగాల రంగారావు, చెంచుకిషోర్‌యాదవ్, కుమార్, రామచంద్రయ్య, బీజేపీ నాయకులు కైలాసం లావణ్య, శ్రీనివాస్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

ప్రశాంతిరెడ్డి గెలుపు తథ్యం : కరకటి

కొడవలూరు: నియోజకవర్గంలో కూటమి శాసనసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విజయం తథ్యమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కరకటి మల్లికార్జున అన్నారు. మండలంలోని నార్తు రాజుపాళెంలో శుక్రవారం టీడీపీ మండల మహిళాధ్యక్షురాలు కరకటి రమా ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో కరకటిమల్లికార్జున పాల్గొని ఇంటింటికి తిరిగి వేమిరెడ్డి దంపతులను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తువ్వర జ్యోతి, విల్సన్ పాల్గొన్నారు.

వేమిరెడ్డి దంపతులతోనే నియోజకవర్గ అభివృద్ధి

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీలోని 13, 14, 15 వార్డుల్లో ఇన్‌చార్జ్‌లు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఎన్డీఏ ఉమ్మడి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తరపున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వేమిరెడ్డి దంపతులతోనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని, చంద్రబాబునాయుడిని సీఎంగా చేసుకుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని వివరిస్తూ వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ, సుబ్రమణ్యంనాయుడు, 14,15 ఇన్‌చార్జులు, దుగ్గిశెట్టి హరనాద్, కొండయ్య, కిషోర్, కాసా శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఇందుకూరు పేట : ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న ప్రశాంతిరెడ్డి కుమార్తె నీలిమారెడ్డి



కొడవలూరు: ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కరకటి మల్లికార్జున



బారికేడ్లు ఏర్పాటు చేసిన పోలీసులు

గాంధీబొమ్మ కూడలిలో ఉద్రిక్తత

● బాలయ్య పర్యటనకు భారీగా తరలివచ్చిన జనం
● అదే సమయంలో విజయసాయి ప్రచారం
● ఉత్కంఠ మధ్య భారీగా పోలీసు బందోబస్తు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 26: నెల్లూరు ట్రంకురోడ్డులో శుక్రవారం రాత్రి ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ నాయకులు, సినీ హీరో నందమూరి బాలకృష్ణ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సాయంత్రం నగరంలోని నవాబుపేట సెంటర్ నుంచి గాంధీ బొమ్మ సెంటర్‌కు ర్యాలీగా చేరుకున్నారు. అక్కడ బాలకృష్ణ ప్రసంగించాల్సి ఉంది. అయితే అదే సమయంలో వైసీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి వీఆర్‌సీ కూడలి నుంచి గాంధీబొమ్మ వైపు ప్రచారం చేసుకుంటూ వస్తున్నారు. ఓ వైపు వేల సంఖ్యలో టీడీపీ అభిమానులు జై బాలయ్య అంటుంటే.... మరో వైపు విజయసాయి ప్రచారంలో భాగంగా డీజే సౌండ్స్‌తో జై జగన్ అన్న నినాదాలు వినిపించారు. దీంతో ట్రంకురోడ్డు ప్రాంతమంతా టెన్షన్ వాతావరణం నెలకొంది. చినబజారు, సంతపేట, దర్గామిట్ట పోలీసు స్టేషన్ల పోలీసులు పెద్ద సంఖ్యలో గాంధీబొమ్మ కూడలి వద్దకు చేరుకున్నారు. రాయాజీవీధి ఆంజనేయస్వామి గుడి వైపు విజయసాయి రెడ్డి ప్రచారం తిరుగుతుండటంతో ఆ ప్రాంతంలో బారికేడ్లను ఏర్పాటు చేశారు. టీడీపీ అభిమానులు గాంధీ బొమ్మ వైపు, వైసీపీ అభిమానులు ఆంజనేయస్వామి గుడి వైపు ఉండేలా రెండు వైపులా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి అక్కడికి చేరుకొని పోలీసులను అప్రమత్తం చేశారు. చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ ఎలాంటి వివాదాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇరువురు నేతల పర్యటనలు ప్రశాంతంగా సాగడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.



పాపిరెడ్డి చెరువు స్థలంలో భవన నిర్మాణానికి చేసిన శంకుస్థాపన

కావలిలో రూ. కోటి స్థలం కబ్జా

● పశువులపాక, గడ్డివాము పేరుతో వైసీపీ నేత ఆక్రమణ
● ఎన్నికల వేల నిర్మాణానికి సిద్ధం

కావలి, ఏప్రిల్ 26 : ఎన్నికల వేళ అధికార యంత్రాంగం బిజీబిజీగా ఉండటంతో సందట్లో సడేమియా అన్నట్లు ప్రభుత్వ స్థలాలు ఎక్కడ కనిపిస్తే అక్కడ ఆక్రమణకు సిద్ధమవుతున్నారు వైసీపీ నాయకులు. కావలి రామ్మూర్తి పేటలోని పాపిరెడ్డిచెరువులో సుమారు రూ. కోటికి పైగా విలువ గలిగిన స్థలాన్ని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ముఖ్యఅనుచరుడు, 13వ వార్డు వైసీపీ నాయకుడొకరు ఆక్రమించాడు. అక్కడ భవన నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశాడు. దీంతో స్థానికల్లో కలకలం బయలుదేరింది. ముఖ్యంగా కావలిలో వైసీపీ నేతలు, వారి అనుచరులు చెరువుల లోతట్టు ప్రాంతాల స్థలాలను ఆక్రమించి తొలుత పశువులు కట్టేసుకుంటారు. ఆ తర్వాత వాటి మేతకు వరిగడ్డి వాములు వేసుకున్నా మంటూ ఆ స్థలాన్ని వారు స్వాధీనం చేసుకుంటారు. ఆ తర్వాత అక్కడ రేకులు షెడ్లు వేసి పెడతారు. వాటిపై అభ్యంతరాలు రాకపోతే వాటిల్లో ఏకంగా నిర్మాణాలు చేపడతారు. ఎన్నికల వేళ ఇటీవల మందాటి చెరువులో ఇలాగే ఆక్రమించి నిర్మాణాలు చేపట్టగా ఆంధ్రజ్యోతిలో కథనం రాగా, వాటిని తాత్కాలికంగా నిలుపుదల చేశారు. తాజాగా పాపిరెడ్డి చెరువులో కూడా ఇలాంటి నిర్మాణాలకు శుక్రవారం శంకుస్థాపన చేయటంతో ఆ ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు.

విచారించి చర్యలు

అక్కడ ఆక్రమించిన స్థలాన్ని పరిశీలించి, అది ప్రభుత్వ స్థలమని తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. భవన నిర్మాణానికి తీసిన గుంతలను పూడ్చుతాం.

- బాబూరావు, పట్టణ ప్రణాళికాధికారి, కావలి

సోమశిలలో 8.289 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, ఏప్రిల్ 26: సోమశిల డ్యాం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శుక్రవారానికి ప్రాజెక్టులో 8.289 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర కాలువకు 5, దక్షిణ కాలువకు 25 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

నెల్లూరులో రిమాండ్ ఖైదీ ఆత్మహత్య

వెంకటాచలం : నెల్లూరులోని జిల్లా కేంద్ర కారాగారంలో ఓ రిమాండ్ ఖైదీ పీ దుర్గా అలియాస్ లోకేశ్వరి (35) శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కోవూరులో ఇటీవల భర్తను రోకలి బండతో కొట్టి చంపిన కేసులో దుర్గాను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జైలులో శిక్ష అనుభవిస్తున్న దుర్గా శుక్రవారం బాత్‌రూమ్ ఎగ్జిట్ ఫ్యాన్‌కు టవల్ కట్టుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని గమనించిన జైలు సిబ్బంది హుటాహుటిన అధికారులకు సమాచారం అందించి దుర్గాను నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందింది. జైలు అధికారుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అంకమరావు తెలిపారు.

వింజమూరు ఏపీఎం సస్పెన్షన్

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 26 : వింజమూరు మహిళా మార్టులో అక్రమాలకు సంబంధించి ఏపీఎం సాలిమ్‌రోజ్‌ను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కేవీ సాంబశివారెడ్డి సస్పెండ్ చేశారు. వింజమూరు మహిళా మార్టులో లోకల్ బ్రాండ్ వస్తువుల కొనుగోలు చేయరాదనే నిబంధన ఉన్నా ఏపీఎం కొనుగోలు చేయించారని, అప్పులు ఇవ్వకూడదనే నిబంధన ఉన్నా అప్పులు ఇచ్చారని, ఇవేకాకుండా ఇతర ఆరోపణలు ఏపీఎం సాలిమ్‌రోజ్‌పై ఉన్నాయని పీడీ పేర్కొన్నారు. ఆయా ఆరోపణలు రుజువు కావటంతో సస్పెండ్ చేశామని చెప్పారు. అక్కడి మహిళామార్టులో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకోవటంతో, ఆ ప్రాంతానికి చెందిన పొదుపు మహిళలు ఇటీవల పెద్ద సంఖ్యలో డీఆర్‌డీఏ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేశారు. ఏపీఎంపై చర్యలు తీసుకోవాలని పీడీని కోరారు. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన ప్రాజెక్టు డైరెక్టర్ ఏపీఎంను సస్పెండ్ చేశారు.

గ్రామ, వార్డు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 26 : గ్రామ, వార్డు ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు అర్లయ్య కోరారు. శుక్రవారం నగరంలోని ఏపీఆర్ఎస్ఏ భవన్‌లో ఆ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ఏర్పడి దాదాపు ఐదేళ్లు గడుస్తున్నప్ప టికీ ఉద్యోగుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయన్నారు. ఉన్నతాధికారులకు విన్నవించినా సమస్యలు పరిష్కారం కావడంలేదన్నారు. ఆర్థిక పరమైన సర్వీసు అంశాలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	141
లేయర్ లైవ్	93
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	280
లేయర్	158

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6899
వెండి కిలో ధర	రూ. 83,900
వెండి ఒక గ్రాము	రూ. 85.90

ఎన్నికల పర్వం



అభ్యర్థుల సమక్షంలో నామినేషన్ పత్రాలను పరిశీలిస్తున్న రూరల్ నియోజకవర్గ ఆర్వో మలోల

నామినేషన్ల పరిశీలన పూర్తి

- సిటీలో 8, రూరల్ 1 తిరస్కరణ
- మిగిలినది రూరల్‌లో 12, సిటీలో 18 మంది
- ఉపసంహరణకు నేటి నుంచి 29 వరకు గడువు

నెల్లూరు (సిటీ / వెంకటేశ్వరపురం), ఏప్రిల్ 26 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన కార్యక్రమం శుక్రవారం పూర్తయింది. ఈ నెల 18 నుంచి గురువారం వరకు నామినేషన్లు స్వీకరించిన రిటర్నింగ్ అధికారులు, శుక్రవారం వాటిని పరిశీలించి నిబంధనల మేరకు ఉన్నవాటిని ఆమోదించారు. మిగిలిన వాటిని తిరస్కరించారు.

● నెల్లూరు నగర నియోజకవర్గం నుంచి 26 మంది నామినేషన్లు అందచేయగా వారిలో 8 మంది పత్రాలు తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన 18 మంది పోటీలో ఉన్నట్లు ఆర్వో వికాస్ మర్మత్ పేర్కొన్నారు. టీడీపీ నుంచి దరఖాస్తు చేసుకున్న పొంగూరు రమాదేవి, సింధుర, వైసీపీ నుంచి పోటీలో నిలిచిన మహ్మద్ నసీమా, సీపీఎం తరఫున నామినేషన్ వేసిన కత్తి శ్రీనివాసులు బీ ఫారాలు అందచేయని కారణంగా వారి నామినేషన్లను తిరస్కరించినట్లు ఆర్వో ప్రకటించారు. ఇక, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసిన షేక్ అల్లావుద్దీన్‌ను ప్రతిపాదించిన వ్యక్తి ఓటు క్రమ సంఖ్యను చూపకపోవడం, అఫిడవిట్ సమర్పించకపోవడం వల్ల తిరస్కరించారు. బుక్కరాజు శ్రీనివాసరాజు, అవధానం సత్యసాయి తమ నామినేషన్ పత్రాలపై సంతకాలు చేయలేదని, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ అభ్యర్థి బండి గంగిరెడ్డి తన అఫిడవిట్‌లోని గడులన్నీ ఖాళీగా ఉంచడం వల్ల వారి నామినేషన్లను ఎన్నికల నిబంధనల ప్రకారం తిరస్కరించామని ఆర్వో వెల్లడించారు.

● నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి మొత్తం 13 మంది అభ్యర్థులు 28 సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా వాటిని రిటర్నింగ్ అధికారి మలోల ఆధ్వర్యంలో అభ్యర్థుల సమక్షంలో అధికారుల బృందం పరిశీలించింది. టీడీపీ నుంచి దరఖాస్తు చేసుకున్న కోటంరెడ్డి సునంద మ్మ నామినేషన్ తిరస్కరించారు. మిగతా 12 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదించినట్లు ఆర్వో ప్రకటించారు. కాగా, శనివారం నుంచి ఈ నెల 29 వరకు నామినేషన్లకు గడువు ఉందని ఆర్వోలు తెలిపారు.

నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు

- జిల్లా పోలీసు పరిశీలకుడు అశోక్ దూదే

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 26: నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వహించాలని జిల్లా పోలీస్ అబ్జర్వర్ అశోక్ టీ దుదే పోలీసు అధికారులను ఆదేశించారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో శుక్రవారం సార్వత్రిక ఎన్నికలపై జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్‌తో కలిసి పోలీసు అబ్జర్వర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ జిల్లా భౌగోళిక విస్తీర్ణం, సరిహద్దులు అసెంబ్లీ, పార్లమెంట్ నియోజవర్గాలు, మండలాలు, పోలింగ్ లోకేషన్లు, పోలింగ్ స్టేషన్ల వివరాలు, ఎన్నికల నేపథ్యంలో తీసుకుంటున్న చర్యల గురించి అబ్జర్వర్‌కు వివరించారు. ఈ సందర్భంగా అబ్జర్వర్ మాట్లాడు తూ ఈ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులకు తావు లేకుండా ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ప్రముఖుల పర్యటనలో తగిన భద్రత, బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు కేంద్ర సాయుధ బలగాలకు పూర్తి స్థాయిలో ఎన్నికల విధులు కేటాయించాలన్నారు. ఎన్నికల సందర్భంగా అదనపు బలగాలను రిజర్వులో ఉంచుకొని, ఎక్కడైనా సమస్య ఉత్పన్నమైనప్పుడు వినియోగించుకొనేలా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల్లో అక్రమాలపై కఠినంగా వ్యవహరించాలని, ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలకు గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల్లో ఈవీఎంల రవాణా, భద్రతా విషయాలు, సిబ్బందికి సదుపాయాలు, ఇతర విషయాలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, సెబ్ అధికారులు పాల్గొన్నారు.



పోలీసులతో సమావేశంలో మాట్లాడుతున్న అశోక్ టీ దూదే

పార్టీల కుమ్ములాటలో బలవుతున్న బహుజనులు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 26 : ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో రెండు కులాలు, మూడు పార్టీల కుమ్ములాటలో బహుజనులు బలైపోతున్నారని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మన్నేపల్లి రఘు తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంపీగా తనను గెలిపించాలని జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం దౌర్జన్యాలు, రౌడీయిజం, అరాచక పాలన సాగుతున్నాయని, ప్రస్తుత పార్టీలకు ప్రత్యామ్నాయంగా నవరంగ్ పార్టీని ఆదరించాలని కోరారు. ఈ సమావేశంలో బీ ప్రసాద్, ఆర్ రాంబాబు, జీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజయసాయి వక్రబుద్ధిని నిరూపించుకున్నారు!

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 26 : నామినేషన్ల పరిశీలనలో వైసీపీ అభ్యర్థి విజయసాయి తన వక్రబుద్ధిని మరోసారి నిరూపించుకున్నారని, ఎన్నికల్లో గెలవలేమన్న సాకుతోనే ఆయన కలెక్టర్‌కు కొన్ని ఫిర్యాదులు చేశారని డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏవో కుంటి సాకులతో టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి సంబంధించి కొన్ని అభ్యంతరాలను లేవనెత్తారన్నారు. అవన్నీ చెల్లుబాటుకానివి కావడంతో రిటర్నింగ్ అధికారి పరిగణలోకి తీసుకోకుండా వేమిరెడ్డి నామినేషన్‌ను ఆమోదించారని తెలిపారు. నెల్లూరులో హడావుడి చేస్తున్న వైసీపీ నాయకులు మే 13 తరువాత కనిపించరని పేర్కొన్నారు.

అశ్వవాహనంపై వేణుగోపాలుడు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 26 : నగరంలోని మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయం బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం రాత్రి అశ్వవాహనపై నగరోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం, సాయంత్రం హోమాలు, విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. స్వామికి వెన్నత్తాళి అలంకారంలో పేట ఉత్సవం ఘనంగా జరిగింది. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

● శబరి శ్రీరామక్షేత్రం వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం రాత్రి ఏకాంతసేవ జరిగింది. ఉదయం అభిషేకాలు, విశేష పూజలు చేశారు. సాయంత్రం బ్యాండు కచేరీ, విజయ్ మ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థుల నృత్య ప్రదర్శన అలరించాయి. ఉభయకర్తలుగా అన్నం దయాకర్ గౌడ్, సుబ్బరత్నమ్మ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. చెన్నూరు వెంకటేశ్వర్లురెడ్డి, అర్చకుడు నరేష్‌స్వామి, చంద్రరెడ్డి పర్యవేక్షించారు.



శబరి శ్రీరామక్షేత్రంలో సీతారాముల ఏకాంతసేవ

● బాలాజీనగర్ సీతారామమందిరంలో శుక్రవారం రాత్రి ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఉదయం సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామివార్లకు వసంతోత్సవం సందడిగా సాగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

● సంతపేట ఆంజనేయస్వామి ఆలయం బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం రాత్రి స్వామివారికి ఊంజల్ సేవ జరిగింది. విశేష పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచారు.

● ఉస్మాన్‌సాహెబ్‌పేట కోదండరామ స్వామి ఆలయం బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం రాత్రి అశ్వవాహనంపై ఉత్సవం జరిగింది. సాయంత్రం స్వామివార్ల గంగాళం తిరుమంజనం సేవ కన్నుల పండువగా సాగింది.

జేఈఈ మెయిన్స్‌లో 'వర్ధన్‌రెడ్డి' ప్రతిభ

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 26 : జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో వర్ధన్‌రెడ్డి జూనియర్ కళాశాల ఐఐటీ-నీట్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఆ విద్యాసంస్థల చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ కళాశాలకు చెందిన ఎండీ అర్షిమా 99.45 పర్సంటైల్‌తో అఖిలభారత స్థాయిలో 1239వ ర్యాంకు సాధించగా టీ వెంకటశ్రీనాథ్ 90.83, పీ లలిత్‌కుమార్ 88.09. టీ జోత్స్న ప్రియా 87.47, ఎస్‌కే అబ్దుల్ హఫీజ్ 86.09, ఏ రిషి 86.00, వీ తీక్షణ 85,71, సీహెచ్ హంసిని 84.91, టీ జితిన్ స్వరూప్ 70.83, బీ మహేష్‌బాబు నాయక్ 65,89 పర్సంటైల్ సాధించారన్నారు. అనంతరం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, సరితారెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




విద్యార్థినిని అభినందిస్తున్న కాలేజీ నిర్వాహకులు, అధ్యాపకులు

ఎస్సీ కార్పొరేషన్‌లో పథకాలన్నీ మాయం

నెల్లూరు (వీఆర్సీ), ఏప్రిల్ 26 : నగరంలోని ఎస్సీ కార్పొరేషన్ భవనం కళతప్పింది. ఐదేళ్లుగా జనం అటువైపు రావడం మానేశారు. గతంలో ఏడాది పొడవునా ఎస్సీ లబ్ధిదారులు కార్యాలయానికి వచ్చి తమకు అవసరమైన పథకం కోసం దరఖాస్తు చేసుకుని లబ్ధిపొందుతుండేవారు. కేంద్ర ప్రభుత్వం అందించే ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకాలు నిరుద్యోగుల స్వయం ఉపాధికి తోడ్పడేవి. ఆయా పథకాల్లో యూనిట్ విలువను బట్టి 35- 50 శాతం వరకు సబ్సిడీగా అందించేవారు. ఉదాహరణకు ఇన్నోవా కారు విలువ రూ.17 లక్షలు ఉండగా అందులో 40 శాతం సబ్సిడీగాను, 10శాతం లబ్ధిదారుని వాటాగా చెల్లించి, మిగిలిన దానికి రుణం పొంది కారుకు యజమానిగా ఉండేవారు. 2015- 2019 మధ్యకాలంలో కాలంలో 70 మంది లబ్ధిదారులకు ఇన్నోవా కార్లను రుణ విధానంలో అందించారు. అలాగే ఇతియోస్, హుండాయ్, స్విఫ్ట్ డిజైర్ వంటి చిన్న కార్లనుసైతం 79 మంది లబ్ధిదారులకు బ్యాంకులతో పనిలేకుండా నేరుగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించి స్వయం ఉపాధిని కల్పించారు. అలాగే వ్యవసాయ ట్రాక్టర్లు 34, ఆటోలు 29 మందికి అందించారు. ఇలా మొత్తంగా 1072 మందికి రూ. 26.02 కోట్లను రుణంగా ఇచ్చారు. సబ్సిడీగా రూ.21కోట్లకు పైగా అందించారు. దీంతో చాలా కుటుంబాలు టెంట్ హౌస్‌లు, కిరాణా దుకాణాలు, సెంట్రింగ్ సామగ్రి వంటి వ్యాపారాలతో జీవిస్తున్నాయి. కానీ కొన్నేళ్లుగా సంక్షేమ పథకాలన్నీ మాయమైపోయాయి.

- నవరత్నాల సాకుతో నిలిపివేత
- గతంలో స్వయం ఉపాధికి ఊతం
- ఐదేళ్లుగా పథకాలకు కోత
- కానరాని మాల, మాదిగ కార్పొరేషన్ల బోర్డులు





● **ఆ కార్పొరేషన్లకు బోర్డులు ఏవి?**

వైసీపీ అధికారం చేపట్టాక అన్ని కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తున్నామని, దీంతో ఎవరికీ నష్టం వాటిల్లదని సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆర్భాటంగా ప్రకటించారు. ఎస్సీ కార్పొరేషన్‌ను సైతం మాల, మాదిగ, రెల్లి కార్పొరేషన్లుగా ప్రకటించి చేతులు దులుపుకున్నా రు. కానీ ఆయా కార్పొరేషన్లు ఉన్నట్లు ఎక్కడా బోర్డులు కూడా ఏర్పాటు చేయక పోవడం గమనార్హం. కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లుగా కొందరికి నామినేటెడ్ పదవులు కట్టబెట్టి కంటితుడుపు చర్యలు చేపట్టారేగానీ ఒక్కటంటే ఒక్క రూపాయి కూడా కార్పొరేషన్లకు నిధులు విడుదల చేయకపోవడంపై జనం పెదవి విరుస్తున్నారు.

ఐదేళ్లుగా కనిపించని జనం

గతంలో భూమి కొనుగోలు పథకం, పాడిపరిశ్రమకు గేదెలు, గొర్రెలు, వ్యవసాయ బోర్లు, వితంతువులకు ఆర్థిక ప్రోత్సాహం వంటి ఎన్నో స్కీంలు ఉండేవి. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 'అందరితో పాటు మీకు..' అనే విధంగా నవరత్నాలను సాకుగా చూపి ఎస్సీ సామాజిక వర్గానికి ప్రత్యేక పథకాలను నిలిపివేసింది. దీంతో గడిచిన ఐదేళ్లుగా ఎస్సీ కార్పొరేషన్‌కు జనం రావడం మానేశారు.

మా ఊళ్లో సమస్యలపై
ఎంత మాత్రం స్పందించారో చెప్పండి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 26 : మా ఊళ్లో జనాలు ఎదుర్కొంటున్న సమస్యలను గత సమావేశంలో మీ దృష్టికి తీసుకువచ్చాము, వాటిని మీరు ఎంతమాత్రం పరిష్కరించారో చెప్పండి?, దాన్నిబట్టి ఇప్పటి సమస్యలు మీకు తెలియచేస్తామంటూ గ్రామ పంచాయతీల సర్పంచులు అధికారులను నిలదీశారు. శుక్రవారం నెల్లూరు రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. ఇందులో పాల్గొన్న సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ గత సమావేశంలో అనేక సమస్యలు ఏకరువుపెట్టామని, వాటిల్లో ఒక్కటి కూడా పరిష్కారం కాలేదని ఆరోపించారు. గతేడాది తుఫాన్ సమయంలో పడిపోయిన విద్యుత్ స్తంభాలు ఇప్పటికీ అలాగే ఉన్నా యని, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయలేదని ధ్వజమెత్తారు. ప్రాథమిక పాఠశాలల్లో మరుగుదొడ్ల సమస్యను పరిష్కరించలేద న్నారు. వీటిల్లో ఒక్కదానికి కూడా సమాధానం చెప్పని అధికారులు, సమస్యలు పరిష్కరిస్తా మంటూ సమావేశాన్ని ముగించేశారు. కాగా, ఈ సమావేశానికి విద్యుత్, విద్య, వెలుగు, వ్యవసాయం, ఎన్ఆర్‌జీఆర్ శాఖలు తప్ప మిగిలిన శాఖలకు చెందిన అధికారులు గైర్హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బూడిద విజయకుమార్, ఎంపీడీవో ఆర్ఎం రాజ్యలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజ్యలక్ష్మి

ప్రజల పిలుపుతోనే సగం విజయం

ప్రచారంలో రూరల్ టీడీపీ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 26 : నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ప్రజలు తనను శ్రీధరన్న అంటూ ఆప్యాయంగా పిలిచే పిలుపుతోనే ఎన్నికల్లో తాను సగం విజయం సాధించానని తెలుగుదేశం పార్టీ రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం 27వ డివిజన్‌లో ఎన్నికల ప్రచార రోడ్ షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రూరల్లో తాను, పార్లమెంట్ సభ్యుడిగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అఖండ విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, వారి కష్టసుఖాలను పంచుకుంటూ ఉండే వ్యక్తులను ప్రజలెప్పుడూ ఆదరిస్తారన్నారు. కరోనా లాంటి కష్ట కాలంలో కూడా మహమ్మారికి భయపడకుండా ప్రజలకు సేవ చేసిన చరిత్ర తనకుందన్నారు. తన ప్రత్యర్థి కరోనాకు భయపడి ప్రజలను గాలికొదిలేసి హైదరాబాద్‌లో తలదాచుకున్నాడని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వస్తే తప్ప రాష్ట్ర బాగుపడదన్న వాస్తవాన్ని ప్రతి ఓటరు అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన కార్యాలయంలో కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన వైసీపీ నాయకులు పిడూరు సురేష్‌రెడ్డి, కుడుముల మురళీ టీడీపీలో చేరారు. మండలంలోని కొత్తవెల్లంటి గ్రామానికి చెందిన సోము అశోక్‌రెడ్డి, పేరం మాధవరెడ్డి, మారం దయాకర్‌రెడ్డి, వెంగ నారపరెడ్డి, వెంకటకృష్ణయ్యకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నేతలు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, అరవ శ్రీను, వేల్పుల అజయ్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.





రోడ్‌షోలో ప్రజలను పలకరిస్తున్న అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి, ఎన్నికల ప్రచారంలో టీడీపీ కార్యకర్తలు

ముస్లింలకు టీడీపీ అండ

● సిటీ అభ్యర్థి నారాయణ సతీమణి రమాదేవి

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 26 : ముస్లింలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి, టీడీపీ నగర ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి తెలిపారు. ఎన్నికల ప్ర చారంలో భాగంగా 52వ డివిజన్‌లో ఆమె శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ముస్లిం మైనార్టీలు అంటే తమకెంతో అభిమా నమని, వారికి ఏ కష్టం వచ్చినా తమ కుటుంబం అండగా ఉంటుం దని హామీ ఇచ్చారు. ముస్లింలు అధికంగా నివాసం ఉండే ఈ ప్రాం తంలో గతంలో నారాయణ ఎన్నో అభివృద్ధి పనులు చేశారని గుర్తు చేశారు. వారి పిల్లల ఉజ్వల భవితకోసం పీఎస్ఎం పాఠశాలలో అన్ని వసతులతో జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారన్నారు. దీనిలో చదువుకున్న విద్యార్థులు నేడు ఉన్నతంగా ఎదిగారని వారి తల్లిదం డ్రులు తెలియచేయడం ఆనందంగా ఉందన్నారు. ముస్లింల మీద మమకారంతో చంద్రబాబునాయుడు మహిళల కోసం దుల్హన్ పథ కం ప్రవేశపెట్టారని, రంజాన్ పర్వదినం రోజున తోఫా అందించారని చెప్పారు. మసీదుల్లోని ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం అందచే శారన్నారు. రానున్న తెలుగుదేశం ప్రభుత్వంలో మరిన్ని సంక్షేమ కా ర్యక్రమాలు చేపడతామని, నారాయణను ఎమ్మెల్యేగా, ఎంపీగా వేమి రెడ్డి ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



ఓటు అభ్యర్థిస్తున్న నారాయణ సతీమణి రమాదేవి

వైసీపీ నేతల్లో ఓటమి భయం : వినోద్‌రెడ్డి

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 26 : వైసీపీ నేతల్లో ఓటమి భయం పట్టుకుందని తెలుగుదేశం పార్టీ నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పొంగూరు నారాయణకు మద్దతుగా శుక్రవారం ఆయన జెండావీధిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నామినేషన్లు ధ్రువపరిచే సమయంలో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన డ్రామా చూస్తే యావత్ రాష్ట్రంలో ఓటమి చెందుతామనే భయం వైసీపీ నాయకులకు పట్టుకున్నట్లు తెలుస్తోందన్నారు. వీపీఆర్‌కు నామినేషన్‌లో వివరాలు దాచిపెట్టాల్సిన అవసరం లేదని, విజయసాయిరెడ్డి ఆస్తులు ఏమైనా దాచిపెట్టినా ఆయన మీద ఉన్న కేసుల పత్రాల్లో మాత్రం అక్రమ ఆస్తులన్నీ బహిర్గతంగానే ఉన్నాయని ఎద్దేవా చేశారు. ప్రజలంతా దీన్ని గమనించాలని, రానున్న ఎన్నికల్లో వీపీఆర్‌ను, నారాయణను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం చేస్తున్న వినోద్‌రెడ్డి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 26 : బుజబుజ నెల్లూరు విద్యుత్ ఉపకేంద్రం, లైన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్‌శాఖ ఏఈ వై రాజాబాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అంతరాయాన్ని గుర్తించి వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేటి సాయంత్రం
తాగునీటి సరఫరాకు అంతరాయం

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 26 : నగరానికి తాగునీటిని సరఫరా చేస్తున్న మహ్మదాపురంలోని వాటర్ ప్లాంటులో మరమ్మతుల కారణంగా శనివారం సాయంత్రం నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం యథావిధిగా తాగునీరు సరఫరా జరుగుతుందని, అంతరాయం ఏర్పడే సమయంలో ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

ఐటీఐ కళాశాలలో రక్తదానం

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 26 : వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో శుక్ర వారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రమాదాలు, ఇతర అనారోగ్య సమస్యలకు మనం అందించే రక్తం బాధితుల ప్రాణాలను కాపాడుతుందని చెప్పారు. విద్యార్థుల్లో సేవా భావాన్ని పెంపొందించేందుకు కళాశాలలో శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని 60 యూనిట్ల రక్తాన్ని అందచేశారని తెలిపారు.

జగన్‌ను మించిపోయిన కృష్ణయ్య

● టీడీపీ నేత రాఘవేంద్ర

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 26 : బూటకపు ప్రగల్భాలతో రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య సీఎం జగన్మోహన్ రెడ్డిని మించిపోయారని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంజా రాఘవేంద్ర విమర్శించారు. శుక్రవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ లేకపోతే బీసీల మనుగడే లేనట్లు కృష్ణయ్య మాట్లాడుతున్నారని, ఇలాంటి బీసీల వ్యతిరేకిని రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయుడు అన్ని విధాలా బీసీలకు పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. జగన్ పాలనలో బీసీలకు జరుగుతున్న అన్యాయాలు గుర్తుకు రాలేదా, బీసీ సబ్‌ప్లాన్ నిధులు ఏనాడైనీ వైసీపీ ప్రభుత్వం ఖర్చు చేసిందా అని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికలతో టీడీపీ బీసీ ప్రభుత్వం వస్తుందని, అప్పుడు బీసీలకు మరలా పూర్తిస్థాయి పదవులు వస్తాయని అన్నారు.

సరోగసి కోసం
దళారులను నమ్మొద్దు : డీఎంహెచ్‌వో

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 26 : సరోగసి ద్వారా సంతానం కావాలనుకునే వారు దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య హెచ్చరించారు. శుక్రవారం డీఎంహెచ్‌వో చాంబర్‌లో సరోగసి మెడికల్ బోర్డు సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ వివిధ పద్ధతుల ద్వారా సంతాపం పొందలేని దంపతులు సరోగసి అనుమతులు ఉన్న కేంద్రాన్నే ఎంచుకోవాలని సూచించారు. దంపతులకు ఎలాంటి సందేహాలు ఉన్నా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. అనంతరం సరోగసికి దరఖాస్తు చేసుకున్న ఆసుపత్రుల దరఖాస్తులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గీతాలక్ష్మి, డాక్టర్ సుల్తానా, డెమో శ్రీనివాసరావు, డిప్యూటీ డెమో కనకరత్నం పాల్గొన్నారు.

తల్లిదండ్రులను విస్మరించొద్దు

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 26 : కని, పెంచి, పోషించి, చదువు చెప్పించి, ప్రయోజకులను చేసిన తల్లిదండ్రులను విస్మరించడం హేయమైన చర్యని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి కే వాణి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆమంచర్ల ఎస్టీ కాలనీలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కన్న తల్లిదండ్రుల పోషణ బాధ్యత పట్టించుకోని వారసులను శిక్షించేందుకు 2007లో సీనియర్ సిటిజన్ల పోషణ సంక్షేమ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. బాల్య వివాహాల నివారణ చట్టాలూ ఉన్నాయని చెప్పారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పోషక ఆహారంపై ఆరా తీశారు.



స్టిక్కరే జగన్ ట్రెండ్

తల మీద స్టిక్కరే ప్రస్తుత ఎన్నికల్లో జగన్ ట్రెండ్. ఎన్నికల సమయంలో కోడి కత్తులు, గులకరాళ్ల డ్రామాతో స్టిక్కర్లు వేసుకుంటూ ఆయన కొత్త ట్రెండ్ ఫాలో అవుతున్నారు.పులివెందులలో నామినేషన్ సందర్భంగా తన జేబులో పెన్ను ఉన్నా పక్కనే ఉన్న అవినాష్ పెన్ను తీసుకొని సంతకం పెట్టడంలో ఆంతర్యమేంటో అర్థం కావడం లేదు.తన పెన్నులో ఇంకు లేదా? లేక ఆయన పెన్ను పనిచేయదా అనేది జగన్ చెప్పాలి.మీ ఇంట్లో మంచి జరిగివుంటేనే వైసీపీకి ఓటు వేయండంటున్న జగన్ ముందు తన ఇంట్లో ఏం మంచి జరిగిందో చెప్పాలి.ఆయన ఇంట్లో ఏం మంచి జరిగిందో చెల్లెల్లే చెబుతున్నారనేది జగన్ గ్రహించాలి.

- కిరణ్ రాయల్,తిరుపతి అసెంబ్లీ జనసేన ఇంచార్జి

హృదయాలయంలో గవర్నర్



బర్డ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారిని పలుకరిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 26: టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బర్డ్, శ్రీపద్మావతి హృదయాలయ ఆస్పత్రులను గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ దంపతులు శుక్రవారం సందర్శించారు.బర్డ్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కృత్రిమ అవయవాల తయారీ, అమరిక కేంద్రాన్ని పరిశీలించారు.ఆపరేషన్ థియేటర్లు, వార్డులు, స్కానింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కృత్రిమ అవయవాల తయారీ, అమరికను గవర్నర్‌కు బర్డ్ ప్రత్యేకాధికారి రెడ్డెప్పరెడ్డి వివరించారు. అనంతరం హృదయాలయకు వెళ్లిన గవర్నర్.. అక్కడి వార్డుల్లో చికిత్స పొందుతున్న చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడారు. చికిత్స కోసం వచ్చిన చిన్నారులతో ముచ్చటించారు.ఆస్పత్రిలోని క్యాథ్‌ల్యాబ్, ఐసీయూ, ఓటీ థియేటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఇప్పటి వరకు చేసిన గుండె మార్పిడి శస్త్ర చికిత్సల గురించి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి వివరించారు.

టీడీపీ కార్యకర్తలపై
కేసుల నమోదు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 26: తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద గురువారం జరిగిన ఘటనలపై యూనివర్సిటీ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. నామినేషన్ల దాఖలుకు ఆఖరు రోజైన గురువారం చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని, వైసీపీ తరపున చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆర్డీవో కార్యాలయం వద్దకు ర్యాలీగా చేరుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యకర్తలు నినాదాలు చేస్తుండగా.. వైసీపీ కార్యకర్తలు ప్రతిగా నినాదాలు చేశారు. ఈ ఉత్సాహం అదుపు తప్పడంతో పరస్పరం ఘర్షణ పడ్డారు. రాళ్లు, జెండా కర్రలతో కొట్టుకున్నారు. పోలీసులు లాఠీచార్జి జరిపి, టీడీపీ వర్గీయులను చెదరగొట్టడంతో ఆవేశపడ్డ టీడీపీ కార్యకర్తలు అప్పుడే ఆర్డీవో కార్యాలయం నుంచి వెలుపలికి వచ్చి బయల్దేరి వెళుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి వాహనంపై దాడి చేశారు. ఈ ఘటనలపై చంద్రగిరి తహసీల్దార్ మారుతి ఫిర్యాదు మేరకు టీడీపీకి చెందిన కొంతమంది కార్యకర్తలపై యూనివర్సిటీ పోలీసులు కేసు నమోదు చేశారు.

కొత్త ఓటర్ల సంఖ్య 42,007

- జిల్లాలో 18,12,980కి పెరిగిన ఓటర్లు
- 15రోజుల్లో పెరిగిన 9,769మంది



తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 26: ఓటర్ల తుది జాబితా సిద్ధమైంది. ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఏప్రిల్ 1 నుంచి 14 వరకు ఎన్నికల సంఘం చివరి అవకాశం ఇచ్చింది.దీంతో మరో 9,769మంది ఓటర్ల జాబితాలో చేరారు.వీరిలో చంద్రగిరి నియోజకవర్గంలోనే అత్యధికంగా 1,642మంది వున్నారు.కాగా 1,330మంది కొత్తగా వయోవృద్ధులు ఓటర్లుగా నమోదు కావడం అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.జిల్లా జనాభా 25.56లక్షలు కాగా ఓటర్ల తుది జాబితా ప్రకారం జిల్లాలో ఓటర్లు 18,12,980కి చేరారు.వీరిలో పురుషులు 8,83,330మంది, మహిళలు 9,29,466మంది, ట్రాన్స్‌జెండర్స్ 184మంది, దివ్యాంగులు 24,596మంది, 85 సంవత్సరాలు దాటినవారు 7,924మంది ఉన్నారు. 18 సంవత్సరాలు నిండి మొదటిసారి ఓటువినియోగించుకోనున్న వారు 42,007మంది వున్నారు.సర్వీసు ఓటర్ల విషయానికి వస్తే 862మందిఉన్నారు.నియోజకవర్గాల వారీగా చూస్తే గూడూరులో 2,45,205మంది ఓటర్లు, సూళ్ళూరుపేటలో 2,42,610మంది, వెంకటగిరిలో 2,43,582మంది, చంద్రగిరిలో 3,15,159మంది, తిరుపతిలో 3,02,503మంది,శ్రీకాళహస్తిలో 2,48,536మంది, సత్యవేడులో 2,15,385మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో అత్యధికంగా ఓటర్లున్న నియోజకవర్గం చంద్రగిరి కావడం విశేషం.

జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని ఈనెల 18 నుంచీ 25వ తేదీ వరకూ పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలకు దాఖలైన నామినేషన్ల పరిశీలన శుక్రవారం ముగిసింది. పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులు కలిపి మొత్తం 227 మంది నామినేషన్లు వేయగా అందులో 50 మంది నామినేషన్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. మిగిలిన 177 మంది నామినేషన్లను ఆమోదించారు. ఇందులో పార్లమెంటుకు 27మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా ముగ్గురివి చెల్లుబాటు కాలేదు. మిగిలిన 24మందివీ ఓకే అయ్యాయి. అలాగే జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు గానూ 200మంది అభ్యర్థులు నామినేషన్లు ఫైల్ చేయగా పరిశీలనలో 47మందివి తిరస్కరణకు గురయ్యాయి.మిగిలిన 153మంది నామినేషన్లు చెల్లుబాటవుతాయని అధికారులు ప్రకటించారు. - తిరుపతి, ఆంధ్రజ్యోతి

50నామినేషన్ల తిరస్కృతి

- 177 మంది అభ్యర్థులవి ఆమోదం
- తిరస్కరణకు గురైన వాటిలో 3 ఎంపీ ,47అసెంబ్లీ

స్థానం	మొత్తం అభ్యర్థులు	తిరస్కరణ	పోటీలో వున్న అభ్యర్థులు
తిరుపతి పార్లమెంటు	27	3	24
గూడూరు అసెంబ్లీ	21	6	15
సూళ్ళూరుపేట అసెంబ్లీ	16	2	14
వెంకటగిరి అసెంబ్లీ	17	7	10
చంద్రగిరి అసెంబ్లీ	43	17	26
తిరుపతి	52	4	48
శ్రీకాళహస్తి	27	4	23
సత్యవేడు	24	7	17
మొత్తం	227	50	177

డిపాజిట్ చెల్లించకుండా నామినేషన్

తిరుపతి పార్లమెంటు స్థానానికి ఇండిపెండెంట్ అభ్యర్థిగా డి.విజయ్ దాఖలు చేసిన నామినేషన్ తిరస్కరణకు గురైంది. పరిశీలనలో ఈయన నామినేషన్ పత్రాలతో పాటు చెల్లించాల్సిన డిపాజిట్ సొమ్ము చెల్లించకపోవడంతో నామినేషన్ చెల్లలేదు.అలాగే మరో ఇండిపెండెంట్ అభ్యర్థి కె.సుబ్బయ్య వేసిన నామినేషన్ చెల్లుబాటు కాలేదు. పరిశీలనలో పదిమంది ప్రతిపాదకు లకు గానూ తొమ్మిదిమందే ప్రతిపాదించినట్టు అధికారులు గుర్తించారు. దీంతో ఆయన నామినేషన్ తిరస్కరణకు గురైంది.

వయసు సరిపోకున్నా...

గూడూరు నియోజకవర్గంలో వయసు సరిపోకున్నా ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వైసీపీ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ కుమారుడు రేవంత్ చక్రవర్తి వైసీపీ తరపున నామినేషన్ వేశారు. స్క్రూటినీలో అతడి వయసు 24 ఏళ్ళని గుర్తించారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి కనీస వయసు 25ఏళ్ళు నిండి వుండాలి. దీంతో అతడి నామినేషన్ తిరస్కరణకు గురైంది. కాగా తండ్రి ఎమ్మెల్సీగా వుండి కూడా కనీస ఎన్నికల నిబంధనలు తెలియకుండా కుమారుడి చేత నామినేషన్ వేయించడం గమనార్హం. అదే నియోజకవర్గంలో కమతం కామాక్షి అనే యువతి ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశారు. పరిశీలనలో ఆ యువతి వయసు 20 ఏళ్ళని తేలింది.దీంతో ఆమె నామినేషన్‌ను కూడా తిరస్కరించారు.

ప్రతిపాదకులు లేకుండానే...

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి కుమార్తె బి.పవిత్ర వైసీపీ తరపున దాఖలు చేసిన నామినేషన్ చెల్లుబాటు కాలేదు. అధికారుల పరిశీలనలో ఆమె పదిమంది ప్రతిపాదకులు లేకుండానే నామినేషన్ వేసినట్టు గుర్తించారు. దీంతో నామినేషన్‌ను తిరస్కరిం చారు. ప్రధాన పార్టీల తరపున అసలైన అభ్యర్థి వేసే నామినేషన్ ఏదైనా కారణాల వల్ల చెల్లుబాటు కాకుండా పోతే ప్రత్యామ్నాయ అభ్యర్థిగా కుటుంబ సభ్యులు లేదా సన్నిహిత బంధువులు నామినేషన్ వేయడం సర్వ సాధారణం. అయితే ఇక్కడ ఎమ్మెల్యే కుమార్తె అసలు ప్రతిపాదకులే లేకుండా చెల్లుబాటు కాని నామినేషన్ పత్రాలు సమర్పించడం గమనార్హం.

సంతకాలు మరిచిన ఇద్దరు అభ్యర్థులు

సత్యవేడు అసెంబ్లీకి ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ పత్రాల్లో కొన్ని చోట్ల సంతకాలు చేయడం మరిచారు. దీంతో వారిద్దరి నామినేషన్లు చెల్లుబాటు కాలేదు. సురేష్ అనే అభ్యర్థి ఫారం 26 అఫిడవిట్‌లో సంతకం చేయలేదు. అలాగే మరో ఇండిపెండెంట్ థామస్ కూడా అఫిడవిట్లలో సంతకాలు చేయలేదు.

బోగస్ ప్రపోజర్‌తో...

ఆయన నామినేషన్ వేసిందేమో నీతి నిజాయితీ పార్టీ తరపున. కానీ నామినేషన్ పత్రాలలో పేర్కొన్న ప్రతిపాదకుడేమో బోగస్. సత్యవేడు నియోజకవర్గంలో నీతి నిజాయితీ పార్టీ తరపున చిట్టిబాబు అనే వ్యక్తి నామినేషన్ వేశారు. స్క్రూటినీలో ప్రతిపాదకుడు బోగస్ అని గుర్తించిన అధికారులు నామినేషన్ను తిరస్కరించారు.

అనుభవం, అవగాహన వున్నాయి...

ఐపీఎస్ అధికారిగా ప్రభుత్వ పాలనపై తనకు అపారమైన అనుభవం, అవగాహన వున్నాయని... ప్రజలు అవకాశమిస్తే వాటిని ఉపయోగించి నియోజకవర్గ అభివృద్ధిని అత్యున్నత స్థాయికి తీసుకెళ్ళడం ద్వారా వారి రుణం తీర్చుకుంటానని చెబుతున్నారు తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్.ప్రతిపక్షంలో వుండగానే ఎంపీగా నియోజకవర్గానికి విలువైన సేవలు అందించిన తాను ఈ పర్యాయం గెలిస్తే కేంద్ర, రాష్ట్రాల్లో ఏర్పడే ఎన్డీయే ప్రభుత్వాల అండతో తిరుపతిని అద్భుతంగా తీర్చిదిద్దుతానని ప్రజలకు మాట ఇస్తున్నారాయన. తిరుపతి ఎంపీగా, గూడూరు ఎమ్మెల్యేగా తాను చేసిన అభివృద్ధిని వివరిస్తూనే ఈ ఎన్నికల్లో గెలిస్తే పార్లమెంటు నియోజకవర్గంలో చేపట్టబోయే అభివృద్ధి గురించి తన ఆలోచనలను, అభిప్రాయాలను ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు. అవన్నీ ఆయన మాటల్లోనే...

అవకాశమిస్తే రుణం తీర్చుకుంటా!

బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్

ఇంటర్వ్యూ

తిరుపతి, ఆంధ్రజ్యోతి





ఎంపీగా అవకాశమిస్తే మరెవ్వరూ చేయలేని రీతిలో అభివృద్ధి చేయడం ద్వారా ప్రజల రుణం తీర్చుకుంటా. ఈ ఎన్నికల్లో గెలిస్తే తిరుపతి వరల్డ్ క్లాస్ రైల్వే స్టేషన్ పనులు పూర్తి చేయిస్తా. ప్రస్తుతం అక్కడ పార్కింగ్ సదుపాయం లేదు. గతంలో నేను చేసిన ప్రతిపాదన ప్రకారం వెయ్యి వాహనాలు పార్కు చేసే సదుపాయం వుండాలి. ఆ సౌకర్యం కల్పిస్తా. ఆ ప్రాంతంలో అనేక చోట్ల సబ్‌వేల అవసరం వుంది. వాటిని ఏర్పాటు చేయిస్తా. అలాగే కొత్త సైబర్ కేఫ్, హోటల్స్, రెస్టారెంట్లు, ప్లే గ్రౌండ్‌లు పెట్టించడానికి కృషి చేస్తా. ప్లాట్ ఫామ్ విస్తరించేలా చూస్తా.ఆగిపోయిన నడికుడి- శ్రీకాళహస్తి పనులను మొదలు పెట్టించి పూర్తయ్యేలా శ్రద్ధ తీసుకుంటా. రేణిగుంట-తిరుపతి నడుమ కూడా సబ్‌వేలు పూర్తి చేయిస్తా.రేణిగుంట సీఆర్‌ఎస్‌ను మరింత విస్తృత పరిచేందుకు ప్రయత్నిస్తా.దానివల్ల ఉద్యోగాలు పెరుగుతాయి.తిరుపతి-రేణిగుంట నడుమ కాటన్ మిల్లును అభివృద్ధి పరిచి ఉద్యోగాలు వచ్చేలా చూస్తా.

అనేక ఇతర అభివృద్ధి పనులు చేయించా!

చరిత్ర కలిగిన రాయలచెరువుకు 76 ఏళ్ళుగా గేటు లేదు.గ్రామస్తులు సమస్య వుందని చెబితే గేట్ చేయించా. తిరుపతి సీతమ్మ నగర్‌కు ఎంపీ నిధులతో ఎలక్ట్రికల్ మెటీరియల్ మంజూరు చేయించా. స్కావెంజర్స్ కాలనీలో పేద ప్రజల నుంచీ భూమి లాక్కోకుండా కాపాడా. పేదల ఎదుగుదలకు చదువు చాలా ముఖ్యమనేది నా అభిప్రాయం. ముఖ్యంగా పేద పిల్లలు చదువుకునే సంక్షేమ హాస్టళ్ళలో పరిస్థితులు మెరుగుపడేందుకు కృషి చేశా. తరచూ హాస్టళ్ళను తనిఖీ చేశా.

సీబీఐసీతో పరిశ్రమలు రప్పిస్తా!

చెన్నై-బెంగుళూరు ఇండస్ట్రియల్ కారిడార్ ద్వారా జిల్లాకు పరిశ్రమలు రప్పించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తా. ఈ కారిడార్ వల్ల ప్రధానంగా చిల్లకూరు మండలంలో పరిశ్రమలు రావాల్సి వుంది. అలాగే చెన్నై-వైజాగ్ ఇండస్ట్రియల్ కారిడార్ కూడా జిల్లా మీదుగా వెళుతోంది. సాగరమాల కింద తీర ప్రాంతాలను కనెక్ట్ చేస్తూ రహదారులు అభివృద్ధి చెందుతాయి. దాని ద్వారా కూడా జిల్లాకు పరిశ్రమలు తేవడానికి గట్టిగా ప్రయత్నిస్తా. రెండు కారిడార్ల వల్ల వెంకటగిరి, గూడూరు, సూళ్ళూరుపేట, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో ఎక్కువగా పారిశ్రామిక వాడల ఏర్పాటుకు అవకాశాలున్నాయి. దాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నిస్తా.

పర్యాటక అభివృద్ధికి కృషి... అభయారణ్యపు ఆంక్షలు తొలగిస్తా!

తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో పర్యాటక రంగ అభివృద్ధికి విశేష అవకాశాలున్నాయి.ఐపీఎస్ అధికారిగా పర్యాటక శాఖ కమిషనర్‌గా పనిచేశా.ఆ రంగంపై అనుభవం,అవగాహన వున్నాయి. నియోజక వర్గంలో తీర ప్రాంతాలుండడం పర్యాటక రంగానికి వరంగా మారింది.వాకాడులో తూపిలి వద్ద బీచ్ టూరిజం అభివృద్ధికి అవకాశాలున్నాయి.అయితే దురదృష్టవశాత్తూ నేలపట్టు పక్షుల అభయారణ్యం వున్న కారణంగా కేంద్ర అటవీ, పర్యావరణ శాఖలు అనేక ఆంక్షలు విధించాయి. దాంతో కనీసం బీటీ రోడ్డు నిర్మించే అవకాశం కూడా లేదు. గొల్లల గాటు నుంచీ కారికేడు వరకూ రోడ్లు లేవు. అలాగే కొత్తపాలెంలోనూ రోడ్లు లేవు. నేను గతంలో ఎంపీగా వున్నపుడు రూ. 80 లక్షలతో గ్రావెల్ రోడ్డు వేయించా. మళ్ళీ గెలిస్తే వైల్డ్ లైఫ్ యాక్ట్ కింద అమలవుతున్న ఆంక్షలు ఎత్తివేయిస్తా.గ్రావెల్ రోడ్ల స్థానంలో బీటీ రోడ్లు వేయిస్తా. వాకాడు మండలం మొనపాలెం నుంచీ నవాబ్ పేట వరకూ ఆంక్షలు తీసేయించి బీటీ రోడ్లు లేదా సీసీ రోడ్లు వేయిస్తా. పర్యాటక రంగ అభివృద్ధికి కేంద్రం నుంచీ నిధులు తెప్పిస్తా.

తిరుపతిలో ప్రజాస్వామ్యం కరువైంది!

గడచిన ఐదేళ్ళుగా తిరుపతిలో ప్రజాస్వామ్యం కరువైందని విన్నా. ప్రభుత్వ ఆస్తులతో పాటు ప్రజల సొంత ఆస్తులు కూడా దౌర్జన్యంగా తీసుకుంటున్నట్టుగా తెలిసింది. ప్రజల్లో భయాందోళనలు నెలకొని వున్నాయి. ఈసారి గెలవబోయే 370 మంది బీజేపీ ఎంపీల్లో నేను కూడా వుంటానన్న నమ్మకం వుంది. నాకు చట్టం తెలుసు. పోగొట్టుకున్న భూములను తిరిగి సొంతదార్లకు అప్పగించేలా చూస్తా.

తుడా అభివృద్ధిలో అసమానతలు లేకుండా చూస్తా!

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ఈ ప్రాంత అభివృద్ధికి చాలా కీలకం. అయితే తుడా పనితీరు సమగ్రంగా లేదు. కొన్ని ప్రాంతాలు ఎక్కువగా అభివృద్ధి చెందుతుంటే మరికొన్ని ప్రాంతాలను విస్మరించారు. తుడా పరిధిలోని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి పరచాల్సిన అవసరముంది. ఆ దిశగా గట్టిగా కృషి చేస్తా.

గూడూరులో బాగా పనిచేసినా టికెట్ ఇవ్వలేదు!

ఎమ్మెల్యేగా ఈ ఐదేళ్ళు గూడూరులో బ్రహ్మాండంగా పనిచేశా. గతంలో ఏ ఎమ్మెల్యే చేయనంత అభివృద్ధి చేశా. ఎలాంటి అవినీతికీ పాల్పడలేదు.అయినా టికెట్ నిరాకరించి మళ్ళీ నేను ప్రజల్లో వుండేందుకు అవకాశం ఇవ్వలేదు.సీఎం ఏవో నామినేటెడ్ పోస్టులు ఇస్తామన్నారు. నువ్వు నా గుండెల్లో వున్నావు... నిన్ను ఎలా పోగొట్టుకుంటాం అన్నారు. ఏవేవో లబ్ధి చూపించారు. జీవితంలో ఏ లబ్ధికీ లొంగని వాడిని ఈ నామినేటెడ్ పదవులకు లొంగుతానా?

దళిత నాయకత్వాన్ని అవమానించారు!

మాలాంటి చదువుకున్న వారు కూడా రాజకీయాల్లో వుండాలన్న చిన్న విషయం కూడా సీఎంకు తెలియకపోతే ఎలా? జగన్ తండ్రి రాజశేఖర్‌రెడ్డి సొంత సామాజికవర్గం వారిని సలహాదార్లుగా పెట్టుకోలేదు.ఉండవల్లిని ప్రోత్సహించారు.కేవీపీ రామచంద్రరావును సలహాదారుగా పెట్టుకున్నారు.ప్రజాస్వామ్యంలో అన్ని వర్గాలనూ కలుపుకుని ముందుకు తీసుకెళ్ళాలే తప్ప అధికారంలో నేనే వుండాలి... వేరే ఎవరూ వుండకూడదు... నేకొక్కడినే పార్టీ అన్న విధానం వుంటే ఎలా? నన్నే కాదు రాష్ట్రవ్యాప్తంగా దళిత నాయకత్వాన్ని సీఎం జగన్ అవమానించారు.

ఓడినా గెలిచినా జనంలోనే వున్నా!

ఓడినా గెలిచినా తేడా చూపకుండా జనంలోనే వున్నా. అధికారం వున్నా లేకున్నా సమస్యల పరిష్కారానికి కృషి చేశా.2009లో ప్రజారాజ్యం తరఫున ఎంపీగా ఓడిపోయినా కూడా నియోజకవర్గం వదిలిపెట్టకుండా ప్రజలకు అందుబాటులో వున్నా. రాజకీయ నాయకులు, కుల నాయకులు, ప్రజా సంఘాలతో కలసి పనిచేశా. నా కుటుంబం నాపై ఆధారపడదు. ఎవరి వ్యాపారాలు వారికున్నాయి.అవినీతికి పాల్పడాల్సిన అవసరం, ఆలోచన మాకు లేదు. ఎవరిపైనా కక్ష సాధింపు వుండదు. ఎవరిపైనా కేసులు పెట్టించలేదు. ఎవరినీ దూషించలేదు. ప్రజలు ప్రశాంతంగా సంతోషంగా వుండేందుకు కృషి చేస్తా. నన్ను నమ్మండి.

వచ్చేది ఎన్డీయే ప్రభుత్వాలే.... అందుబాటులో వుండి అభివృద్ధి చేస్తా

కేంద్ర రాష్ట్రాల్లో వచ్చేది ఎన్డీయే ప్రభుత్వాలే. నియోజకవర్గంలోనే పూర్తి సమయం ప్రజలకు అందుబాటులో వుంటా. ప్రభుత్వ పాలనపై నాకు ఎంతో అనుభవం వుంది. అవగాహనతో పాటు సమర్థతా వుంది. బ్యూరోక్రాట్‌గా అభివృద్ధి ప్రతిపాదనలు ఎలా చేయాలో, ఫైళ్ళు ఎలా కదిలించాలో, అనుమతులు ఎలా సాధించాలో, నిధులు ఎలా పొందాలో నాకు తెలియంది కాదు. గతంలో ఎంపీగా వున్నపుడు అపాయింట్‌మెంట్ లేకుండా ప్రధాని మోదీని ఆరుసార్లు కలిశా. అలాంటిది ఇపుడు ఆయన ప్రభుత్వంలోనే ఎంపీగా మళ్ళీ గెలిస్తే నా అనుభవాన్ని, సమర్థతను వినియోగించి తిరుపతి పార్లమెంటు నియోజకవర్గానికి సరికొత్త రూపమిచ్చేందుకు శ్రమిస్తా!

తిరుపతి ఎంపీగా ఎవ్వరూ చేయని అభివృద్ధి చేశా!

తిరుపతి ఎంపీగా 2014లో గెలిచాక నియోజకవర్గాన్ని గతంలో ఎవ్వరూ చేయనంతగా అభివృద్ధి చేశా. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుంటే ఆరింటిలో కార్యాలయాలు ఏర్పాటు చేశా. ఏడాదిలో 365 రోజులూ ప్రజలకు అందుబాటులో వున్నా. కార్యాలయాల్లో సిబ్బందిని పెట్టి మరీ సమస్యలపై వచ్చిన ప్రజలకు అవసరమైన లెటర్లు అందేలా చూశా.నియోజకవర్గ పరిధిలోని 1500 గ్రామాల్లో పర్యటించా. 1400 గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టా. దానికోసం నా ఎంపీ నిధులతో పాటు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులను కూడా భారీగా తెప్పించా. ఆ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కమ్యూనిటీ హాళ్ళు, బస్ షెల్టర్లు, ఇతర భవనాలు కట్టించా. ఇతరులు చేసినట్టు ఐఎస్ఐ మార్క్ లేని నాసిరకం వీధిలైట్లు, గ్రావెల్ రోడ్లకు నిధులు కేటాయించి వృధా చేయలేదు.

విదేశీ విమాన సర్వీసులు నడిపిస్తా!

తిరుపతి విమానాశ్రయం అంతర్జాతీయ విమానాశ్రయంగా ఎదగడానికి 2014-17 నడుమ కీలక పాత్ర పోషించా. భూ సేకరణలో భూములు, భవనాలు కోల్పోయిన రైతులకు, బాధితులకు పరిహారం అందించడానికి కేంద్రం నుంచీ నిధులు కూడా విడుదల చేయించా. విమానాశ్రయ విస్తరణ పనులు జరిగినా దురదృష్టవశాత్తూ విదేశీ విమాన సర్వీసులు ఇంతవరకూ మొదలు కాలేదు.ఎప్పటినుంచో జిల్లా వాసులు, ఇరుగుపొరుగు జిల్లాల వారు గల్ఫ్ దేశాలకు బతుకుదెరువు కోసం వెళుతున్నారు. అలాగే ఇటీవలి కాలంలో విదేశీ విద్య కోసం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ యువత ఇతర దేశాలకు వెళ్ళడం పెరుగుతోంది.అంతేకాకుండా విదేశాలు సందర్శించేందుకు టూరిస్టులుగా వెళుతున్న వారి సంఖ్య కూడా క్రమేపీ ఎక్కువవుతోంది. ఇలాంటి వారు బెంగళూరు, చెన్నై, హైదరాబాదు విమానాశ్రయాల నుంచీ విదేశాలకు ప్రయాణించాల్సి వస్తోంది. నేను గెలిస్తే విదేశీ విమాన సర్వీసులు ప్రారంభమయ్యేలా చూస్తా. తొలుత దుబాయ్, సింగపూర్, మలేషియా, అబుదాబి వంటి సమీప దేశాలకు సర్వీసులు నడిచేలా చూస్తా. తర్వాత యూరప్ దేశాలకు, ఆటుపై అమెరికాకు కూడా విమాన సర్వీసులు నడవడానికి కృషి చేస్తా.

ఇపుడు జరుగుతున్న ప్రాజెక్టులన్నీ ప్రతిపాదించింది నేనే!

ప్రస్తుతం తిరుపతి లోక్‌సభ నియోజకవర్గంలో జరుగుతున్న ప్రాజెక్టులన్నింటినీ ప్రతిపాదించింది నేనే. వాటి ప్రతిపాదనలు మొదలుకుని మంజూరు వరకూ నా పాత్ర చాలా కీలకం.తిరుపతి వరల్డ్ క్లాస్ రైల్వే స్టేషన్ పేరిట అభివృద్ధి ప్రతిపాదనలు నేనే పెట్టా. తిరుపతి-రేణిగుంట నడుమ ఇరు వైపులా అభివృద్ధి చెందేందుకు వీలుగా మూడు సబ్‌వేలు ప్రతిపాదించా. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే ట్రాక్ నిర్మాణ పనులు ఆగిపోతే తిరిగి ప్రారంభించేలా చేశా.తిరుపతి స్మార్ట్ సిటీ మొదటి దశలో ప్రధాన పాత్ర పోషించా.నాటి కేంద్ర మంత్రి వెంకయ్య నాయుడిని కలసి స్మార్ట్ సిటీగా తిరుపతిని మొదటి విడతలోనే ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేశా. తిరుచానూరు రైల్వే స్టేషన్ ఏర్పాటుకు కారణం కూడా నేనే.ఎన్నో ఏళ్ళుగా ఆగిపోయి వుండిన నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారి పనులు తిరిగి మొదలు పెట్టించా. ప్రత్యేక హోదా కోసం రాజీనామా చేయడం వల్ల మిగిలినవి చేయలేకపోయా.

ఇదీ మందు

కండువా కప్పేశారు



వైసీపీ కండువాలో పూల ఆనంద్



తిరిగి టీడీపీలో చేరిన పూల ఆనంద్

మామా వైసీపీ కండువా వేసుకో... గెలిచాక నీకేం కావాలో అడిగి పండగ చేసుకో... అంటూ తమ క్లాస్మేట్ మెడలో బలవంతంగా బులుగు కండువాను వేసేశారు పాత మిత్రులు. అయితే వారం తిరగకుండానే సదరు వ్యక్తి టీడీపీలో చేరి ఆ పాతమిత్రులను కంగుతినిపించారు. ఇంతకీ ఆయనెవరంటే శ్రీకాళహస్తికి చెందిన పూల ఆనంద్. హైదరాబాదులో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఉన్నారు. టెన్త్‌లో ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ఈయన క్లాస్‌మేట్. ఇంటర్‌లో ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి బ్యాచ్‌మేట్. అయితే ఈయన మాత్రం తొలి నుంచీ టీడీపీనే. ఒక భూవివాదంలో వారం కిందట అంజూరు శ్రీనివాసులును కలిశారు. ఇక్కడే ఆయన మెడలో బులుగు కండువా పడిపోయింది. అదెలాజరిగిందో ఆయన మాటల్లోనే చదవండి... 'అంజూరు శ్రీనివాసులు ఇంట్లో నేను ఉన్నపుడు అక్కడకి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి వచ్చారు. పాత స్నేహితులం మాట్లాడుకుంటూ ఉండగానే నా మెడలో వైసీపీ కండువా కప్పేశారు. గొడవ పడలేక వచ్చేశాను. అయితే మర్నాడు ఆ ఫోటోను వైరల్ చేశారు. పైగా పార్టీ మారినందుకు నేను రూ.20 లక్షలు తీసుకున్నానని అబద్దాలు ప్రచారం చేశారు." అంటూ ఆయన బొజ్జల సుధీర్ రెడ్డిని కలిసి తాను టీడీపీలోనే ఉన్నానని స్పష్టం చేశారు. స్నేహాన్ని కూడా రాజకీయాల్లోకి ఈడ్చేస్తారా అని శ్రీకాళహస్తి ప్రజలు విస్తుపోయారు.

- శ్రీకాళహస్తి

అన్యాయం గదా డాక్టర్!

డాక్టర్‌తో ఆ పేషెంట్ గొంతు పెంచి అరుస్తున్నట్టుగా మాట్లాడుతూ ఉంటే ఓపిలో ఉన్నవాళ్లంతా గుమికూడారు. నర్సులు డాక్టర్‌కి రక్షణగా నిలబడ్డారు. 'చూడండి సార్ ఈ అన్యాయం' అని తన సహ పేషెంట్ల వైపు చూశాడు అతను. ఏమైంది అన్నట్టుగా అందరూ ముఖాలు పెట్టారు.

'పేదోళ్లకి ఒక వైద్యం.. పెద్దోళ్లయితే ఇంకో వైద్యం చేస్తే ఎట్ల సార్?' అన్నాడతను అదే గొంతుతో.

జరిగింది ఏమిటంటే.. వారం కిందట అతను బైకుమీద నుంచి పడ్డాడు. నుదుటికి దెబ్బతగిలి బొటబొటా రక్తం కార్చుకుంటూ ఆసుపత్రికి వచ్చాడు. డాక్టర్ తుడిచి నాలుగు కుట్లు వేసి, బ్యాండేజ్ అతికించి వారం తర్వాత రా అని పంపించాడు. వారం తర్వాత వచ్చిన ఆ పేషెంట్ ఇప్పుడు డాక్టర్‌తో గొడవ పడుతున్నాడు.

'చూడండి సార్.. ఇంక బ్యాండేజ్ వద్దు. తీసెయ్ అంటా ఉండాడు ఈ డాక్టర్' అన్నాడతను కంప్లైయినింగ్‌గా..

'నీకు మెడకాయమింద తలకాయ ఉండాదా.. గాలి తగిలి గాయం ఆరాల.. బ్యాండేజి అట్నే ఉంటే సెప్టిక్ అయిపోతాది అని గదా సార్ చెప్తావుండేది' అని నర్సు విరుచుకుపడింది.

అతను మాత్రం తగ్గలేదు.

'మరి చిన్న గులకరాయి తగిలితే ఆయప్పకి మాత్రం ఇన్ని రోజులైనా బ్యాండేజీ తీయలేదు ఎందుకు? నేను ఇచ్చేదీ డబ్బులే కదా.. నాకూ వైద్యం అట్నే గదా చెయ్యాల?"అని నుదిటి మీద ఉన్న బ్యాండేజీని తడుముకుంటూ అతను ప్రశ్నించాడు.

డాక్టర్‌కి ఏం జవాబు చెప్పాలో తెలీక బిక్క మొహం వేసుకుని చూశాడు. జనం మాత్రం జగన్‌ను తలచుకుని నవ్వుకుంటూ ఉండిపోయారు.



- తిరుపతి, ఆంధ్రజ్యోతి

చిత్తూరు జిల్లా కార్వేటినగరానికి చెందిన మునస్వామి రేటు తక్కువని తన సమీపంలో తమిళనాడు పరిధిలోని పల్లెపట్టు బంకుకు వచ్చి ట్రాక్టరులో డీజిల్ వేయించుకుంటారు. ఆయనే కాదు అక్కడి ద్విచక్ర వాహన చోదకులూ ఇక్కడికే వచ్చి పెట్రోలు కొనుక్కుంటారు. తడ మండల గ్రామాలవారు తమకు దగ్గరగా ఉన్న తమిళనాడు పరిధిలోని ఆరంబాకం, ఎళావూరు వెళ్లి బంకుల్లో పెట్రోలు,డీజిల్ వేయించుకుంటారు. కర్ణాటక సరిహద్దులోని ఆంధ్రా వాసులు కూడా తమకు దగ్గరలోని పొరుగు రాష్ట్ర బంకులకే క్యూ కడతారు.


- తిరుపతి(నేరవిభాగం)



పెట్రోలు లీటరు ధర రూ.లలో			
సంవత్సరం	తిరుపతి	తమిళనాడు	కర్ణాటక
2018	75.13	74.93	75.13
2024	109.52	103.88	102.95

డీజిల్ లీటరు ధర రూ.లలో			
సంవత్సరం	తిరుపతి	తమిళనాడు	కర్ణాటక
2018	69.10	69.10	68.92
2024	97.35	92.34	93.18





వ్యాట్ ఈజ్ దిస్ బాదుడు జగనా

- వైసీపీ పాలనలో పెట్రోలు,డీజిల్ ధరలపై అమాంతం వ్యాట్ పన్ను పెంపు
- దేశంలోనే లేని రేట్లతో మోయలేని భారం
- గగ్గోలు పెడుతున్న వాహన యజమానులు

జగన్ గత ఎన్నికల ప్రచార సభల్లో బాదుడే బాదుడు అంటూ విమర్శలు గుప్పించారు. తాను అధికారంలోకి రాగానే ధరలన్నీ కిందకు దించేస్తానని జనాన్ని ఆశల పల్లకిలో ఊరేగించారు. తీరా అధికార పగ్గాలు చేపట్టేక అసలైన బాదుడెలా ఉంటుందో చూపించారు. కేంద్రం ధరలు నిర్ణయించే పెట్రోలు,డీజిల్‌పైనా తన ప్రతాపం చూపించారు. పొరుగు రాష్ట్రాలే నయమనిపించేలా పెంచేశారు. 2022 నుంచి దేశంలోనే ఎక్కడా లేనంతగా రాష్ట్ర వాటా కింద వ్యాట్, రోడ్డు అభివృద్ధి సెస్‌ల పేరుతో అదనపు వడ్డనకు దిగారు.

బండి తీయాలంటేనే భయం

గతంలో లీటరు పెట్రోలుపై రాష్ట్ర ప్రభుత్వం వ్యాట్ రూ.11.95 వసూలు చేసేది. జగన్ అధికారంలోకి వచ్చిన రెండేళ్ళ తర్వాత వ్యాట్ పెంచుకుంటూ పోయారు. దేశంలో ఎక్కడా లేని రోడ్డు అభివృద్ధి పన్ను కూడా ఈ భారానికి జోడించారు. దీంతో 2022లోనే ఇంధనంపై వ్యాట్ రూ.15.44కి చేరుకుంది. ఇప్పుడది ఇంకా పెరిగిపోయింది. తాజాగా పెట్రోలు ధర తీరును పరిశీలిస్తే డీలర్‌కు లీటర్ రూ.60.39కి విక్రయిస్తుండగా ఎక్సైజ్ డ్యూటీ కింద రూ.19.90 వేస్తున్నారు. డీలర్ కమీషన్‌గా రూ.2.84, వ్యాట్ రూపంలో ఏకంగా రూ.26.39 వసూలు చేస్తున్నారు. వ్యాట్ అమాంతం పెంచేయడంతో ఇంధన వినియోగదారులు బండి తీయాలంటేనే భయపడుతున్నారు.

వినియోగదారులకు డీ'జెల్ల'

వ్యాట్ ప్రభావంతో డీజిల్ ధరలూ పెరిగి ఆటో డ్రయివర్లు లాంటి చిన్న బతుకుల నడ్డి విరిచింది. లీటర్ డీజిల్ డీలరుకు రూ.50.47కి విక్రయిస్తుండగా ఎక్సైజ్ డ్యూటీ కింద రూ.17.65, డీలరు కమీషన్‌గా రూ.2.84,వ్యాట్ రూపంలో రూ.26.39 వసూలు చేస్తున్నారు. దీంతో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన బంకుల్లో ధరలు అధికంగా ఉంటున్నాయని వాహన చోదకులు గగ్గోలు పెడుతున్నారు. తమపై జగన్‌కు నిజమైన ప్రేమాభిమానముంటే వ్యాట్ తగ్గించి ఇంత భారం మోపేవారుకాదంటున్నారు వాహన చోదకులు. బయటకు దొరక్కుండా ఇంధన ధరలతో బాదేసి పరోక్షంగా అన్ని ధరలూ పెరిగేలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దారుణంగా దోచేస్తున్నారు


జగన్ వచ్చినప్పటి నుంచి పెట్రోలు,డీజిల్ ధరలు పెరిగిపోయాయి. దీనికితోడు .రోజూ ఎక్కడో ఒక చోట పోలీసులు అన్యాయంగా మా ఆటో డ్రయివర్లపై పెనాల్టీలు వేస్తూనే వున్నారు. వారంలో రూ.500 నుంచి రూ. 800 వరకు చలానాలు కడుతున్నాం. మా నుంచి దోచుకుంటున్నారేగాని పైసా ఉపయోగం లేదు.

- శ్రీనివాస్, ఆటో డ్రైవర్, మంగళం

ఏమీ మిగలడం లేదు

లారీలు, వ్యాన్లు బాడుగకు అడిగేవారే లేకుండా పోయారు. లోనులో బండి తీసి ఖాళీగా పెట్టుకుంటున్నాను. అయినా క్వార్టర్ ట్యాక్స్ కట్టాల్సిందే. చంద్రబాబు హయంలో క్వార్టర్ ట్యాక్స్ రూ. 800 కట్టేవాళ్ళం. దాన్ని రద్దు చేసి జగన్ లైఫ్ ట్యాక్స్ పేరుతో రూ.38,000 వసూలు చేస్తున్నారు. ఇది కాకుండా గ్రీన్ ట్యాక్స్ మరో 1200కట్టాలి. ఇవన్నీ భరించలేక బండ్లు అమ్ముకుంటున్నాం.

- గోపి, ఐషర్ వాహనం, తిరుపతి



పరమ చెత్త ప్రభుత్వం

ఇది పరమ చెత్త ప్రభుత్వం. ఏ వర్గాన్ని వదలి పెట్టడంలేదు. పెట్రోలు ధరలు విపరీతంగా పెంచేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ లీటరు రూ.109.52 వుంది. గతంలో రూ.700కి స్కూటర్ ట్యాంకు నిండిపోయేది. ఇప్పుడు రూ. 1150కి పట్టుకుంటే ట్యాంకు నిండతా వుంది. జగన్ వ్యాట్‌తో దారుణంగా బాదేస్తున్నారు.

- రామచంద్ర, మధురానగర్

శ్రీకాళహస్తి చరిత్ర

రాజకీయ ఆధ్యాత్మిక క్షేత్రం



ఆధ్యాత్మికంగానే కాదు రాజకీయంగానూ విశిష్టతను సంతరించుకుంది శ్రీకాళహస్తి. ఇక్కడి సుప్రసిద్ధ శైవక్షేత్రం నిరంతరం భక్తులతో సందడిగా వెలుగొందుతుంది. మరో పక్క ఇక్కడ రాజకీయం కూడా వాడీవేడీగా ఉంటుంది. రాష్ట్రపతి పదవిని అలంకరించిన తెలుగు తేజం నీలం సంజీవరెడ్డి తొలినాళ్లలో 1953 ఉప ఎన్నికల్లో ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలిచి ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. వారసత్వ రాజకీయాలకూ ఈ అసెంబ్లీ నియోజకవర్గం పెట్టింది పేరు. అద్దూరి బలరామిరెడ్డి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలవగా ఆయన కుమారుడు దశరథరామిరెడ్డి ఒక పర్యాయం ఎన్నికయ్యారు. అలాగే బొజ్జల గంగ సుబ్బరామిరెడ్డి ఒకసారి ఎమ్మెల్యేగా గెలుపొందగా ఆయన కుమారుడు గోపాలకృష్ణరెడ్డి ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తాజా ఎన్నికల్లో ఈ కుటుంబం నుంచి గోపాలకృష్ణరెడ్డి తనయుడు సుధీర్‌రెడ్డి టీడీపీ అభ్యర్థిగా తలపడుతున్నారు. ఇక్కడ నుంచి గెలుపొందిన ముగ్గురు రాష్ట్ర మంత్రులయ్యారు. 1962లో గెలిచిన అద్దూరి బలరామిరెడ్డి విద్యాశాఖ మంత్రి అయ్యారు. బొజ్జల గోపాలకృష్ణరెడ్డి మూడు పర్యాయాలు మంత్రి పదవి నిర్వర్తించారు.

- శ్రీకాళహస్తి

మొత్తం ఓటర్ల సంఖ్య : 2,47,844
పురుషులు : 1,19,658
మహిళలు: 1,28,172
ఇతరులు: 14

నియోజకవర్గం ఏర్పడింది: 1952
ఎన్నిసార్లు ఎన్నిక జరిగింది:17

నియోజకవర్గం స్వరూపం:
శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాలు, శ్రీకాళహస్తి మున్సిపాలిటీ

ఎమ్మెల్యేలు

1952 - అద్దూరి బలరామిరెడ్డి- కాంగ్రెస్
1953 -నీలం సంజీవరెడ్డి - కాంగ్రెస్
1955 - పట్ర సింగరయ్య - కాంగ్రెస్
1962- అద్దూరి బలరామిరెడ్డి- కాంగ్రెస్
1967- బొజ్జల జీఎస్ రెడ్డి - స్వతంత్ర
1972 - అద్దూరి బలరామిరెడ్డి- స్వతంత్ర
1978 - ఉన్నం సుబ్రహ్మణ్యనాయుడు -కాంగ్రెస్
1983 - అద్దూరి దశరథరామిరెడ్డి- తెలుగుదేశం
1985 - సత్రవాడ మునిరామయ్య - తెలుగుదేశం
1988(ఉప ఎన్నిక) - తాటిపర్తి చెంచురెడ్డి - కాంగ్రెస్
1989,94,99 -బొజ్జల గోపాలకృష్ణారెడ్డి - తెలుగుదేశం
2004- ఎస్‌సీవీ నాయుడు - కాంగ్రెస్
2009, 2014- బొజ్జల గోపాలకృష్ణారెడ్డి - తెలుగుదేశం
2019 - బియ్యపు మధుసూదనరెడ్డి - వైసీపీ

● జంపింగ్ జపాంగ్

అటునిటు దూకి...



బుధవారం పల్లం సర్పంచ్ గోపాల్‌యాదవ్‌ను కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న బొజ్జల సుధీర్‌రెడ్డి



గురువారం టీడీపీ నుంచి వైసీపీలో చేరుతూ ఎమ్మెల్యే చేతుల మీదుగా కండువా కప్పుకుంటున్న పల్లం సర్పంచు చీమల గోపాల్ యాదవ్

ఏర్పేడు మండలంలో పల్లం పంచాయతీ సర్పంచు చీమల గోపాల్‌యాదవ్ గత కొన్నాళ్లుగా వైసీపీపై అసంతృప్తితో దూరంగా ఉన్నారు. బుధవారం ఆయన శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. అయితే ఏమైందో ఏమోగానీ, అదే చీమల గోపాల్ యాదవ్ గురువారం సాయంత్రం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి సమక్షంలో టీడీపీని వీడి వైసీపీలో చేరుతున్నట్టు ఫోటో ప్రత్యక్షం అయ్యింది.


-ఏర్పేడు


ఇదేనా సాగునీటి భరోసా

- సాగునీటికి పైసా విదల్చని ప్రభుత్వం
- ఆగిపోయిన ప్రాజెక్టుల ఆధునికీకరణ
- తీవ్రంగా నిరసిస్తున్న అన్నదాతలు

అన్నదాత పక్షపాతిని.
రైతు సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం.
సాగునీటి రంగ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. రైతు భరోసా విడుదల లాంటి సందర్భాల్లో సీఎం జగన్ ఊదరగొట్టే మాటలివి. ఆచరణలో ఆయన మాటలన్నీ నీటిమూటలేనని ఐదేళ్ల అనుభవంలో రైతులందరికీ అర్థమైంది. సత్యవేడు నియోజకవర్గంలో జగన్ ప్రభుత్వం పైసా విదల్చక ఆగిపోయిన నీటి ప్రాజెక్టులే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి.. సాగు రంగాన్ని జగన్ నీరుగార్చారని అన్నదాతలు దుమ్మెత్తిపోస్తున్నారు.

- సత్యవేడు





అటకెక్కిన ఆరణియార్ ఆధునికీకరణ

ఆరువేల ఎకరాల ఆయుకట్టుకు ఆధారమైన ఆరణియార్ ఆధునికీకరణను జగన్ సర్కార్ పూర్తిగా విస్మరించింది. పిచ్చాటూరు,నాగలాపురం మండలాల్లో రైతులకు మేలు చేసే ఈ ప్రాజెక్టు ఆధునికీకరణకు 2017లో నాటి టీడీపీ ప్రభుత్వం రూ.35 కోట్లు విడుదల చేసింది. 2019 ప్రథమార్థంలో పనులు ప్రారంభమయ్యాయి. అదే ఏడాది వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పనులు అటకెక్కాయి. కాంట్రాక్టరుకు సకాలంలో ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. అప్పటి నుంచి అతీగతి లేదు. ప్రాజెక్టు ఆధునికీకరణ పూర్తిస్థాయిలో జరిగితే ఏటా రెండు పంటలు సాగు చేయవచ్చు.



కేవీబీపురం మండలంలోని కాళంగి రిజర్వాయర్

కలగా కాళంగి ఆధునికీకరణ

కేవీబీపురం మండలంలోని కాళంగి రిజర్వాయర్ ఆధునికీకరణ అమలుచేయని హామీల చిట్టాలో మిగిలిపోయింది. నాలుగేళ్ళలో ప్రాజెక్టు అభివృద్ధికి ఈ ప్రభుత్వం పైసా కూడా విడుదల చేయలేదు. మూడు టీఎంసీల సామర్థ్యానికి పెంచుతామన్న నేతల మాట నెరవేరలేదు. ఇటీవల గేట్ల మరమ్మతులకు మొక్కుబడిగా రూ.10 లక్షలు విడుదల చేసి ప్రభుత్వం చేతులు దులుపుకొంది.

- నారాయణవనం మండలంలోని వెత్తలతడుకు, తిరువట్యం ప్రాజెక్టులకు 2005లో భూమిపూజ జరిగింది. ప్రాజెక్టుల పనులు పూర్తయి పదేళ్లవుతున్నా కుడి, ఎడమ కాలువల నిర్మాణం పూర్తికాక నిరుపయోగంగా మారింది.
- నాగలాపురం మండలం భూపతీశ్వరప్రాజెక్టు ఆధునికీకరణ మాటలకే పరిమితమైంది. నిల్వ సామర్థ్యం లేక ఏటా కొండ కోనల నుంచి వచ్చే వర్షపు నీరు సముద్రం పాలవుతోంది. సత్యవేడు, నాగలాపురం మండలాల్లో మూడువేల ఎకరాలకు ఈ ప్రాజెక్టే ఆధారం.
- నల్లచెరువు ఎడమ కాలువలో నాలుగేళ్ళ నుంచి పూడికతీత పనులు చేపట్టలేదు. ఆయకట్టులోని 3500 ఎకరాలకు నీరు అందడం గగనంగా మారింది.
- వరదయ్యపాళెం మండలంలోని ఉబ్బలమడుగు ప్రాజెక్టు పరిస్థితి కూడా దయనీయంగా ఉంది.


జై తెలుగుదేశం... జై జై తెలుగుదేశం..!
స్వాగతం... సుస్వాగతం...
నందమూరి నటసింహం
శ్రీ నందమూరి బాలకృష్ణ గారు
రోడ్ షో
27-04-2024
శనివారం
మధ్యాహ్నం
3.00 గంటలకు
రాపూరు పట్టణములో
రోడ్‌షో జరుగును.
కావున నందమూరి
అభిమానులు,
తెలుగుదేశం పార్టీ,
భారతీయ జనతా పార్టీ,
జనసేన పార్టీ నాయకులు,
కార్యకర్తలు, అభిమానులు
వేలాదిగా పాల్గొని
ఈ కార్యక్రమాన్ని జయప్రదం
చేయవలసినదిగా కోరుకుంటూ...
వెంకటగిరి ప్రజలు,
టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు
సైకిల్ గుర్తుకు
మన ఓటు
రండి తరలిరండి అభివృద్ధి ప్రదాతను ఆశీర్వదించండి...
ఆశయ సాధకుడికి అండగా నిలబడండి..!
పోలింగ్ తేది
2024
మే 13
సోమవారం

ఇంటింటా సంక్షేమం టీడీపీతోనే సాధ్యం



ఆనేపూడి సభలో మాట్లాడుతున్న పరసా రత్నం - కాట్రగుంట, కానూరుల్లో టీడీపీ నాయకుల ప్రచారం - చంద్రశేఖరపురంలో సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

దొరవారిసత్రం, ఏప్రిల్ 26: రాష్ట్రంలో ఇంటింటా సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరసా రత్నం అన్నారు. దొరవారిసత్రం మండలంలోని నెల్లూరుపల్లి, నేలపట్టు, కొత్తపల్లి, ఆనేపూడిల్లో సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ, పార్టీ మండల అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులు నాయుడితో కలసి ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామగ్రామాన సిమెంట్ రోడ్లు, మురుగునీటి కాల్వలు నిర్మించడమే కాకుండా ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుదే అన్నారు. అప్పుల ఊబిలో కూరుకు పోయిన ఆంధ్రరాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకురావాలంటే చంద్రబాబును సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మనోహర్‌రెడ్డి, జక్కరయ్య, డి.రాజేంద్ర, ప్రసాదనాయుడు, బాబునాయుడు, సుజాతమ్మ, తదితరులు ఉన్నారు.

బాలాయపల్లి: బిడ్డల భవిష్యత్తు బాగుండాలంటే టీడీపీ అధినేత చంద్రబాబు సీఎం కావాల్సి ఉందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు అన్నారు. మండలంలోని కాట్రగుంట పంచాయతీలోని కొత్తూరు, అరిగేపల్లి, కాట్రగుంట, తిక్కవరం, కరిమెనగుంటల్లో ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ చేపట్టే సంక్షేమపథకాలను వివరిస్తూ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ, ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావుకు ఓట్లు వేయాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు ఎం.రామయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి రాయి సత్యంనాయుడు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కె. శ్రీహరి, దాసరి రాజగోపాల్ నాయుడు, మండల ఉపాధ్యక్షుడు బి.మురళీమోహన్ రెడ్డి, సర్పంచు ఎం.గోపీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: టీడీపీ అధినేత చంద్రబాబును మళ్లీ సీఎంగా చేసుకోవడమే లక్ష్యంగా ఎన్నికల్లో కష్టపడి పని చేయాలని సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగురైతు ఉపాధ్యక్షుడు కే.వీ.నాయుడు, బీసీసెల్ అధ్యక్షుడు జి. రామకృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని కానూరు, తాళ్వాయిపాడు, పుల్లూరు పంచాయతీల్లో శుక్రవారం బాబును మళ్లీ రపిద్దాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. వి.వెంకటేశ్వర్లు, నెలవల ప్రసాద్, బి.మునికుమార్, శేఖర్‌రాజు, ప్రసాద్‌రాజు, రామచంద్రయ్య చలపతి తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన నాయకులతో ఇన్‌చార్జి నెలవల - వాకాడులో ఓటర్లకు సూపర్‌సిక్స్ కరపత్రాలు అందిస్తున్న సునీల్‌కుమార్

వైసీపీ నాయకుల చేరిక

ఓజిలి: మండలంలోని కరబల్లవోలుకు చెందిన వైసీపీ నాయకులు సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం సమక్షంలో పార్టీలో చేరారు. నాయుడుపేటలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కె.శివకుమార్‌రెడ్డి, వి.రవీంద్రరెడ్డి, ఎస్.రవికుమార్, ఎం.లక్ష్మయ్య, షేక్ మీరాబాషా చేరిన వారిలో ఉన్నారు. పార్టీపై విశ్వాసం ప్రకటించారు. చంద్రబాబు గెలుపు కోసం పార్టీకి అంకితమై పనిచేస్తామని ప్రకటించారు. టీడీపీ నాయకులు నారాయణరెడ్డి, మస్తాన్‌రెడ్డి, సుబ్బారావు, భాస్కర్‌రెడ్డిలతోపాటు పలువురు నాయకులు ఉన్నారు.

వాకాడు: గూడూరు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం జరగాలంటే సైకిల్‌కు ఓటు వేయాలని టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ కోరారు. మండలంలోని వాకాడు పట్టణం సహా బీసీ కాలనీల్లో శుక్రవారం సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, దువ్వూరు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పాశం మాట్లాడుతూ... రాష్ట్రానికి పూర్వవైభవం రావాలంటే చంద్రబాబును సీఎం చేయాలన్నారు. మండలంలోని సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు మేలు జరుగుతుంద న్నారు. ఆయన వెంట బి.ప్రమీల, ఎస్.సుధాకర్‌రెడ్డి, ఏ.చంద్రయ్య, కె.దయాకర్, టి.మోహన్‌నాయుడు, షేక్ రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అవకాశం ఇవ్వండి

కోట: రాష్ట్రంలో రాక్షసపాలన మరో కొద్దిరోజుల్లో వెళ్లనుందని మంచి రోజులు రానున్నాయని టీడీపీ మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు మస్తాన్‌బాషా చెప్పారు. మండల పరిధిలోని గూడలి పంచాయతీలో ని చంద్రశేఖరపురం దళిత, గిరిజన వాడల్లో శుక్రవారం టీడీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా నాయకులు ఇంటింటా తిరిగి చంద్రబాబు ప్రవేశపెట్టనున్న సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేసి అవగాహన కల్పించారు. చంద్రబాబును ఆశీర్వదించి గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

రెడ్డి సామాజిక వర్గ ఆత్మీయ సమావేశం

● నాయుడుపేటలో అడ్డుకున్న ఎన్నికల అధికారులు

తడ, ఏప్రిల్ 26: మండలంలోని పండ్లూరు సమీపంలోని ఓ హోటల్‌లో రెడ్డి సామాజిక వర్గ ఆత్మీయ సమావేశాన్ని ఎన్నికల అధికారులు అడ్డుకున్నారు. శుక్రవారం ఆ హోటల్‌లో అధికారపార్టీకి చెందిన సుమారు 200 మంది రెడ్డి సామాజిక వర్గం నాయకులు, ముఖ్యులు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి అధికార పార్టీ అనుకూల పత్రిక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పాల్గొన్నట్లుగా తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో తమ సామాజికవర్గం జగన్‌కు అండగా ఉండాలంటూ ఆయన కోరినట్లు తెలిసింది. ఒక వేళ ఫలితాలు వ్యతిరేకంగా వస్తే సామాజిక వర్గం తీవ్ర ఇబ్బందులు పడుతుందని సమావేశంలో హెచ్చరించినట్టు తెలిసింది. సుమారు 2 గంటలపాటు సమావేశం జరగ్గా, విషయం ఎన్నికల అధికారులకు తెలియడంతో చివరలో వారు వచ్చి అడ్డుకున్నట్టు సమాచారం. అనుమతి లేకుండా పార్టీలపరంగా ఎటువంటి సభలు, సమావేశాలు నిర్వహించరాదని హెచ్చరించారు. అయితే పార్టీలకు సంబంధించిన సమావేశం కాదని నిర్వాహకులు చెప్పడంతో ఎలాంటి సమావేశమైనా అనుమతి తీసుకోవాల్సిందే అంటూ అధికారులు తెలపడంతో వచ్చినవారు వెళ్లిపోయినట్లుగా సమాచారం. దీనిపై ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి నాయుడుపేట ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా... సమావేశం జరిగింది వాస్తవమేనన్నారు. అది పార్టీలకు సంబంధం లేదని తెలియడంతో వారిని వెనక్కు పంపేశామని చెప్పారు.

బాలయ్యబాబు రోడ్‌షోను విజయవంతం చేద్దాం: పాశం

గూడూరు, ఏప్రిల్ 26: పట్టణంలో శనివారం జరగనున్న నందమూరి బాలకృష్ణ రోడ్ షోను విజయవంతం చేయాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ శనివారం సాయంత్రం 4గంటలకు కోర్టు సెంటర్ వద్ద బాలకృష్ణ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరుగుతుందన్నారు. సాధుపేట సెంటర్, మున్సిపాలిటీ రోడ్డు, గాంధీబొమ్మసెంటర్, కుమ్మరవీధి మీదుగా టవర్ క్లాక్ చేరుకుంటుందని అక్కడ ఆయన ప్రసంగిస్తారన్నారు. పరిశీలకుడు కరిముల్లా, ఎస్.భాస్కర్‌రెడ్డి, పి.శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, వెంకటేశ్వర్లురెడ్డి, బి.చెంచురామయ్య, రవీంద్రరెడ్డి, అబ్దుల్‌రహీం తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్‌ఎంపీలతో సునీల్‌కుమార్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

గూడూరులో ఆరు నామినేషన్ల తిరస్కరణ

గూడూరు అర్బన్, ఏప్రిల్ 26: గూడూరు నియోజకవర్గ పరిధిలో ఆరు నామినేషన్లను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. ఎన్నికల సాధారణ పరిశీలకుడు కరీగౌడ, ఆర్వో కిరణ్‌కుమార్ పర్యవేక్షణలో సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నామినేషన్ల స్క్రూటినీ నిర్వహించారు. ఫారం-ఏ, బీ సమర్పించకపోవడంతో గోను సంధ్యారాణి, పాశం సురేష్‌కుమార్, పాశం జశ్వంత్‌కుమార్, చిల్లకూరు వేమయ్య నామినేషన్లను తిరస్కరించారు. వీరిలో తొలుత అభ్యర్థిగా ప్రకటించి ఆ తరువాత అధిష్ఠాం బీ-ఫారం ఇవ్వకపోవడంతో వేమయ్య బరి నుంచి తప్పుకోవాల్సివచ్చింది. ఆర్టికల్ 173(బీ) ప్రకారం 25 సంవత్సరాలు వయస్సు నిండకపోవడంతో మేరిగ కళ్యాణ్‌చక్రవర్తి, కమతం కామాక్షి నామినేషన్లను తిరస్కరించారు. దీంతో ఎన్నికల బరిలో 15మంది మిగిలారు. టీడీపీ నుంచి పాశం సునీల్‌కుమార్, వైసీపీ నుంచి మేరిగ మురళీధర్, కాంగ్రెస్ నుంచి డాక్టర్ యు రామకృష్ణారావు తదితరులు బరిలో నిలిచారు. ఈనెల 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉన్నట్లు ఆర్వో తెలిపారు.

వెంకటగిరిలో పదకొండు...

వెంకటగిరి టౌన్: వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 31 నామినేషన్లు దాఖలు కాగా వాటిలో 20 ఆమోదం తెలిపామని ఆర్వో ధ్యాన్‌చంద్ చెప్పారు.

సూళ్లురుపేటలో ఎనిమిది...

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట నియోజకవర్గ నామినేషన్ల పరిశీలన ప్రశాంతంగా జరిగింది. మొత్తం 31 నామినేషన్లకుగాను ఎనిమిదింటిని తిరస్కరించినట్టు ఆర్వో చంద్రముని తెలిపారు. ప్రస్తుతం 14 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. వీరిలో టీడీపీ నుంచి నెలవల విజయశ్రీ, వైసీపీ నుంచి కిలివేటి సంజీవయ్య, కాంగ్రెస్ నుంచి శివ తదితరులు పోటీలో ఉన్నారు. టీడీపీ నుంచి నెలవల రాజేష్ సమర్పించిన రెండు సెట్లు, వైసీపికి చెందిన కిలివేటి సుభాషిణి 3 సెట్లు, కాంగ్రెస్ నుంచి గాడి తిలక్‌బాబు రెండు సెట్లు, కన్నంబాకం హరికృష్ణ నామినేషన్‌ను తిరస్కరించారు.

ఏడుగంటల కరెంటులోనూ కోతలా?



దేగవారికండ్రిగ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 26: వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సక్రమంగా చేయడం లేదంటూ మండల పరిధిలోని దేగవారికండ్రిగలో శుక్రవారం సబ్‌స్టేషన్ ముందు రైతులు ధర్నా చేపట్టారు. 9 గంటల సరఫరాను 7 గంటలకు కుదించడమే కాకుండా ఆ ఏడు గంటల్లో కోతలు విధిస్తున్నారని దామానెల్లూరు, దేగవారికండ్రిగ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లకు కూడా విద్యుత్ ఎప్పుడు వస్తుందో, పోతుందో తెలియడం లేదన్నారు. ఈ సమస్యలపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదని మండిపడ్డారు. అక్కడున్న సిబ్బంది ధర్నాపై ఉన్నత అధికారులకు సమాచారం అందించారు. రైతులతో మాట్లాడిన అధికారులు విద్యుత్ సమస్య తలెత్తకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

అమర ఆస్పత్రిలో 3డీ టెక్నాలజీ ఎంఆర్ఐ

రేణిగుంట, ఏప్రిల్ 26: రేణిగుంట మండలం కరకంబాడి సమీపంలో వున్న అమర ఆస్పత్రిలో అత్యాధునిక త్రీడీ టెక్నాలజీ ఎంఆర్ఐ యంత్రాన్ని, బ్లడ్‌బ్యాంక్‌ను మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, గల్లా రామచంద్రనాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ గౌరినేని ప్రసాద్, డాక్టర్ గౌరినేని రమాదేవి, రేడియాలజిస్టు వినోద్, సీవో వేణుగోపాల్, ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజరు నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎంఆర్ఐ స్కానింగ్, బ్లడ్ బ్యాంక్ గదులను ప్రారంభిస్తున్న గల్లా రామచంద్రనాయుడు

ఎంపీగా మరోసారి అవకాశం ఇవ్వండి



టీడీపీ నాయకుడు మన్నారపు వెంకటరత్నయ్యతో మాట్లాడుతున్న వెలగపల్లి వరప్రసాద రావు - చెన్నూరు దళితవాడలో స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వెలగపల్లి

బాలాయపల్లి/గూడూరు, ఏప్రిల్ 26: తిరుపతి ఎంపీగా ఒకసారి పనిచేసిన అనుభవం ఉందని అప్పట్లో తాను చేసిన అభివృద్ధే ఇప్పటికీ కనబడుతోందని మరోసారి తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు అన్నారు. శుక్రవారం బాలయపల్లి మండలం జయంపు గ్రామంలో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తన హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. తాను ఎప్పుడు అందుబాటులో ఉంటానని సమస్యలను పరిష్కరించడంలో ముందుంటానన్నారు. అనంతరం టీడీపీ నాయకుడు మన్నారపు వెంకటరత్నయ్య ఇంటికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. తన గెలుపునకు సహకరించాలని కోరారు. ఏ అవసరం వచ్చినా తాను అందుబాటులోఉంటానని హామీ ఇచ్చారు.

గూడూరు అభివృద్ధికి ఎంతో కృషి...

గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా పనిచేసినప్పుడు ఎన్నో సమస్యలను పరిష్కరించానని ఎంతో అభివృద్ధి చేశానని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. శుక్రవారం సాయంత్రం గూడూరు మండలం చెన్నూరు గ్రామంలో దళితవాడలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దళితుల సమస్యల పట్ల తాను చిత్తశుద్ధితో పనిచేస్తానని చెప్పారు. అనంతరం గూడూరు పట్టణంలో టీడీపీ, జనసేన నాయకులతో భేటీ అయ్యారు. కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు.

ఓటీపీ చెప్పాడు... రూ.35 వేలు కాజేశారు!

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 26 : ఓటీపీ చెప్పమన్నారు... చెప్పాడు... అకౌంట్ నుంచి రూ.35 వేలు కాజేశారు. వివరాలలోకి వెళ్లితే... నాయుడుపేట పట్టణంలోని టీ దుకాణం నిర్వహిస్తున్న సురేష్ సెల్‌ఫోన్‌కు ఓ కాల్‌వచ్చింది. నీ క్రెడిట్ కార్డుకు కాలం చెల్లింది రెన్యువల్ చేయాలంటే ఓటీపీ చెప్పాలన్నాడు. అదే సమయంలో తన మొబైల్‌కు వచ్చిన ఓటీపీని సురేష్ తెలిపాడు. తక్షణమే ఆయన అకౌంట్‌లో ఉన్న రూ.35వేలు నగదు డ్రా అయినట్టు మెసేజ్ వచ్చింది. లబోదిబోమంటూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో సురేష్ ఫిర్యాదు చేశాడు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 26: పట్టణంలోని బాపూజీ వీధి, కచ్చేరివీధి, సాయినగర్, జీఎస్టీ రోడ్డు, సూళ్లూరు, పడమటి కండ్రిగ ప్రాంతాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఏ ఖాదర్ బాషా తెలిపారు. చెంగాళమ్మ ఆలయం సమీపంలోని సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో అధికారులు చెప్పారు.

11మంది వలంటీర్ల రాజీనామా

కోట, ఏప్రిల్ 26 : మండల పరిధిలోని కొక్కుపాడు పంచాయతీ పరిధిలో 10 మంది, ఉత్తమనెల్లూరు పంచాయతీ నుంచి ఒక వలంటీరు శుక్రవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీవో శంకరయ్యకు అందజేశారు. వాటిని ఆమోదిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

ఏరియా ఆసుపత్రికి ఎల్ఈడీ బల్బుల వితరణ

గూడూరు, ఏప్రిల్ 26: స్థానిక ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆసుపత్రికి అవసరమైన 10 ఎల్ఈడీ ట్యూబ్‌లైట్లను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, రాము, డాక్టర్లు రాజా, రవికుమార్, మధుసూదన్, రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిట్టగోడపైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



వాకాడు, ఏప్రిల్ 26: పట్టణంలోని వాకాడు అశోక్ పిల్లర్ సెంటర్ సమీపంలోని స్వర్ణముఖి నది తూపిలి సరఫరా కాలువ వంతెన పిట్టగోడపైకి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లింది. శుక్రవారం రాత్రి గూడూరు నుంచి వాకాడు డిపోకు వస్తున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి చల్లకాలువ వంతెనపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ప్రయాణికులకు తృటిలో ప్రమాదం తప్పింది. బస్సు ముందు భాగం పాక్షికంగా ధ్వంసమైంది. కాగా అశోక్ పిల్లర్ ప్రాంతంలో విద్యుద్దీపాలు వెలగక పోవడంతో ప్రమాదం జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు.

మహిళలకు పుట్టినిల్లు టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న సంధ్యారాణి

గూడూరు, ఏప్రిల్ 26: తెలుగుదేశం పార్టీ మహిళలకు పుట్టినిల్లులాంటిదని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో మహిళల ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడుతూ... టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ హయాంలో మహిళలకు ఆస్తిలో సమానహక్కు కల్పించారన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను చంద్రబాబు కొనసాగించడమే కా కుండా మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నార న్నారు. పొదుపు సంఘాలను ఏర్పాటుచేసి మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేశారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహాశక్తి పథకం ద్వారా మహిళలకు పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామన్నారు. పరిశీలకుడు కరిముల్లా, ఎం.శ్రావణి, జి.లీలావతి, భారతి, శ్రీదేవి, సుబ్బమ్మ, కల్పన తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలకులను గద్దెదించుదాం

చిల్లకూరు: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీని గద్దెదించుదామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం పట్టణంలోని శంకరన్ గిరిజనకాలనీలో తానంకి నానాజీ ఆధ్వర్యంలో సూపర్-6 పథకాలపై అవగాహన కల్పిస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోచుకోవడం, దాచుకోవడమే పనిగా వైసీపీ ప్రభుత్వం పాలన సాగించిందన్నారు. దళితులు, మహిళలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. మహిళాభివృద్ధి కోసం మహాశక్తి పథకాన్ని ప్రవేశపెట్టనున్నారని చెప్పారు. చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, జి.లీలావతి, భారతి, రామచంద్రారెడ్డి, దాసరి రాము, నెల్లూరు రామ్మూర్తి, సురేష్‌బాబు, మధు, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లలో ఆల్తూరుపాడు నుంచి సాగునీరు: కురుగొండ



రామకృష్ణను గజమాలతో సన్మానిస్తున్న గ్రామస్తులు

వెంకటగిరి, డక్కిలి, ఏప్రిల్ 26 : టిక్కెట్ ఇచ్చి మరో సారి వెంకటగిరి ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన తమ పార్టీ అధినేత చంద్రబాబుకు రుణపడి ఉంటానని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన వెంకటగిరి మండల పరిధిలోని జంగాలపల్లి, అమ్మపాళెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... సామాన్య కార్తకర్తగా వెంకటగిరిలోకి అడుగు పెట్టి 2009, 2014 ఎన్నికల్లో వరుసుగా రెండు సార్లు విజయం సాధించిన తాను ఇప్పటి వరకు రాజకీయాల్లో నిజాయితీగా పనిచేశానని గుర్తు చేశారు. పదేళ్లు ఎమ్మెల్యేగా ఉంటే ఐదేళ్లు మాత్రమే అధికారంలో ఎమ్మెల్యేగా పని చేశానన్నారు. ఆ ఐదేళ్లల్లో వెంకటగిరిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానన్నారు. ఇప్పటికీ అవే కనిపిస్తున్నాయి తప్ప వైసీపీ పాలనలో ప్రజలకు పెద్దగా ఒరిగిందేమీ లేదని విమర్శించారు. ఈ ఎన్నికల్లో విధ్వంస వైసీపీ పాలనకు ప్రజలు చమరగీతం పాడెందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పోలింగ్ తేదీ ఎప్పుడు వస్తుందా, జగన్‌ను ఎప్పుడు ఇంటికి పంపుతామా అంటూ ఓటర్లు ఆతృతగా ఎదురు చూస్తున్నారన్నారు. ఎక్కడికి వెళ్లినా రైతులు, కూలీలు, యువత, ఉద్యోగుల నుంచి అనుహ్య స్పందన వస్తోందన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే పాలనాదక్షుడైనా చంద్రబాబును ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమవుతుందని జనం గట్టిగా నమ్ముతున్నారని చెప్పారు. చంద్రబాబు విజన్, మోదీ ఇమేజ్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కమిట్‌మెంటు కావాలని ప్రజలు కోరుకొంటున్నట్లు వివరించారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో డక్కిలి మండలం ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణం పూర్తి చేసి రైతులకు తాగునీరు అందిస్తామని చెప్పారు. జగన్ ఒక్క చాన్సు అంటే ప్రజలు నమ్మి మోసపోయారని చెప్పారు. వెంకటగిరి నియోజకవర్గంలోని కొండ కింద గ్రామాల్లో అనేక మంది రైతులు సాగునీరు అందక పంటలు పండించుకోలేక వలసలు పోయే పరిస్థితిని వైసీపీ పాలకుల తీసుకు వచ్చారని విమర్శించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు, రూరల్ పార్టీ అధ్యక్షుడు పప్పు చంద్రమౌళి రెడ్డి, టి.రామచంద్రయ్య, ఎం.వెంకటేశ్వర్లు, మురళి, జి.వెంకటేశ్వర్లు, శివకోటి, మాజీ కౌన్సిలర్ చంద్రశేఖరరెడ్డి, పాపయ్య, భాస్కరరెడ్డి, గోవిందరెడ్డి, దశరథ, హరి, కె.శ్రీనివాసులునాయుడు పాల్గొన్నారు.

వెంకటగిరిలో మనమే గెలుస్తున్నాం



మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జుల సమావేశంలో దిశానిర్దేశం చేస్తున్న లక్ష్మీసాయి ప్రియ

వెంకటగిరిలో గెలుస్తున్నామని టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె లక్ష్మీసాయిప్రియ అన్నారు. శుక్రవారం ఆమె తన నివాసంలోని పార్టీ కార్యాలయంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జీలతో పోల్‌మేనేజ్‌మెంటు వంటి అంశాలపై ముఖాముఖి నిర్వహించారు. మెజార్టీతో గెలవబోతున్నామని, పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల వలే కష్టపడాలని కోరారు. నేటినుంచి ప్రతి గడపకు వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు చంద్రబాబు విజన్, పవన్ కల్యాణ్ కమిట్‌మెంటు, మోదీ ఇమేజ్‌ను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని చెప్పారు. యువత, మహిళల మద్దతు కూడా టీడీపీకే ఉందన్నారు. తాను ప్రచారం కోసం గ్రామాలకు వెళ్లినప్పుడు ఆ విషయం అర్థమైందన్నారు. యువత, మహిళల ప్రతినిధిగా తాను ఇక్కడే ఉండి వారికి అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన కోసం తెలుగుదేశం కట్టుబడి ఉందన్నారు. ఈ విషయం నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో తనతో చర్చించినట్టు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు శ్రీరామదాస్ గంగాధరం, నాయకులు మల్లారం బాబు, కాపా శ్రీనివాసులు నాయుడు, మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.